అక్టోబర్ 01-15, 2021
సంపుటి 01, సంచిక 24

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

## మహాత్మ గాంధీ
## జయంతి శుభాకాంక్షలు
### అక్టోబర్ 02





భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం
పోరాడి తెలంగాణ ప్రజల తెగువను,
పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక...
మన తెలంగాణ వీర వనిత **చాకలి ఐలమ్మ**


*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక



25 ఆదర్శమే జీవిత పరమావధి అని చెప్పే
**వేణుగోపాల రెడ్డి** కథ **"ఉద్యమ జీవి"**



21 నిలువెత్తు తెలుగుదనం
**అడవి బాపిరాజు**ను వివరించే
**ఎస్.వి. రామారావు** వ్యాసం...



09 బహుముఖ యోగి ప్రేమకథ, పాటై,
నాట్యమై, అజరామరమైన కవయిత్రి
**"మహలఖా బాయి చందా"**



04 బళ్ళు తెరుచుకున్న స్థితిని
తెలియజేసిన **సంపత్** కవిత
**"బడులు తెరుచుకున్నాయ్"**



13 ఉద్యమం మిగిల్చిన విషాద జ్ఞాపకం
తడిమే కథ **సూర్యాధనుంజయ్**
**"మనాది"**



20 గుట్ట గుండె మీద కురిసే కన్నీటిని
పసిగట్టిన **వేముగంటి మురళి**
కవిత **"పిట్టల మనిషి"**



39 జీవితాన్ని కవిత్వం చేసుకున్న
కవితా ఋషి
**కూరెళ్ల**తో ముఖాముఖి



ఒడిదిడుకుల **కాపరుల**
35 మనసును తెలిపే **దత్తయ్య** కథ

బతుకమ్మ పాట కవిత **ఐ.వి. సుబ్బాయమ్మ** **"పూల జాతర బతుకమ్మ"**... 47వ పేజీలో
వియోగ బాధ - లక్ష్యం గురించిన పట్టుదల, సంఘర్షణ చిత్రించిన నాటి కథ
**"తిరిగి రాను"**...05వ పేజీలో
సాహిత్యంతో సామాజిక ప్రయోజనం నిదర్శనంగా నిలిపే విధానం సమాజంలో
**భాస్కర భట్ల**పై విశ్లేషణ... 17వ పేజీలో
మనిషిలోని మరో పార్శ్వం చిత్రించిన కవిత **"సామ్రాజ్య వాదులు"**.... 23వ పేజీలో
పల్లె అందాలకు పద్యీకరణ, **వానమామలై జగన్నాథాచార్యుల** నాటి కవిత... ...08వ పేజీలో
మారుమూల పదాలు శీర్షిక లైన వైనం చూపిన కథలకు **రాచపాళెం** విశ్లేషణ
పుస్తక పరిచయంలో...29వ పేజీలో
**మేఘాలపైన** తన ఊహా శాలీనత **వాసరచెట్ల** కవిత... 34వ పేజీలో
తెలంగాణ **పర్జన్యం**గా కాళోజిని అభివర్ణించిన **నీహారిణి** కవిత... 49వ పేజీలో

**ఇంకా...** సాహితీ శిఖరం, దృశ్య సాహిత్యం, స్వీకారం మరెన్నో....

# ‘తంగేడు’ పాఠకులకు ముఖ్య గమనిక

తెలంగాణ జాగృతి తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం నవ యువతను ప్రోత్సహించడం కోసం వెలువరిస్తున్న ‘తంగేడు’ సాహిత్య పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ కృతజ్ఞతలు. అనూహ్యంగా కోవిడ్ సెకండ్‌వేవ్ విజృంభణ వల్ల పత్రికను నేరుగా ప్రింట్ కాపీను అందించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. ప్రస్తుతానికి పత్రికను వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుంది. పాఠకులు సహకరించగలరు. కోవిడ్ వ్యాప్తి తగ్గేంతవరకు ప్రింట్ కాపీ అందించలేకపోవచ్చు. పరిస్థితి అనుకూలించాక అందించగలం.

మేము అందించినంత కాలం ఎందరో పెద్ద రచయితలు, పాఠకులు ధర నిర్ణయించాల్సిందిగా ఎన్నో విజ్ఞప్తులు చేశారు. మీ కోరికను అనుసరించి నామమాత్రమైన వెల రూ. 2/-, వార్షిక చందా రూ. 50/-లుగా నిర్ణయించడం జరిగింది. ప్రింట్ కాపీ మాత్రం చందాదారులకు మాత్రమే పంపడం జరుగుతుంది. పాఠకులు గమనించ ప్రార్థన. చందా దారులుగా, మా పాఠక సభ్యులుగా మన ‘తంగేడు’ కుటుంబంలో చేరండి. చందావివరాలు దిగువున ఇస్తున్నాం.




## ‘తంగేడు’ సంచిక వార్షిక చందా వివరాలు

‘తంగేడు’ పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తంగేడు పత్రిక ప్రతి సంచికను పొందేందుకు గాను, వార్షిక చందాదారులుగా చేరండి. ఇందుకోసం రూ.50 చెల్లించి, 24 సంచికలను పొందండి. చందాదారులుగా చేరేందుకు http://www.thangedu.co.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకొని, ఆన్ లైన్ లో నగదు చెల్లించేందుకు వీలు కల్పించడం జరిగింది. డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, UPI ద్వారా నిర్ణీత నగదు చెల్లించగలరు. చెక్కుల ద్వారా కూడా వార్షిక చందాదారులుగా చేరవచ్చు.

**వార్షిక చందా చెక్కులను పంపవలసిన చిరునామా:**

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం.1-2-234/13/46/4,
3వ అంతస్తు, ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గర, అరవింద్ నగర్,
దోమలగూడ, హైదరాబాద్ - 500 029.

సంపాదకీయం

తంగేడు
తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక
01-15 అక్టోబర్, 2021
సంపుటి 01 సంచిక 24



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# గంటమే నీ భాష ...

సాహిత్యం చాలా లోతైనది. గాఢమైనది. వాచకంలో పురివిప్పిన వ్యంగ్యం ఒక స్థితి గల పాఠకుడు లేదా విమర్శకుడే పట్టుకోగలడు. రచయిత ముఖతా చెప్పలేని విషయాలెన్నో రచనలు చెబుతాయి. రచనలో ఉపరిభాషలో కనిపించని విషయాలెన్నో సృజనలోతుల్లో దాగుంటాయి. సెటైర్, శ్లేష, ఇంకా లోతుకు వెడితే ప్రతీక, ధ్వని లాంటి అంశాల మౌలిక లక్ష్యం కూడా సాహిత్య వ్యక్తీకరణలకు ఒక అంతర భాషను సృష్టించడమే. తద్వారా సామాజిక వ్యతిరేకశక్తులకు, తమ తప్పుల్ని ఎరిగించి సరైనదారిలో పెట్టడానికి ప్రయత్నించడమే. రచయిత వ్యక్తి మాత్రంగా పలికే భావం అతనిది ఒకరిదే కాదు. అది వ్యక్తీకరించినాక పలువురిది. అనేకమంది విజ్ఞులు, తాత్వికుల భావజాలానికి రచయిత వాక్యం ఒక ప్రాతినిధ్యం. దుఃఖితులకు ఒక పరామర్శ. పీడితులకు ఒక భుజం తట్టడం. వెరసి సమాజానికి కర్తవ్య బోధన.

సృజనకారునిది సమాజంలో ఉన్నతమైన స్థానం. మిథ్యాగౌరవాలకు, పొగడ్తలకు అతను లొంగకూడదు. అవార్డుల కోసం అర్రులు చాచకూడదు. ఇలాంటి చేష్టల వల్ల సృజనకారుడుగా తనకు సంక్రమించిన ఉన్నతిని కోల్పోతాడు. తనను సమాజం గుర్తించలేదనే దుగ్ధ కూడా సృజనకారునికి అవసరం లేదు. తనకు తెలిసిన పని సృజనకారునిగా కొనసాగడమే. తన అభివ్యక్తిని రోజు రోజుకు సాంద్రపరచుకోవడమే.

అవార్డులు, పదవులు అతనికి కొంత ఉత్సాహాన్నిచ్చేమాట నిజమే కాని వాటి వల్ల మాత్రమే అతను ఉన్నతిని సాధించలేడు. అట్లా సాధిస్తాననుకోవడం అప్రతిభుని లక్షణం. ప్రతిభాకారుడు తన ప్రతిభ వల్ల పదవికే వన్నె తెస్తాడు. నిజమైన ప్రతిభముందు ఇవన్నీ చాల చిన్నవి. సంయుక్త ఆంధ్రప్రదేశ్ లో సాహిత్యఅకాడమికి ఉపాధ్యక్షుడుగా పనిచేసిన విశ్వనాథను ఎవరైనా కవిగానే గుర్తు పెట్టుకున్నారు. ఎం.ఎల్.సి.గా పనిచేసిన వానమామాలై వరదచార్యులు మహాస్రజన కారుడనే అంటారు కానీ అయన పదవిని బట్టికాదు. రాజాస్థానంలో ఉన్నత పదవి నిర్వహించిన శ్రీనాథుడు చరిత్రలో కవిగానే నిలిచి పోయాడు. కాబట్టి రచయిత నిరంతర తపస్సు ఆయన్ని శిఖరాగ్రానికి చేర్చుతుంది. ప్రఖ్యాత సాహితీవేత్త లెందరికో చరమదశలోనే అవార్డులు వచ్చాయి. కాని వారి జీవితకాలంలో సృజనకు ఎట్లాంటి లోపం రాలేదు. సాధించిన పదవుల వల్ల అవార్డులవల్ల వాళ్లకు కొత్తగా వచ్చిన గుర్తింపు పెద్దగా ఏమీ లేదు.

కాబట్టి కవిభాష కలమే. ఏ హంగులు ఆర్భాటాలు అతన్ని ఉన్నతీ కరింపజాలవు. అతని సృజనలోని గాఢత దానికోసం అతను చేసే సాధనే, వెరసి అతని గంటం పలికిన భాషే అతన్ని శాశ్వతున్ని చేస్తుంది.

జై తెలంగాణ జై జాగృతి

కవిత

# బడులు తెరుచుకున్నాయి



బెల్లంకొండ సంపత్ కుమార్, 99085 19151

గూట్లోకి ఎగిరొచ్చిన పావురం!
ఎన్ని నెలలైనా అమ్మ మరుపుకు వస్తాదా!
అరలు అరలుగా బరువంతా
భుజాన బంధించి
సైనికునిలా అడుగేస్తున్నది
గ్లోబుతల పైకెత్తాకాలని
బడి ఒడిలో విశ్వాసం పలుకుతున్నది

పల్లేర్లు పరిహసిస్తున్నా
పలుగురాళ్ళు చీరుకుంటున్నా
ఆగని నడక ఓర్పు నేర్పుతున్నది

తీగలల్లుకున్న పందిళ్లలో
వనానికి వసంతం వచ్చినట్టున్నది
పాఠశాలకు బాల్యం వచ్చింది
జెండా వందనమంత సంబురంగా
తరగతి గదులు
చదువుల పండుగ చేస్తున్నాయి

కలిసి వచ్చిన అనుబంధాలు
క్లాసు మారిన ఆనందం
కలల పంట మీద
ఆశల వీక్షణం
వీచే గాలి
పూసే పూలు
పెరిగే మొక్కలు
ఆత్మలల్లుకున్న
అందాల హరివిల్లు
లేత పాదాల స్పర్శతో
నేల పులకిస్తున్నది

వయస్సు కాలాన్ని తీసుకొని
జ్ఞానాన్ని తయారు చేసుకుంటది
జ్ఞానం ముకుళించుకోని
వేరు వెతుక్కొని
విశ్వరచన చేస్తది
విలువల విద్యలోమాగి
ఆత్మ పరిపక్వం కావాలె కానీ
ఎదిగే మొక్కను
పెరిగే బాల్యాన్ని ఎవరాప గలరు?



(తెలంగాణ జాగృతి కాళోజి జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న నిర్వహించిన కవి సమ్మేళనంలో వినిపించిన కవిత)

నాటి కథ

# తిరిగిరాను

తిరిగి రాని ప్రేమ కోసం ఆమె తపన...

పెండ్యాల చినరాఘవరావు

అబ్బా నాలుగేండ్లా?...

"అంతవరకు?....." ఎవరో అవ్యక్త మధుర స్వరంలో అన్నట్టుగా ఆలాపనగా తోచింది రఘుకు. అంతవరకూ కుర్చీలో ఉదాసీనంగా కూచున్న వాడల్లా ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. శరీరంలో గగుర్పాటు, హృదయంలో సంచలనం.... రెండూ ఒకేసారి కలిగాయేమో! కాస్త గంభీరమైంది అతని కంఠస్వరం. అనుకోకుండా రెండు కనులనిండా గిఱ్ఱున నీళ్ళు తిరిగినాయి. ఎవరిదో చిరపరిచిత కంఠమే అది.

కిందటి రాత్రి జరిగిన ఘటన తిరిగి కళ్లెదుట వచ్చి నిలిచినట్టు తోచిందతనికి. మొదటి నుంచి చివరిదాకా మళ్ళీ ఆ రాత్రి సంగతులన్నీ ఒకసారి నెమరు వేసుకున్నాడు. "ఇదంతా నిజంగా జరిగి వుంటుందా." తన చెవులను హృదయం దగ్గరగా తెచ్చి మెల్లగా తెలుసుకో ప్రయత్నం చేశాడు. తనమీద, తన మనసుమీద తనకే నమ్మకం లేనంతగా ఐపోయాడిక. తనను తానే ........ పోయాడు. బాధతో పాతాళానికి క్రుంగిపోయిన తనని సంబాళించుకోలేక అలాగే కుర్చీలో కూలబడిపోయాడు. గత చిత్రం కళ్ళెదుట ఆడసాగింది.

'అబ్బా! నాలుగేండ్లా..... అంత వరకు....? గోడనానుకొని ఆమె భారంతో అనిన యీ.... చివరి వాక్యం రఘు హృదయాన్ని యెంతగా గాయపరచిందో! ఇప్పుడది మాటల్లో చెప్ప యత్నం చేయటం వృథా ప్రయాసయే ఔతుందేమో! ఆమె ఆ మాటల వెనక యెంత బాధ...... విహ్వలత..... కరుణ, ప్రాధేయతా భావం... ఇవన్నీ ఒక్కుమ్మడిగా సమ్మేళనమై దాగుడు మూతలాడుతున్నాయి? .... చెప్పడం కొంచెం కష్టమే.

అప్పుడామె ముఖం వివర్ణమై పోయింది. కళా విహీనంగా మారింది. నిరాశా, నిస్పృహలు విలయతాండవం చేస్తూ వికటాట్టహాసం చేస్తున్నాయి. "మారె! నేనిక యీ బ్రతుకు నీడ్వలేను?" అన్న భావం తాలూకు నిరుత్సాహ రేఖలు స్పష్టంగా ఆమె ఆ పేలిన, పాలిన మొగాన గోచరిస్తున్నాయి.

తనంటే ఆమెకు ప్రేమ లేదేమోననే భావం. కాదు అపోహ ఒకటి రఘు మనసులో బాగా నాటుకొని పోయింది. తనతో ఆమె కేర్పడిన ఈ స్వల్పకాల పరిచయంలోనే ఆమె తనని బాగా అర్థం చేసుకోలేదే? అని వాపోవటం నిజానికి రఘుకు తగదు. ఆమెను గురించి ఆమె మనస్తత్వాన్ని బాగా అవగాహన చేసుకో వీలుపడని ఈ కొద్ది వ్యవధిలోనే... ఆమెను "హృదయంలేని ఒట్టి రాతిబొమ్మ" క్రింద కట్టి పెట్టడం కూడా ఏమంత తెలివైన పని కాదు మరి. పైగా ఆమెను తనవైపు ఆకర్షించుకోవటానికి తంటాలు పడుతున్నాడు. తను చెప్పినట్లల్లా విని ఊకొట్టే 'చిలుక'లా తయారుచేసికోడానికి తంటాలుపడుతున్నాడు. ఆదర్శాల, యేవో ఆశయాల పేకముక్కలతో ఊహాసౌధాలు నిర్మించుకోవాలని కలలు గంటున్నాడు. కాని అదంతా పొసగేదెట్లా? తాను వలపట లాగితే, ఆమె దాపట... ఇక ఈ కొత్త బతుకు బండి నడిచినట్లే!

ఆమె తను అనుకున్నంత అడివి మనిషి కాదని, మనసు, మమత, లేని మగువ కాదనీ... ఇదీ యినాళ్ళ రఘు స్వానుభవం మీద గాని తెలుసుకోలేక పోయాడు. ఆపైన కొంచెం చకితుడైనాడు కూడా.

ఇన్నాళ్ళు ఆమెకు దూరదూరంగానే వుంటూ వచ్చాడు. ఆమె మీద కారాలు మిరియాలు నూరటంలో తక్కువేమీ చేయలేదు. అందుకని ఆమెలోని అవగుణాలనూ బయట పెట్టి నలుగురి యెదుట ఆమెను రద్ది చేయ చూచేడు. అతని కదొక ఆలంబనంగా ఐపోయింది.

కాని ఆమెలోగల కొన్నయిన మంచి గుణాలను, గ్రహించే శక్తి గాని, ఓపికగాని రఘుకు లేకపోయింది. తన స్వభావాన్ని, ప్రవృత్తిని కనిపెట్టి తదనుగుణంగా, అనుకూలంగా వర్తించకపోవడమే ఆమె తన పట్ల చేస్తున్న అపచారమని రఘు అభిప్రాయం. రఘుకు పూర్తిగా లోబడి

'చరణదాసి' అయ్యేటంత అమాయకురాలు కాదామె. రఘుకున్నట్లే ఆమెకూ... కొన్ని స్వంత అభిప్రాయాలు, స్వతంత్రాలోచనలు, కొన్నయినా మంచి భావాలు లేకపోలేదు. స్వతహాగా అభిమానవతి. పట్టుదల గల మనిషి. అందులో కొంచెం మంకుతనం, పెంకితనం కూడా వున్నాయంటే తప్పేమీకాదు.

ఈ కారణాలవల్ల రఘు నోటి నుంచి జారీ ఔతున్న ప్రతి హుకుంను హెచ్చరికను అట్టే ఆమోదించి అమలు పరిచే స్థితిలో ఆమె లేదు. కాని అతని స్వాభిమానం అతనిది... ఆమె అలసత్వం ఆమెదీను. ఈ పరస్పర భిన్న భావాల ఘర్షణలో శాంతిగాని, సామరస్యంగాని ఎలా ఉంటాయి? దానికి విరుగుడు ఒకటే. ఒకేచోట మన గలగాలంటే యిరువురిలో యెవరో ఒకరు కాస్త స్వాభిమానాన్ని చంపుకోవాలి. కొంచెం ఒక మెట్టు క్రిందికి దిగి పరిసరాల పరిస్థితుల నర్థం చేసుకోవాలి. ఇదివినా విడిపోవడమే యిక యిరువురికీ గత్యంతరం.

ఈ అభిప్రాయ భేదాలు చివరికీ ఘటనక్కూడా దారితీసినాయి. ఆమె తన పట్ల ముభావంగా మెలగడాన్ని మరో విధంగా అనుమానించాడు రఘు. ఆమె తన అస్వస్థత, నీరసమనోస్థితి కారణంగా అలా యెడంయెడంగా వుండటం అసహజమేమీ కాదు నిజానికి. ఆమె ఆ స్థితికి సానుభూతి కనబరచడానికి బదులు, పైగా అతనికి సహృదయం కొరవడింది.

"ఛీ!! నీ ముఖం చూడను" కోపం హద్దులు దాటింది రఘుకు. అయినా, ఆమె ఓర్చుకుంది. ఏమీ మారు పలుకలేదు. "అందుకనే వేరే మీ తోవ మీరు చూచుకొండి. నేను అడ్డురాను" అని నవ్వింది. సబాయితంగా ఆమె ఆ నవ్వు రఘు మనస్సును మరింత కలచి మెలిపెట్టి నట్లయింది. మాటకు మాట బదులు చెప్పడం ఆమె స్వభావమై పోయింది.

> **ఇదంతా** వగలు, వంచన అనే మాసిపోని భావం. అతని మేధోపీఠంలో తిష్టవేసుక్కూ చున్నది. యీ కొద్ది రోజుల్నుంచి, అంతకు కొన్ని క్షణాల క్రితమే ఆమె కురుపించిన స్నేహామృత భాషణం సైతం యిప్పుడు చప్పున మరిచిపోయాడు. అనవసర క్రోధం పైకి రానిచ్చాడు. సరసం విరసంగా మారింది.

కాని ఆమె వెంటనే యిటువైపు ముఖం త్రిప్పుకున్న రఘును తన వైపుకు లాగుకొని అతనిని అనునయించటానికి యెంతో ప్రయత్నం చేసింది. అతని తామసాన్ని చల్లార్చడానికి అంతకంటే మంచి ఉపాయం ఆమె ఊహకు తట్టలేదు. "నేనన్న దాంట్లో ఏమన్నా తప్పుంటే క్షమించొచ్చు" అనగలిగింది.

ఇదంతా వగలు, వంచన అనే మాసిపోని భావం. అతని మేధోపీఠంలో తిష్టవేసుక్కూచున్నది. యీ కొద్ది రోజుల్నుంచి, అంతకు కొన్ని క్షణాల క్రితమే ఆమె కురుపించిన స్నేహామృత భాషణం సైతం యిప్పుడు చప్పున మరిచిపోయాడు. అనవసర క్రోధం పైకి రానిచ్చాడు. సరసం విరసంగా మారింది. ప్రణయ కలహం ప్రళయరూపం తాల్చి, చిలికిచిలికి గాలివాన అయింది. ఆ కలహం అంత టితో అంతమైన అద్దం మీది నవ్వు గింజగా అయితే ఆనందించ వలసిందే. కాని అలా యెన్నటికీ జరుగలేదు.

ఆమె నేరమేమిటో నిర్ధారణ చేయడం యిదమిత్థమైపోయిందతనికి. అందుకే యిరుకున పడ్డాడు. అయితే మరి యీసడించుకోవడం మాత్రం తెలుసుగా! అతనితో తనకున్న పరిచయాన్ని చనువును పురస్కరించుకొని ఆమె కొన్ని వినరాని, అనకూడని మాటలు అనడంలో కొంత పొరబాట్లు వుండొచ్చు. తెలిసి తెలిసి అలాంటి పొరపాట్లు ఇదివరకెన్నోసార్లు చేసింది కూడా. కాని ఇవాళ ఈ అనడం, ఈ అక్రమానికి, మీదికే వస్తుందని కలలో కూడా ఆమె భావించి యుండదు. రఘు యింతటి అక్రమానికి, అఘాయిత్యానికి ఒడిగట్టుతాడని బహుశా ఆమె అనుకొని వుండదు. అందుకనే అతనిని బుజ్జగించటానికి యింకా ప్రయత్నించింది.

రఘు ఆమె చేయి విదిలించి "వెళ్ళిపోతున్నా నేను" కర్కశంగా వున్న దాతని కంఠస్వరం "ఎక్కడికి" సహజదీనస్వరంతో, ప్రార్థనాపూర్వకంగా పలికింది. విదిలించి వేసిన చేతిని తిరిగి అతని కాళ్ళ వద్దకు రానిస్తూ రఘు దూరంగా జరిగి 'హా.... జరుగు అటు' పోబోయాడు. నా తప్పేమైన వుంటే క్షమించండి. కోప్పడకండి దండం పెడతాను. పోదురుగాని పూర్తిగా తెల్లవారందే ఆమె అభిమానం యెక్కడ మటుమాయమైందో ఇంతలోనే వజ్రం మైనంగా మారింది. మళ్ళీ అడిగింది. కొంచెం రఘు తగ్గి తిరుపతికి ముక్తసరిగా చెప్పి ఊరుకున్నాడు.

"తిరుపతికి? తిరుపతి కెందుకు? తీర్థయాత్రలా"

"కాదు చదువుకోవటానికి'

"ఇక్కడ లేదా చదువు?"

"కాక ఇంకే చదువో మరి?"

"సంస్కృతం. తెలుగు - ఇంకా ఇలాంటివే. ఇంగ్లీషు యివీ వుండవు".

"అయితే బి.ఏ., ఎం.ఏ., కాదన్నమాట".

"కాకున్నా అటువంటిదే"

"మరి దాన్నేమంటారు?"

"భాషా ప్రవీణ"

"మరి యీ యేడు 'ఇంటర్' కూర్చుండరా?"

"ఉహుఁ అక్కర్లేదనుకుంటాను"

'అయితే ఎప్పుడు వెడుతున్నరేంటి'

'వచ్చే నెల మొదటి వారంలో వెళ్ళాల్సి వుంటుంది.'

పరీక్షయిచ్చి మళ్ళీ తిరిగివస్తారుగా ఆశ స్ఫురిస్తూ పలికింది.

"పరీక్షయిచ్చి రావడం యింతలోనే కాదు"

"కాక, అక్కడెన్ని రోజులుండాలి?"

"నాలుగేండ్లు"

"అబ్బా! నాలుగేండ్లా....." అంతవరకు? అర్ధోక్తిలోనే ఆగిపోయింది.

కాని కొంత సేపాగి మళ్ళీ “అయితే మరి మీ ఉద్యోగం ఏం గావాలి ?” ప్రశ్నించింది.

“ఉద్యోగానికి రాజీనామా పెట్టి వెళు తున్నాను. “

“రాజీనామా : బాగా ఆలోచించేనా?”

“ఆఁ ఔను?” రఘు తొణకలేదు.

“అంతా అబద్ధం. నాకు తెలుసు. నన్ను తమాషా పట్టిద్దామని అంటున్నారేమో!”

“నీతో తమాషా దేనికి?”

“అయితే మరి నిజంగానే వెడుతారా?”

“నిజంగానే” నిర్వికారంగా సమాధానమిచ్చి వూరుకున్నాడు.

అయినా ఆమెకింక నమ్మకం కలగలేనట్లుంది రఘుమాటల్లో. మరీ మరీ రెట్టించి ‘నిజంగానే’ అని నిలదీసింది. ఒట్లల్లా వేయించుకుంది. ఆ ఒట్లన్నీ చాలనట్లు ‘సరస్వతితోడు?.... అది కూడా గట్టిగా ఒత్తించి పలికించింది. ఆమె ఈ పట్టుదలలో ముగ్ధత్వం మూర్తీభవించింది. ‘ఊ...!’ అని ఒక పెద్ద నిట్టూర్పు విడువగలిగింది. ‘రేపయితే నేను ఊరికి వెడుతున్ననాయె. మీరక్కడిక వెళ్ళేటప్పటికిక్కడ ఉండనేమో!.....’ క్షణకాలం ఆగిపోయిందల్లా మళ్ళీ ‘వెళ్ళే ముందు ఒకసారి కలిసిపోరూ...... ప్రాధేయత, ఆరాటం పుట్టిపడుతున్న ఈ వాక్యం. ఆమె ‘హృదయం లేని మనిషి’ అనే రఘు తప్పుడు అభిప్రాయాన్ని చెరపివేసింది.

‘ఎందుకు? ఏమో చూస్తాను’ నిర్లక్ష్యం, ఉపేక్షాభావం కన్పించినాయి రఘుమాటల్లో, అతని ముఖం గంభీరమైంది. ఉచ్ఛగరికి వచ్చింది.

“అబ్బా! నాలుగేండ్లు మీరు అక్కడే వుండి చదువకుంటే ఏం?......’ అదే మాటగా ఆలపించిందామె.

‘మధ్యమధ్య ఉత్తరాలు వ్రాస్తుంటారా?’ ఉబికివస్తున్న కుతూహలాన్ని పట్టలేక అడిగిందామె. కాని రఘు “ఊహు... వ్రాయను. వ్రాయాల్సిన అవసరం కనుపించటం లేదు’ కట్టె విరుపుగా అన్నాడు. ఈ కట్టెవిరుపు జవాబు ఆమె కోమల హృదయసుమాన్ని తుంచిందని రఘుకు గుర్తులేదుగా! ‘పోనీ

మధ్యన ఎప్పుడైనా వస్తారా? ప్రశ్నార్థకంగా రఘు కళ్ళలోకి చూచింది. ‘ఆఁ ఓ పదిరోజులు వచ్చి ఉండిపోతాలే, తేలికగా అనేశాడు. ‘పదిరోజులేనా?’ - ఆశ్చర్యం ప్రకటిస్తూ ఒకసారి అతనికేసి చూసి తిరిగి చూపులు నేలకేసి త్రిప్పుకున్నది. ‘నాలుగేండ్ల దీర్ఘకాల వియోగమందు కేవలం ఈ పదిరోజుల స్వల్పకాలం - కలయిక యెంత?’ అని కాబోలు ఆమె మనోభావం. ‘ఔను చాలవా పదిరోజులు’ తీసేసినట్టు వున్నాయి రఘు మాటలు. ఆమె యెంతో చిన్నపుచ్చుకున్నది. చిన్నబోయిన ఆమె ముఖం రఘుకు జాలి పుట్టించలేదు. మరోవైపు తిరిగి బిఱ్ఱబిగిసి పడుకున్నాడు.

చాలాసేపటివరకు గది అంతటా స్తబ్ధత నిశ్శబ్దత బాగా అలముకు పోయింది. ఆమె గోడకానుకుని ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయింది. ఒక గంట తర్వాత గాని రఘు పెదవులు కదలి మాటలు రాలేదు. ‘నీతో ఒక ముచ్చట’ పూర్తిగాకముందే ఆగిపోయినాడు. ‘ఏమిటి? ఉప్పొంగి వస్తున్న వుత్సుకతకు కళ్ళెం వేయలేకపోయింది. ‘ఆఁ ఏమీ లేదులేదు మరోసారి యెపుడైనా చెబుతాను’- అప్పటికలా సర్దుదామను కున్నాడు. ‘నువ్వు వెళ్ళిపడుకో’ అన్నాడు. ఆమె కుడిదాపన మరీ హెచ్చింది. కుడితిలో పడ్డ ఎలుక మాదిరి కళకళ పడింది పాపం! ‘ఊహూఁ ఏమిటో ఇప్పుడే చెప్పాలి’ బలవంతం చేసినా రఘు వినిపించుకోక ‘ఎందుకులే’ అని నానబెట్టుతూపోయాడు.

‘నోటితో చెప్పటాని కిష్టం లేకపోతే వ్రాయండి.’

‘అయితే మానే : ఫరవాలేదు. ఇప్పుడున్న చింతలలో అదొకటీను. మనసు కష్టపెట్టుకొని ఇప్పుడు మాత్రం చిక్కిపోవటం లేదా?

రఘు గోడకేసి తిరిగి, గోడమీద గోటితో ఏదో వ్రాసినాడు. అస్పష్టంగానైనా కాస్తకాస్త ఆ అక్షరాలను గుర్తించగలిగిందామె.

‘తి-రి-గి-రా-ను’ గోడమీది మూగజీవాలు ధ్వనిస్తున్నాయి. ‘తిరిగిరాను?’ అంటే ఏమిటి? ‘తిరుపతి నుంచి తిరిగిరాక అక్కడే వుంటారా? మీ మాటలు నాకు ఏమిటో స్పష్టంగా చెప్పరేం?’

‘మాట యిచ్చాను వాళ్ళకు’ మర్మగర్భితంగా రఘు జవాబు.

‘ఎవరికి? దేని గురించి?’ ఆమె ఆందోళన హద్దులు దాటింది.

‘చేయి దాటిపోయింది’ ఒక వాక్యాని కింకోదానికి పోలికలు లేని రఘు మాటలు, ఆమె దానికితోడు మరింత కారం అద్దినట్లున్నాయి. ‘ఏమిటో యిదంతా’ అగమ్యగోచరంగా తోచింది. తనను తానే యేమేమో నిందించుకోసాగింది. నిర్జీవ ప్రతిమ యిప్పుడామె. ఐనా రఘుకు చీమ కుట్టినట్లయినా కాలేదు. తెల్లవారవచ్చింది కూడా.

పొద్దు బారెడెక్కింది. లేచి చూచాడు. ఆమె యింకా అక్కడే కూచుని వుంది. లేవబోతోంటే ‘సంగతేంటో సగంలోనే ఆపి యేడిపించకండి స్పష్టంగా వివరంగా చెబుదురూ’ చాలచాల బ్రతిమిలాడి చూచింది. రఘు హృదయం కరగలేదు. వజ్రం కంటె కఠినమైపోయింది. ఎందుకులే ముందు ముందు అనుభవం మీద నీకే తెలుస్తుంది అన్నాడు. ‘అనుభవం మీద’ వల్లిస్తూ స్తంభించిపోయింది. పిచ్చిదానివలె గుణిస్తూ కూచుంది. తి రి గి రా ను...

ఇవాళ బడికి వచ్చేముందైనా తనను కలిసి సంగతి విప్పి చెబుతాడేమోనని నమ్మింది. కాని రఘు ఇంట్లో యెవరికీ చెప్పి రాలేదసలు. ‘నీమీద కసి తీర్చుకుంటాను రఘు యెప్పుడో’ అనిన ఒకమాట చటుక్కున ఆమెకు జ్ఞప్తికి వచ్చి నిలువునా నీరైపోయింది. వణికిపోయింది. స్త్రీ యెంత అభిమానవతి ఐతే మాత్రం యేం చెల్లుతుంది. గనుక? ఆమె యెంత లొంగి వచ్చింది. ఐనా తాను తృణీకరించి వచ్చాడు. ఆలోచనలో మునిగినాడతడు ‘తిరిగిరాను?’ అనే శేషప్రశ్న యింకా వేధిస్తూనే వున్నది ఆమెను.

**(పరిసరాలు -1, కథల సంకలనం నుంచి)**

# పల్లెటూరు



**వానమామలై జగన్నాథాచార్యులు**

పురాణ ప్రవచనంలో ప్రసిద్ధిగాంచిన బక్కయశాస్త్రి సీతాంబల కుమారుడు వానమామలై జగన్నాథాచార్యులు. 1908 డిసెంబరు 19న జన్మించారు. వానమామలై జగనాథాచార్యులు సుప్రసిద్ధ కవి, అభినవ పోతన వానమామలై వరదాచార్యులకు అన్నగారు. వారి జన్మస్థలం మడికొండ జన్మస్థలము కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సమీపంలో పోతారెడ్డి పేటలో స్థిర నివాస మేర్పరచుకొని వ్యవసాయం చేసేవారు. అంతకు ముందు అభ్యుదయ గేయాలు రాశారు. హరికథలు చెప్పారు. నైజాం పోరాటంలో వీరి హరికథ విని ఒక ఊరి వారు పోలీసుస్టేషన్‌పై దాడి చేశారు. అంతటి ప్రతిభావంతంగా హరికథ చెప్పేవారు. అధ్యాపకులుగా పనిచేశారు. రైతు రామాయణం అనే అభ్యుదయ మహాకావ్యం కూడా రాశారు. ఇల్లంతకుంట రామునిపై శతకం రాశారు. కార్పాసలక్ష్మి అనే రచన అలభ్యం. సంప్రదాయం, ఆధునిక అభ్యుదయ దృష్టి గల సంస్కృతాంధ్రపండితులు. పల్లెటూరి పదాలతో పల్లె జీవితాల నున్నదున్నట్లుగా చిత్రించిన గొప్ప కావ్యం రైతు రామాయణం. పూర్వభారత ప్రధాని పి.వి.నరసింహారావుగారి కంకితం.

తే.గీ. పంటలక్ష్మికి తొలియాటపట్టు, బక్క
కాపు జనముల పాలి బంగారు గట్టు
కదుపు మొత్తాల పురికట్టు, కాటకాలు
కరువులరికట్టు, పెరటి కల్పకపు చెట్టు
పట్టణముల యాయువు పట్టు పల్లె పట్టు
అదియె లేక నగర జీవి యాటకట్టు

సీ. ఎవరి రెక్కలపాటు ఎవతె మొక్కలనాటు
ఆరెంటికే మంచి యచ్చుబాటు
ఎవతె మోసిన పెంట ఎవడు తీసిన పంట
అలరెంటి కన్యోన్యమైన జంట
ఎవడు పెట్టిన పైరు ఎవతె కట్టిన నీరు
రెంటికే తగును దొరింపు తీరు
ఎవతె కోసిన కోత ఎవడు మోసిన మోత
క్షితి రెంటికే తగు చేయియూత
చాలు లేపు నెవ్వాని నాగేలి దుంప
పోలు పోయునే సతి విత్తనాలగంప
ఎవనిచే పెంపౌ కదుపు ఎవతె పాదుపు
రెంటికే పొత్తుయది వారి యింటి సొత్తు

సీ. అన్నమ్ములేని వాడాయూరనేలేడు
పారవేయడు పెంటపై నెవడును
పనిలేనివాడు కనరాడు మచ్చుకేన్
పనికొలంతయు నెందు కనుటెఱుగము
చింకిపాతల యే కుచేలుడున్గనరాడు
నిలువయుంచిన కబేరులును లేరు
బీదసాదకు ముష్టి బెట్టని లోభిలే
డొరులపై తనబరువూనడెవడు
జుత్తు నిక్కించుకొ నెనె శూరుడనెనె
ఎగురడెంతటివాడు, ఎత్తుకొనును
తవుడు పెట్టినన్ పదార్థమయెంచి
గంజినీరైన యమృతంబు గాదలంచి

తే.గీ. పాడితప్పనియాలు, నేనాడు కూడ
యాడితప్పని కాపురాలాదమరచి
గాడితప్పని బండి చక్రాలు, కోంఢ్ర
చాలు తప్పని సూటి నాగేలి సాలు

(వానమామలై జగన్నాథాచార్యుల రైతు రామాయణం నుండి)

సేకరణ : గంద్ర లక్ష్మణరావు, 9849328036

వ్యాసం

# పాటై, నాట్యమై అజరామరమైన కవయిత్రి 'మహలఖా బాయి చందా'

**హైదరాబాద్ సమ్మిళిత సంస్కృతీ ప్రభావంతో పురివిప్పిన కళాకారిణి మరుగునపడ్డ కవయిత్రి వ్యాసం మన ముందు...**



విమల. కె
98480 98333

తరాలుగా తెలంగాణలో ఆధునిక విద్యావంతులను తయారుచేసిన ఉస్మానియా యూనివర్సిటీ వందేళ్ళ ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో అడిక్‌మెట్‌లోని తన జాగీరును ఉస్మానియా యూనివర్సిటీకి పౌరసత్వ కానుకగా అందిచ్చిన మహలఖాబాయి చందాని గుర్తుచేసుకోవాల్సి వుంది. ఒక కవయిత్రిని గుర్తుచేసుకోవడమంటే ఆమె కవిత్వాన్ని పరామర్శించడమే కదా! 'నాలెడ్జి ఈజ్ పవర్' అన్న మొదటి తత్వవేత్త ఫ్రాన్సిస్ బెకన్ (1577) అని అంటారు. కానీ నిజానికి జ్ఞానికున్న ప్రాధాన్యతను వొడిసిపట్టుకొని 'జ్ఞానం పురుషుల జన్మహక్కు'గా గుర్తింపు పొందిన కాలమే పితృస్వామ్య భావజాలానికి ప్రారంభ సూచి. ఐనా ఎన్నో అవరోధాల నొడ్డి మేధావులుగా జ్ఞాన రంగాల్లో అడుగిడిన దక్కను ప్రాంత స్త్రీలలో మహలఖా బాయి చందా వేగుచుక్క వంటిది. వీధి గాయకుల బృందంతో కలిసి హైద్రాబాదుకు వలస వచ్చిన రాజ్ కన్వర్ బాయికి 1768లో పుట్టిన బిడ్డ చందా. ఆమె జీవిత చరిత్రను రాసిన రచయిత లందరూ ఆమె పుట్టుకను ఒక అద్భుతగాథగా రూపుగట్టిచ్చింద్రు. చంద్రునివంటి వర్చస్సుతో పుట్టిన ఆ బిడ్డ గదంతా వెలిగేట్లు చేసిందనీ, అందుకే ఆమెకు చాంద్‌బీబీ అనే పేరు పెట్టారనీ వివరించింద్రు. కవుల ఆ అతిశయో క్తులను నిజంగానే తన జ్ఞానంతో నిజం చేసింది చందా.

"నీ కాంతిని విరజిమ్ముతూ జ్వలించే సూర్యునివలె
ఓ ప్రభూ-
నీ జ్ఞానపు కిరణం సోకి ఈ చందా జ్వాజ్వలంగా వెలిగింపనీ"

అంటూ ఓ గజల్‌లో తను నమ్మే 'అలీ' ని కోరుకుంటుంది చందా. సరిగ్గా అలాగే మధ్యయుగాల నాటి హైద్రాబాదు రాజ్యంలో సమ్మిళిత సంస్కృతికి వెలుగులా పంచి సూఫీ కవయిత్రిగా, సాహిత్యాకాశంలో చందమామలా చిరస్థాయిగా నిలిచిపోయింది. షియా కుటుంబంలో పుట్టి సున్నీ రాజకుంటు బీకుల మెప్పును సగర్వంగా అందుకుంది. ప్రపంచ సాహిత్య ప్రేమికుల మన్నన లందుకొంది. తల్లిగా, బిడ్డగా, భార్యగా, విధవగా పితృస్వామ్యం విధించిన పాత్రల్లో సతమతమయ్యే స్థానిక స్త్రీలకు స్ఫూర్తిగా నిల్చింది. మహతబ్ అన్వర్ బాయి పెంపకంలో రుక్నుద్దౌలా అంతఃపురం కల్పించిన అవకాశాలతో విదూషీమణిగా ఎదిగింది. పర్షియన్, ఉర్దూ, అరబిక్ భాషల్లో లోతైన అధ్యయనం ఆమెకు తరగని జ్ఞానాన్నిచ్చింది. ప్రముఖ కవీ, చిత్రకారుడూ, చరిత్రకారుడూ అయిన తాజలీషా స్నేహం ఆమెను సాహిత్యదారుల్లో నడిపించింది. కుటుంబ సంప్రదాయం నాట్యశిక్షణను బాల్యం నుంచే అందిచ్చింది. షియా సంగీతజ్ఞుడూ, ధృపద్, ఖయాల్ రాగాలకు ప్రాణం పోసిన ఖుషాల్ ఖానే ఆమెకి సంగీతాన్ని సంప్రదాయంగా అందిచ్చిండు. తన విద్వత్తుతో 'అభినవ అరిస్టాటిల్'గా గుర్తింపు పొందిన అప్పటి ప్రధానమంత్రి అరస్తూ ఝా (అరిస్టాటిల్ వంటి ఉద్దండుడు) మార్గదర్శకత్వంలో చందా రాజకీయ, తత్వ శాస్త్రాల్లోనూ పట్టు సాధించింది. ఈ విద్వత్తే ఆమెను రెండో నిజాం ఆస్థానానికి చేర్చింది. వీటన్నిటికీ తోడు తల్లి రూపకన్వర్ అందిచ్చిన తాత్విక చింతన చందాని పరిణితిగా తీర్చిదిద్దింది. అందుకు మరింత వన్నె తెచ్చింది. అప్పటికే హైద్రాబాదులో పాదుకొన్న సమ్మిళిత సంస్కృతి ఇచ్చిన సంస్కారం. మౌలాలీ దర్గా, అఫుర్ ఖానాలు, గుళ్లు, పండుగలూ-పబ్బాలూ ఇచ్చిన కలివిడితనం ఆమె ప్రపంచాన్ని ప్రేమమయంగా మలిచినై. రాజాస్థాన ఉద్యోగిగా యుద్ధ విద్యలనూ, వేట వినోదాలనూ ఆకళింపు చేసుకున్నది. స్వతంత్ర స్త్రీగా, పురుష రాజకీయ వ్యవస్థలో తన్ను తాను నిలబెట్టుకునే విదూషీమణిగా, నిజాం రాజకీయ సలహాదారుగా, అప్పటి సందర్భాలను లోతుగా అర్థం చేసుకున్నది. 1802

వ్యాసం

సంవత్సరం నాటికి వసంతోత్సవ వేడుకల్లో తన అద్భుత కళాప్రధానంతో చందా నిజాం నవాబు నుంచి 'మహలఖాబాయి' అనే బిరుదును సగర్వంగా అందుకుంది. ఆ పేరుతోనే కవయిత్రిగా ఆమె ప్రసిద్ధి పొందింది. ఇంటికి పరిమితం కాని ఆస్థాన నర్తకిగా మహలఖా 12వ శతాబ్దం నాటి అక్కమహాదేవి వలె తన అనుభూతులను కవిత్వంలో బలంగా వ్యక్త పరిచింది. అదే ఆమెను ప్రపంచ దేశాలకు పరిచయం చేసింది. 2000 సంవత్సరంలో చికాగో యూనివర్సిటీ లైబ్రరీలో నేను కనుగొన్న మహలఖా గజల్ పుస్తకం ఈ శతాబ్దారంభం నాటికే 'కరాచీ'లో ప్రచురణ పొందిన పుస్తకమని తెలుసుకున్నప్పటి నుంచి ఆనందంలోంచి నేను ఆమె అభిమానిగా మారిన. తను సాధించిన జ్ఞానాన్ని మనకు తన కవిత్వం ద్వారా అందివ్వడమే గాక తను స్వయంగా సంపాదించుకున్న జాగీరు స్థలాన్ని సైతం దానంగా గాక వారసత్వ కానుకగా మనకందిచ్చిన మనసున్న కవయిత్రిగా మహలఖాబాయి చందాను తెలుసు కోవడం నాకు దక్కిన అపురూప అనుభవం. హైద్రాబాదు ఆర్కియలాజికల్ మ్యూజియంలోని ఆమె చిత్రపటాన్ని చూసినప్పటి ఆనందంలోంచే ఆమె కవిత్వ శకలాలను ఏరుకోవడం ప్రారంభించిన. అదే ఆనందం లోంచి ఈ మధ్య ఆమె కవిత్వ శకలాలను ఇంగ్లీషు తర్జుమాలో చూసి వాటిని రేఖామాత్రంగానైనా సాహిత్య ప్రేమికులతో పంచుకొని ఆమెను గుర్తు చేసుకునే ప్రయత్నమిది.



దక్కనులో మధ్యయుగాల్లోకి స్వతంత్ర స్త్రీల వ్యక్తిత్వాన్నీ; రాజాశ్రయంలోని సంఘర్షణలనూ; విందు వినోదాలనూ; స్త్రీల సంవేదనలనూ రికార్డు చేసిన కవిత్వంగా మహలఖా బాయి కవిత్వం మన తరానికి అందిన అపురూపమైన కానుక. ఆమె రాసిన గజళ్ళు ఆమె ప్రాపంచిక దృక్పథాలకూ, జీవిత అనుభవాలకూ నకళ్ళు. షియా సంప్రదాయాల్లో పూర్తిగా మమేకమై యోగినిగా మారిన తల్లి రాజ్ కన్వర్ బాయి ప్రభావం మహలఖా

**2000 సంవత్సరంలో చికాగో యూనివర్సిటీ లైబ్రరీలో నేను కనుగొన్న మహలఖా గజల్ పుస్తకం ఈ శతాబ్దారంభం నాటికే 'కరాచీ'లో ప్రచురణ పొందిన పుస్తకమని తెలుసుకున్నప్పటి నుంచి ఆనందంలోంచి నేను ఆమె అభిమానిగా మారిన తను సాధించిన జ్ఞానాన్ని మనకు తన కవిత్వం ద్వారా అందివ్వడమే గాక తను స్వయంగా సంపాదించుకున్న జాగీరు స్థలాన్ని సైతం దానంగా గాక వారసత్వ కానుకగా మనకందిచ్చిన మనసున్న కవయిత్రిగా మహలఖాబాయి చందాను తెలుసు కోవడం నాకు దక్కిన అపురూప అనుభవం.**

ప్రాపంచిక దృక్పథాలకు పునాదిని వేసింది. అందుకు తోడు సకల విద్యల్లో ఆమె పట్టు, పురుష ప్రపంచంలో రాజకీయాలను దగ్గరనుంచి చూసిన అనుభవం, ఒంటరి స్త్రీగా తన సంఘర్షణ కలగలిసి ఆమె సాహిత్య వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దినై. అంతదనుక మార్సియా లేదా మస్నవీ వంటి శైలీ చట్రాల్లోనే కవితాగానం చేస్తున్న సూఫీ కవులకు భిన్నంగా స్వేచ్ఛగా 'గజల్' శైలిలో సూఫీ కవిత్వాన్ని పొందిచ్చింది. విషాద గీతాలపన కాదని తనున్న సందర్భానికి తగినట్టుగా గజల్ శైలిని ఎంచుకోవడంతోనే ఆమె ప్రత్యేకత కన్పిస్తుంది. అదే ఆమెని మొదటి 'దివాన్' కవయిత్రిగా నిలబెట్టింది. షియా తాత్విక మూలాలను బలంగా విన్పించే 'టోన్' కోసం ఆమె యెంచుకొన్న శైలి 'ఐదు' జంట వాక్యాల గేయం. చివరి పాదంలో 'అలీ' అనే సంబోధనతో తన గేయానికి తాత్విక ముగింపు నివ్వడం ఆమె మరో ప్రత్యేకత. స్త్రీగా తనున్న సందర్భంలోంచి నిగూఢంగా మాట్లాడటం, వినోదం వెనుక విషాదాన్ని రేఖామాత్రంగానైనా సూచించడం, అంతులేని ఆత్మస్థైర్యాన్ని కూడగట్టుకున్న వ్యక్తిత్వం ఈ కవిత్వానికి

వ్యాసం

చలనాన్నిచ్చే అంశాలు. ఉదాహరణకి కింది పాదాలు చూడండి.

'నాట్యానువర్తనంలో పాత్రల కొద్దీ నేరేడు పండు రంగు మధువు వలయాలు వలయాలుగా తిరుగుతోంది-
ప్రేమిక ఒక్క చూపు చూసేనా!?
విందంతా నాట్యమై చెలరేగుతుంది-
దేవుడు ఆమెకి సరిజోడు సృష్టించలేదు కాబోలు! ఒంటరి ప్రేమిక
కంటిముందు ప్రతి దృశ్యం నాట్యమై ప్రతిధ్వనిస్తుంది-
పశువులూ, పక్షులే కాదు- గొప్పా, బీదా మనుషులందర్నీ కట్టిపడేస్తూంది, నాట్యం
ఆమె ఆజ్ఞలకు బద్ధమౌతుంది సమస్త ఆవరణం అలవోకగా-
వొదిలెయ్- నా పోటీదారులను- రా- నాతో జతకట్టు పేరులోనే నాట్యాన్ని విన్పించే తారను చూపుతా-
ఓ మౌలా!!

మహలఖా వ్యక్తిత్వంలోనే ఎదురులేని ఆత్మవిశ్వాసం, కొత్తదారులు అన్వేషించే సాహసం, సృజనాత్మక నైపుణ్యం ఉన్నవనడానికి పై పాదాలే నిదర్శనం. నాట్యాన్ని ఆవాహన చేసుకున్న పరిణిత కళాకారిణిగా కవిత్వంలోనూ నాట్య తరంగాలను సృష్టించడం పై పాదాల్లో కన్పిస్తుంది.

ప్రేమ మార్గంలో అంతులేని వొంటరి ఆర్తీ, అదే సమయంలో శ్రోతలను రంజింపచేయాల్సిన సందర్భం. మహలఖాబాయి కవిత్వాన్ని అక్కమహాదేవి వచనాల వలె తత్వ కవిత్వ స్థాయికి తీసుకెళ్ళింది. ఈ కింది పాదాలు అందుకు ఉదాహరణ.

"అతని ఆర్తిని గుర్తించి విన్నప్పుడు, లయ తప్పింది నా గుండె,
మా కన్నులు కలిసినప్పుడే నా హృదయానికి శాంతి,
నా ప్రియతమున్ని ఎప్పటికైనా కలుస్తాననే వాగ్దానం
నా మనసింకా నమ్మనంటోంది-
ఈ పుష్పిస్తున్న దారుల్లో నేను పరిభ్రమిస్తూనే వుంటూ ఉన్మత్తంగా,
ఆ వాగ్దానం పూర్తవుదాకా-
యుగాలు గడుస్తున్నై- ఈ చంద్రకాంత సౌందర్యంతో
నేను కూర్చుండిపోయి నిరీక్షిస్తూనే వున్న-
ఊనా
ఇప్పటికీ ఓ చిరుముద్దుకీ, ఒకింత యెదాలింగనానికి
ఒక్క అవకాశమైనా నోచనే లేదు.
ప్రేమ ప్రస్థానంలో నా హృదయం కుంగుతున్నది అలసటతో,
కానివ్వు, ఆ చివరి తీర్పు రోజు అంతులేని గౌరవం దక్కుతుంది
ఈలాంటి వక్కలైన హృదయాలకు-
ఓ మౌలా!!
నీ అనంతత్వం లోంచి ఈ చందాకి విముక్త స్థానాన్నివ్వు,
రెండు లోకాల్లో- గౌరవాన్నందు కోనివ్వు-"



**షియా సంప్రదాయాల్లో పూర్తిగా మమేకమై యోగినిగా మారిన తల్లి రాజ్ కన్వర్ బాయి ప్రభావం మహలఖా ప్రాపంచిక దృక్పథాలకు పునాదిని వేసింది. అందుకు తోడు సకల విద్యల్లో ఆమె పట్టు, పురుష ప్రపంచంలో రాజకీయాలను దగ్గరనుంచి చూసిన అనుభవం, ఒంటరి స్త్రీగా తన సంఘర్షణ కలగలిసి ఆమె సాహిత్య వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దినై.**

మహలఖాబాయి చందా గజళ్ళు కొన్ని స్త్రీ గొంతుకను విన్పిస్తై, మరికొన్ని ప్రేమికుడైన పురుషుని గొంతుని విన్పించడం చూసినప్పుడు 'భక్తి కవులు' గుర్తురావడం కద్దు. స్త్రీ గొంతుతో కవిత్వం రాసిన పురుష భక్తి కవులకు సమాంతరంగా ఈమె పురుష గొంతుతో రాసిన పాదాలకు ఉదాహరణ-

'ఓ సఖీ- ఒకపరి చూపులు కలుపు,
మధువు తప్ప మరేమీ పదే పదే కోరని ఈ ప్రేమితో-
పునరుత్థాన వేళ
స్వర్గలోకపు మధువు ఒక్కసారైనా రుచి చూడమని ఇవ్వవా ఈ చందాకి"

అంటూ ఒకపరి పురుష గొంతుకలోంచి ప్రేమగీతం పాడుతుంది. ఇంకోతరి స్త్రీ గొంతుకతో ప్రేమకై 'బేలగా' సాగిలపడుతుంది. ఉదాహరణకి-

"ఒక్క కంటి చరుపుతో బంధించిన 'ఎర'లన్నిటిని తప్పించగలను
నన్ను వేటాడే వేటకానికి ఒక్కరోజైనా వేటాడగలిగితేనా!
ఓ ప్రభూ-
నా పంజరంలోకి వసంతాగమన వార్త వేగంగా అందుతుంది,
ఆనందోద్రేకాల్లో ఒక్క ఈకయినా నలగకుండా మిగలదు-
ఇంతటి వగలమారి హృదయాన్ని యే వలతాళ్ళు బంధించగలవు!?
ఆ అదృష్ట క్షణాలు ముంచుకొచ్చినప్పుడు, జాగులేక
పట్టుబడుతుందది అలవోకగా-
నీవు వినా మరొకరు కంటి కగుపడరు



నాకు,
ఐనా - సుదూరంగా వుండే-
బంధించావు ఈ కస్తూరి మృగాన్ని,
నా హృదయాన్ని-
కానివ్వు- తన శత్రువులకైతే కాదు,
నీకు పట్టుబడిన
ఈ చందా నీతోనే మిగలనీ-
ఓ మౌలా!!
ఇంతకంటే చందా కోరేదేముంది
లోకంలో!?"

కొన్ని కవితల్లో స్త్రీ, పురుష గొంతుకల జుగల్‌బందీ కన్పిస్తుంది.

ఉదాహరణకి-

"చేతిలో పాన పాత్రతో మధుశాల
లోకి జాబిలి వంటి
మోముతో ప్రేమిక అడుగిడింది-
ఎంత చిత్రం! పరిత్యాగులు సైతం
మధువు రుచికై పడిగాపులు-
ఎడారి సైకతాలను విడిచి ఈ ఉన్మత్త
సంచారి నగరానికి
చేరగానే...
పట్టణ గడబిడలో తప్పిపోయిన ప్రతి
నగరజీవి
అధాటున తన స్పృహలోకి-!!
ముసుగులోని ఆ సౌందర్యాన్ని నా
కోరికనెంత అదిమిపెట్టా-!?
నా వేడి నిట్టూర్పు తన దరిదాపుకైనా
విన్పిస్తుందా
అన్నదే నా అదుర్దా-
ఆమె (ఆ) మొకం మెరిసే అద్దమై
విందు తర్వాతి క్షణాలను
సైతం వెలిగిస్తూ-
ఎవరైన పవిత్ర ఉపదేశి తలుపు తడితే,
చెప్పండాతనికి
"ష్-ఒక్కొక్కరు నిశ్శబ్దంగా వస్తారు"
చందా పనుల చిట్లాను మోహపు
అలలుగా తిరిగేసి చూస్తాన్నేను,
తప్పులు గాచే ప్రభువు - నన్ను
క్షమించి,
మధుపాత్రతో నాకెదురు వస్తాడు-"

ఇక వ్యవస్థను శాసిస్తున్న పురుషుని విముఖతను, కాఠిన్యాన్నీ అర్థం చేసుకున్న స్త్రీవాదిగా, రాజాస్థానాల్లో, అధికార రాజకీయాల్లో యుద్ధ బీభత్సాల్లో నలుగుతున్న తన స్త్రీత్వపు సంవేదనలను పట్టి చూపే ఈ 'ఓ నా వేటకాడా' అనే కవితను చూడండి-

"నా నిట్టూర్పు సెగ- నీకు తాకి వుంటే
ఓ నా వేటకాడా!
హృదయంలో నీ అన్యాయపు జాడ
కనుమరుగయ్యేది-
ఓ నా వేటకాడా!
నీ వలలో చిక్కుకున్నది నాకై నేనే
నన్ను పట్టుకునే ఆలోచన నీకెప్పుడైనా
వుంటే కదా!
ఓ నా వేటకాడా-
యుగాలుగా రెపరెపలాడే నా
హృదయం నీ
వలను కోరుకుంది, సరే
ఎప్పటికైనా నీ నిర్లక్ష్యాన్ని మరచి నా
దారిన రాగలవా!?
ఓ నా వేటకాడా-
గగుర్పొర్చే ఉత్పాతంతో నీ అంతరంగ
'క్వారీ' తన
ఆత్మను పోగొట్టుకున్నది-
నువ్వే గనుక గమనిస్తే కొత్త ఊపిరి
నింపగలవు
ఓ నా వేటకాడా-
ఇదే నేను నిన్ను కోరేది-
ఓ అలీ-
ఈ నిముషం చందాకి కొత్త ప్రభాతం
కానీ-
ఆమె శత్రువులకు సంధ్యాసమయం
రానీ-
ఓ నా వేటకాడా!!"

మొత్తానికి "మ్యాన్ క్రియేట్స్ వార్, వుమెన్ క్రియేట్స్ మ్యాజిక్" అన్న ఓ స్త్రీవాద తాత్వికురాలి మాటలకు నిదర్శనంగా హైదరాబాద్ చరిత్రలో నిల్చిపోయిన కవయిత్రి మహలఖాబాయి చందా. ఆమెను గుర్తుచేసుకోవడానికే గాకుండా ఆమె గజల్స్ ఆనాటి ఒక శ్రేణి స్త్రీల సంవేదనలను పట్టి చూపే రికార్డ్సుగా కూడా చదవాల్సి వుంది. పూర్వాధునిక స్త్రీల అనుభవాలను, అంతరంగాలను తరచి చూడ్డమంటే వర్తమాన పరిస్థితులను బేరీజు వేసుకోవడం కూడా. ఆ దిశగా చేసిన చిన్న ప్రయత్నమిది. ముక్త తరఫున 2012లో మహలఖాబాయి చందా పురస్కారాన్ని ప్రముఖ గాయకులూ, ఆత్మీయ స్నేహితుడూ అయిన విఠల్ రావుకు అందజేయడం కూడా ఇలాంటి ప్రయత్నాల్లో భాగమే. ఆ సందర్భంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విఠల్‌రావుగారు మహలఖాబాయి గజల్ పాడటం మరిచిపోలేని అనుభవం. ఇప్పటికైనా మహలఖా పేరున కళాకారులకి పురస్కారాన్ని ప్రకటించడం, ఆమె విగ్రహాన్ని ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో నెలకొల్పడం, ఆమె ఆకాంక్షలను కొనసాగించే దిశగా మహిళా యూనివర్సిటీని తక్షణం నెలకొల్పడం తెలంగాణ ప్రభుత్వం చేయాల్సిన పనులు. స్త్రీల సంవేదనలు ప్రతిబింబించే ఆమె కవిత్వ స్ఫూర్తి నందుకోవడం మహలఖా బాయి చందాకి మనమిచ్చే నివాళి. ఆమె చెప్పుకొన్నట్లు 'పాటై, నాట్యమై ఆమె అజరామరమైంది'.

కథ

# మనాది

ఉద్యమానికి బలైపోయిన కొడుకును తలచుకొని కుమిలిపోయే లంబాడి తాత కథ...



ఆచార్య సూర్యాధనుంజయ్
98491 04187

అప్పుడప్పుడే తెల్లతెల్లగా తెల్లవారుతుంది. మొగులులోంచి పొద్దు కడుపులోకి మెల్లగా జారుకుంటుంది. గొడ్ల పెండ ఎత్తి పెంటలో పోసి వచ్చిన మంగీలాల్ పసులు తినగా మిగిలిన వరిగడ్డితో మంట వేసుకుని చలి కాచుకుంటున్నాడు. అతని దగ్గరే నిద్రపోయే మనుమడు నాలుగేళ్ల సైదా తాత అలికిడికి లేచి కూర్చున్నాడు. తాత లేనిదే ఒక్క నిమిషం కూడా ఉండడు. తాతని వదిలి ఉండలేని సైదా బొంతను కప్పుకొని తాత పక్కకు వచ్చి కూర్చున్నాడు. కాని పరధ్యానంలో మంటకేసి చూస్తూ మంటతోనే మౌనంగా మాట్లాడుకుంటున్నాడు మంగీలాల్. పక్కకు తన మనుమడు ఒరిగి కూర్చున్నాడన్న విషయం కూడా గమనించలేదు. దూడ ఏమో అనుకున్నాడు. పరధ్యాసలోంచి బయటపడి పక్కకు చూసుకున్నాడు. ఎగిసిపడుతున్న మంటల వెలుగులో పౌర్ణమి చంద్రుడిలా వెలిగిపోతున్న మనవడిని చూసి ఒక్కసారిగా అవాక్కై, వెంటనే తేరుకొని "వరా బేటా" అని గుండెలకు హద్దుకొని తన ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. ఎర్రని జుట్టు చిందరవందరై, నిద్రలో కారిన సొల్లు మరకలు చెంపలపై ఎండిపోయి కనబడుతుంటే నిజంగానే ఆకాశంలో వెలిగిపోయే చందమామలాగున్నాడు.

ప్రేమతో మంగీలాల్ వాడి కళ్లను తుడుస్తుంటే "దాదా మార్ బా దవాఖానేతి కన్నా ఆవచ్చా" అంటూ బేలాగా ముఖం పెట్టాడు.

కన్నీళ్లు కాలువలు కట్టడానికి సిద్ధంగా ఉన్నాయా అన్నట్లు సైదా కండ్లు నీళ్లతో నిండుకున్నాయి. మనవడిని చూసి చలించిపోయాడు మంగీలాల్. తండ్రిపై వాడికున్న ప్రేమను చూసి కారుతున్న కన్నీళ్లు కంటిలోనే ఇంకి పోయాయి. తాను ఏడిస్తే మనవడు తట్టుకోలేడని ధైర్యాన్ని కూడగట్టుకొని "ఆవచ్చా బేటా తార్ బా ఆవచ్చా. దవాఖానామా గుల్ కోస్ బాటల్ చడారేచ ఒన ! తావ్ ఆయి బేటా ఒన! (వచ్చేస్తాడు బేటా మీ నాన్న. దవాఖానాలో వాడికి గ్లూకోజ్ బాటిల్స్ ఎక్కిస్తున్నారు వచ్చేస్తాడు బేటా. వాడికి జ్వరం వచ్చింది) అంటూ మనుమడి కన్నీళ్లు తుడుస్తూ బుజ్జగించాడు.

చూస్తుండగానే తెల్లారిపోయింది. పొద్దు పొడవడాన్ని గమనించిన మంగీలాల్ మనవడిని ముఖం కడిగించి వేడి వేడి ఆవుపాలు గిన్నెలో పోసి ఇచ్చాడు. తాను చాయ్ చేసుకొని తాగాడు. పిల్లవాడిని పక్కింటి పిల్లలతో ఆడుకోమని పంపాడు. ఇలా గత పది రోజులుగా కొనసాగుతున్న మంగీలాల్ దీనావస్థను గమనిస్తున్నది మారోణిబాయి. మంగీలాల్‌కు వదిన వరుస అవుతుంది మారోణి. వాకిలి ఊడుస్తున్న ఆమె మనసాపుకోలేక "ఏం మంగ్యా ఎన్నిరోజులు గిట్ల పిల్లగాడికి అబద్దాలు చెప్తావ్. ఏనాడైనా నిజం దెలవాల్సిందేగా. వాడి తల్లి మొగుడి మీద కోపంతో ఇల్లు వదిలిపెట్టి పోయింది.

నీ కొడుకు సదువుకోసం పట్నం పోయి జేల్‌లో పడ్డడు. ఉన్నమాట జెప్తే నీ మనసు తేలికపడ్తది. వాడు కూడా గట్టిబడతాడు. ఇంకా ఎంతకాలం ఈ మనాదిల ఉంటావ్. నీ పోకడ నాకేం నచ్చుతలేదు" అన్నది. ఆమె మాటలు మంగీలాల్‌కి సబబే అనిపించాయి. కానీ పిల్లవాడు తట్టుకోలేడనిపించింది.

అగ్గిలాంటి నిజాన్ని గుండెమీద ఉంచుకొని పాలు అమ్మడానికి వెళ్ళాడు. తండా బస్టాండ్ దగ్గర చాయ్ దుకాణం పెట్టిన దర్యాకు పాల డబ్బా ఇచ్చి మనవడి కోసం కారంపూస కొని మిగిలిన 30 రూపాయలు తీసుకొని ఇంటికి బయలు దేరాడు. "ఏం మంగ్యా గట్లున్నవ్. పానం బాగలేదా ఎట్ల?" అడిగాడు దర్యా. "ఏం లే భయ్యా!" అని దర్యా మాటల్ని దాటేస్తూ ఆగకుండా పోతనే ఉన్నాడు మంగ్యా. అప్పటికే ఎండ నెత్తిమీదకొచ్చేస్తున్నది. శరీరంలోని ఆయాసం కాళ్లను లాగేస్తుంటే దారిలో పంట కాల్వపై ఉన్న కల్వర్టు మీద కాసేపు కూలబడ్డాడు. కండ్లలో కొడుకే కనబడుతున్నాడు. తన కొడుకు ప్రవీణ్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ చేసి, కాకతీయ యూనివర్సిటీలో పీజీ

సోషియాలజీ పూర్తిచేశాడు. తల్లి మరణించడంతో మంగీలాల్ అతని పెళ్లి తొందరగా చేసేశాడు. చూస్తుండగానే ఒక కొడుకు కూడా పుట్టాడు. తన తాతపై ఉన్న ప్రేమతో కొడుకుకి తాత పేరే పెట్టుకున్నాడు. ప్రవీణ్ భార్య అతనితో ఏనాడు సఖ్యతగా ఉండలేదు. ఎప్పుడూ చదువు ధ్యాసలో ఉండే భర్త వాలకం ఆమెకు నచ్చేది కాదు. సాటివాళ్ళందరు పనులు చేసుకొని బతుకుతుంటే నిత్యం చదువుతోనే సహవాసం చేస్తున్నాడని భర్తను తిట్టిపోసేది. దీనితో రోజు గొడవలు జరిగేవి. ఒకనాడు తన ఐదేళ్ల కొడుకును వదిలిపెట్టి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్లిపోయిన మూడు నెలలకు యూజీసీ నెట్ రిజల్ట్స్ వచ్చాయి. ప్రవీణ్ సోషియాలజీలో జె.ఆర్.ఎఫ్ సాధించాడు. ఈ విషయం చుట్టుపక్కల తండాలకు తెలిసింది. వార్తా పత్రికలు ప్రవీణ్‌ను ఆకాశానికి ఎత్తేశాయి. ఆ ఉత్సాహంతోనే పిహెచ్.డి. ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిచేసి తాను కలలు కన్న ఉస్మానియా యూనివర్సిటీలో సీటు సంపాదించాడు. పరిశోధన చేస్తూనే పెద్ద ఉద్యోగం సాధించాలనే తపనతో రోజుకు 18 గంటలు చదువుతోనే గడిపేవాడు. చూస్తుండగానే ఒక సంవత్సరం గడిచిపోయింది. అంతలోనే మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. పరాయి పాలనలో బతుకులకు విలువలేదనే సత్యాన్ని, తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రవీణ్ వంటి మేధావులు గుర్తించారు. ఉద్యమ నేత సంకల్పానికి బలాన్ని అందించాలని ప్రత్యక్ష ఉద్యమాల్లోకి వచ్చారు.

★ ★ ★

యూనివర్సిటీలో ఉద్యమ హోరు పతాక స్థాయిలో ఉంది. ఉద్యమ నేత దీక్షకు భయపడ్డ కేంద్రం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసి పరాయి పాలకుల లాబీయింగ్ ధాటికి తట్టుకోలేక వెనక్కి తగ్గింది. దీనితో విద్యార్థి ఉద్యమకారులు ఆగ్రహంతో ఊగిపోయారు. కేంద్రం చర్యకు నిరసనగా 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో ప్రవీణ్ నాయక్ ముందుండి నాయకత్వం నడిపాడు. ఎన్.సి.సి. గేటు వద్దకు చేరుకున్న ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. వారిపై లాఠీ ఛార్జ్ చేశారు. వారిని అరెస్ట్ చేసి అన్యాయంగా కేసులు బనాయించి కోర్ట్ ముందు నిలబెట్టారు. కోర్ట్ రిమాండ్‌లో భాగంగా వారిప్పుడు చంచల్ గూడ జైల్లో ఉన్నారు.

ఈ వార్తను పేపర్లు పతాక శీర్షికగా ప్రచురించాయి. ప్రవీణ్ చిన్ననాటి స్నేహితుడు రాజేష్ నాయక్ పేపర్ లో వచ్చిన వార్తను మంగీలాల్‌కు చేరవేశాడు. ఈ వార్త తండా మొత్తం తెలిసిపోయింది. అప్పుడప్పుడే తండాకు ఉద్యమం గురించి తెలుస్తుంది. తమ తండా పిల్లగాడు రాష్ట్ర సాధనకు పోరాడడం వారికి గర్వంగా అనిపించింది. కానీ ఈ వార్త తెలిసినప్పటినుండి మంగీలాల్ మనసు మనసులో లేదు. బాగా చదువుకొని కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడన్న కొడుకు జైలుకు వెళ్లడం అతన్ని కలచివేసింది. ఇక ఇంటికి రానిస్తారో లేదో, కేసులు, కోర్ట్‌లు అంటూ కొడుకును ఎన్ని తిప్పలు పెడతారో అని కన్నీరుమున్నీరయ్యాడు. మనసులోని దుఃఖాన్ని

**ప్రవీణ్** **చిన్ననాటి స్నేహితుడు రాజేష్ నాయక్ పేపర్ లో వచ్చిన వార్తను మంగీలాల్‌కు చేరవేశాడు. ఈ వార్త తండా మొత్తం తెలిసిపోయింది. అప్పుడప్పుడే తండాకు ఉద్యమం గురించి తెలుస్తుంది. తమ తండా పిల్లగాడు రాష్ట్ర సాధనకు పోరాడడం వారికి గర్వంగా అనిపించింది. కానీ ఈ వార్త తెలిసినప్పటినుండి మంగీలాల్ మనసు మనసులో లేదు. బాగా చదువుకొని కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడన్న కొడుకు జైలుకు వెళ్లడం అతన్ని కలచివేసింది.**



కథ

పంటికింద దాచుకొని భరిస్తున్నాడు. అలా తన ముందునుంచి ఏ యువకుడు పోయినా తన కొడుకే అనుకొని భ్రమ పడుతున్నాడు.

* * *

"దాదా దాదా ప్రవీణ్ కాకా టివిమా ఆరోచ్చా!! అంటూ మారోణిబాయి మనుమరాలు వాసంతి పరుగెత్తుకుంటూ వచ్చింది. తనను పిలుచుకురమ్మని తన నాయనమ్మ పంపిందని చెప్పింది. లేని ఓపికను తెచ్చుకొని వేగంగా ఇంటికి చేరుకొని డబ్బా అరుగుమీద పెట్టి మారోణిబాయి ఇంటికి చేరుకున్నాడు. ఆమె ఇంటి నిండా మనుషులు. కాలు పెడదామన్నా దూరడానికి తావు లేదు. తండాలో ఉన్నది ఒకటే టివి. అది మారోణిబాయి వాళ్ళది. మారోణి కొడుకు దేవ్లా దుబాయ్ నుంచి వచ్చాక కొన్నాడు. జనాలను తోసుకుంటూ టివి ముందుకు చేరుకున్నాడు మంగీలాల్. అప్పటికే వీధి పిల్లలతో సైదా కూడా టీవి చూస్తున్నాడు. వాడికేం అర్థం కావట్లేదు. తన తండ్రిని టివిలో చూస్తూ గట్టిగా ఏడుస్తున్నాడు. పిల్లవాడి ఏడుపుతో వార్తలు వినలేకపోతున్నామని వాడిని దుకాణానికి తీసుకెళ్లమని చెప్పి తన కొడుకు దేవ్లా కిచ్చి బయటకు పంపింది మారోణిబాయి.

* * *

బ్రేకింగ్ న్యూస్ : చర్లపల్లి జైలులో తెలంగాణ కోసం విద్యార్థి ఖైదీల ఆమరణ నిరాహార దీక్ష. ఒకరి పరిస్థితి విషమం. వార్తలు చదువుతోంది న్యూస్ రీడర్ ప్రశాంతి.

**ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధన కోరుతూ పదిహేను రోజుల క్రితం అరెస్టైన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చర్లపల్లిలో ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. పోలీసులు అడ్డుకున్నా వినకుండా దీక్షను కొనసాగించారు. దీనికి కోపోద్రిక్తులయిన పోలీసులు లాఠీ చార్జ్ చేశారు.**

"ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధన కోరుతూ పదిహేను రోజుల క్రితం అరెస్టైన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చర్లపల్లిలో ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. పోలీసులు అడ్డుకున్నా వినకుండా దీక్షను కొనసాగించారు. దీనికి కోపోద్రిక్తులయిన పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. పోలీసుల దెబ్బలకు తీవ్రంగా గాయపడ్డ స్కాలర్ ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. గాయపడ్డ యువకుడిది వరంగల్ జిల్లా ఎర్రబెల్లి మండలం పూర్యానాయక్ తండాగా తెలుస్తోంది. గత ఏడాది కాలంగా ప్రవీణ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు". అంటూ ప్రశాంతి చదివిన వార్తను టీవీలో రిపీటెడ్‌గా చూపిస్తూనే ఉన్నారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసినందుకు జరిగిన లాఠీఛార్జ్‌లో గాయపడ్డ ప్రవీణ్ నాయక్ పోరాట పటిమను అందరూ పొగుడుతూనే, అతని పరిస్థితికి కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఈ వార్తా ప్రసారాన్ని కండ్లనిండా చూసిన మంగీలాల్ రక్తపు మడుగులో ఉన్న తన బిడ్డను చూసి తట్టుకోలేక పోయాడు.

అతన్ని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. దేవ్లా చంకలో ఉన్న సైదా తలను బాదుకుంటూ ఏడుస్తున్న తాతను చూసి గిలాగిలా కొట్టుకుంటూ దేవ్లా మెడకు అల్లుకుపోయాడు.

తండాలోని వారందరూ మంగీలాల్ ఇంటిముందరే చలి మంటలు వేసుకొని ఆ రాత్రి గడిపారు. ఇంకేం వార్త వినాల్సి వస్తుందో, ముసలోడి పరిస్థితి ఏమవుతుందోనని అందరూ ఒకేచోటనే ఉన్నారు. టివి వార్తలతో రాత్రంతా మారోణి ఇల్లు మార్మోగుతూనే ఉంది. చూస్తుండగానే తెల్లారిపోయింది.

తమ తండాలో ఎవరికీ ఏం జరిగినా ఒకరికి ఒకరు తోడుగా ఉంటారు. కష్టం ఎవరిదైనా తమదిగానే భావిస్తారు. కొందరు పెద్దలు పొద్దుటి బండికే పట్నం పోవాలని నిర్ణయించారు. మంగీలాల్ తో పాటుగా ఇరవై ఐదు మంది ఎనిమిది గంటల ప్యాసింజర్ బండికి పట్నం బయలుదేరారు.

**లేని ఓపికను తెచ్చుకొని వేగంగా ఇంటికి చేరుకొని డబ్బా అరుగుమీద పెట్టి మారోణిబాయి ఇంటికి చేరుకున్నాడు. ఆమె ఇంటి నిండా మనుషులు. కాలు పెడదామన్నా దూరడానికి తావు లేదు. తండాలో ఉన్నది ఒకటే టివి. అది మారోణిబాయి వాళ్ళది. మారోణి కొడుకు దేవ్లా దుబాయ్ నుంచి వచ్చాక కొన్నాడు. జనాలను తోసుకుంటూ టివి ముందుకు చేరుకున్నాడు మంగీలాల్. అప్పటికే వీధి పిల్లలతో సైదా కూడా టీవి చూస్తున్నాడు. వాడికేం అర్థం కావట్లేదు.**

వరంగల్ - సికింద్రాబాద్ ప్యాసింజర్ బండి సికింద్రాబాద్ చేరుకుంది. తండాను జంట నగరాలకు తరలించారా అన్నట్టుగా వచ్చిన ఇరవై ఐదు మంది ఆటోలో గాంధీ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రి చాలా పెద్దది. "ఇంత పెద్ద భవంతిలో తమ బిడ్డ ఏడ ఉన్నాడో! ఏం జేసేది" అనుకుంటూ అందరూ గాభరాపడ్డారు. లోపలికి దూసుకుపోతున్న వాళ్ళను అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులు ఆపారు." ఓ పోలీసుసారు ఈడ నా బిడ్డడు యాడ ఉన్నాడయ్యా! నీ కాల్మొక్కుతా చెప్పయ్యా!" అని మంగ్యా వేడుకోవడం చూసి చుట్టుపక్కలోల్లు బోరుమన్నారు.

అప్పుడే అక్కడి నుండి వెళ్తున్న ఒక డాక్టర్‌ను ఆపి అడిగారు. అతను తనకేమీ తెలియదన్నట్లు తల వూపి వెళ్ళిపోయాడు. అంతలోనే కొందరు తెల్ల బట్టలు వేసుకున్న వారు "జై తెలంగాణ" అన్న నినాదాలతో ఆసుపత్రికి వస్తున్నది చూసి

కథ

వారిని అడిగితే తెలుస్తుంది అనుకొని అందరూ వారి దగ్గరికి చేరుకున్నారు. అందులో ముందు నడుస్తున్న గడ్డం ఉన్న పొడుగాటి వ్యక్తి వీరిని చూసి వారివైపుగా ఆత్రంగా వచ్చాడు. విషయం అతనికి అర్థమైంది. వాళ్ళు ప్రవీణ్ బంధువులేనని వారిని చూడగానే తెలిసిపోయింది.

అతను ఉస్మానియా యూనివర్సిటీ జాక్ లీడర్ మూడ్ వెంకటేశ్ చౌహాన్. వారి గోడును అర్థం చేసుకొన్న వెంకటేశ్ వారితో ప్రవీణ్ ఉన్న వార్డుకే తాము వెళ్తున్నామని అతన్ని పరామర్శించడానికే వచ్చామని బంజారా భాషలో చెప్పాడు. తాను వారిని తీసుకెళ్తానని చెప్పి వారిని తమ వెంట ఐదవ అంతస్తు వార్డుకు తీసుకెళ్లాడు. ప్రవీణ్‌ను ఐసీయూలో ఉంచారు. అద్దాల గదిలో ముక్కుకు ఆక్సిజన్ కప్పు పెట్టిన ప్రవీణ్‌ను ఒక్కొక్కరుగా వెళ్లి చూడమన్నారు డాక్టర్. వెంకటేశ్ సాయంతో కొడుకు ముందు నిలబడ్డాడు మంగీలాల్. అతని గుండె వేగం పెరిగింది. కాళ్ళకింది నుండి భూమి జారిపోతుందేమో అన్నట్లుగా అతను నిలబడలేకపోతున్నాడు. వెంకటేష్ అతని పరిస్థితి అర్థం చేసుకొని వెంటనే నర్స్‌కి చెప్పి కుర్చీ తెప్పించాడు. కొడుకును చూసి మంగీలాల్‌కు మాట పెగల్లేదు. మౌనంగానే తువ్వాలులో తల పెట్టి ఏడుస్తున్నాడు. తండ్రిని చూసిన ప్రవీణ్ నాయక్ కళ్ళవెంట కన్నీటి ధారలు తెలియకుండానే కారిపోయాయి. కొడుకు కంట నీరు చూసిన మంగ్యా తన ఏడుపు ఆపి "ఏందిరా ఇది. సదువు గిదువు పక్కన పెట్టి మమ్మల్ని తిప్పలు పెడుతున్నావ్. నీకొక బిడ్డ ఉన్నాడని మర్చిపోయినావా బిడ్డ. వాడికి ఎన్ని అబద్దాలు చెప్పాలి బిడ్డా నేను. ఎందుకురా నన్ను ఇట్లా బాధలు పెడుతున్నావ్" అన్నాడు. తండ్రి ప్రశ్నలకు మౌనంతోనే సమాధానమిచ్చాడు ప్రవీణ్. తన కొడుకు ఏడి అన్నట్టుగా ఆడి ఆడని చేతులతో సైగ చేశాడు. కొడుకు సైగ అర్థం చేసుకున్న తండ్రీ "మారోణి కాకిలి దగ్గర ఉన్నాడులే వాడు బాగానే ఉన్నాడు." అని చెప్పాడు.

ఒక్కొక్కరిగా అందరూ ప్రవీణ్‌ను చూశారు. ఆసుపత్రిలో ఉండడానికి వీల్లేదు కనుక అందరిని బయటకు పంపేశారు సిబ్బంది. ఇంత పెద్ద పట్నంలో కొడుకు కోసం ఉండాలన్నా ఎక్కడా నిలువ నీడ లేదు. వెంకటేష్ అందరికీ భోజనాలు చేయించి వరంగల్ బండి ఎక్కించాడు. ఆ రాత్రికే అందరూ తండా చేరుకున్నారు.

మూడురోజులు గడిచాయి. వార్తల్లో భాగంగా రాజకీయ నాయకులు చేసే రాస్తారోకోలు, వంటావార్పులు చూపిస్తున్నారు. కానీ తండా కొడుకు సమాచారం చూపించడం లేదు. మంగీలాల్ ఆందోళన చెందుతున్నాడు.

**ప్రవీణ్‌ను ఐసీయూలో ఉంచారు. అద్దాల గదిలో ముక్కుకు ఆక్సిజన్ కప్పు పెట్టిన ప్రవీణ్‌ను ఒక్కొక్కరుగా వెళ్లి చూడమన్నారు డాక్టర్. వెంకటేశ్ సాయంతో కొడుకు ముందు నిలబడ్డాడు మంగీలాల్. అతని గుండె వేగం పెరిగింది. కాళ్ళకింది నుండి భూమి జారిపోతుందేమో అన్నట్లుగా అతను నిలబడలేక పోతున్నాడు. వెంకటేష్ అతని పరిస్థితి అర్థం చేసుకొని వెంటనే నర్స్‌కి చెప్పి కుర్చీ తెప్పించాడు.**

అంతా మంచే జరుగుతుందని అందరూ మంగీలాల్‌ని ఓదార్చారు. ధైర్యం చెప్పారు. మంగ్యా కూడా కొంత కుదుటపడుతున్నాడు. ఇంతలోనే పిడుగులాంటి వార్త టివి బ్రేకింగ్ న్యూస్ రూపంలో తండాను దుఃఖ సాగరంలోకి నెట్టేసింది. స్వరాష్ట్రమే ఊపిరిగా పోరాటం చేసిన ప్రవీణ్ నాయక్ అమరుడయ్యాడు అనే వార్త అది. పోలీసులు కొట్టిన దెబ్బలు లోపల ప్రభావం చూపటం వల్ల శరీర భాగాలు ఉబ్బిపోవడంతో అతను మరణించాడని డాక్టర్లు చెప్పినట్టుగా సమాచారం ప్రసారం అవుతోంది.

కొంచెం కుదుట పడుతున్న మంగీలాల్ ఈ వార్త విని నిలువునా కుప్ప కూలిపోయాడు. ఆ సోయి నుండి బయటకు రాలేకపోయాడు. ప్రవీణ్ కొడుకు సైదాకు ఇదంతా తెలియ కూడదని, తెలిస్తే పసి మనసు తట్టు కోలేదని పక్కింట్లో ఉంచారు. ప్రవీణ్ త్యాగం మరువలేనిదంటూ ఉద్యమ నేతలు తమ సంతాపాన్ని ప్రకటించారు. అదే రోజు పోస్ట్ మార్టం అనంతరం సాయంత్రం పూర్యానాయక్ తండాకు ఆ అమరుణ్ణి తరలించారు. అతనొక్కడై తండాకు రాలేదు. అతని అంబులెన్స్ వెనుక వందలాది కార్లు, బైకులు, బస్సుల్లో ఉద్యమకారులు, అన్ని యూనివర్సిటీల విద్యార్థి నేతలు 'ప్రవీణ్ నాయక్ అమర్ రహే' అని నినాదం చేస్తూ తండాకు చేరుకున్నారు. ఉద్యమ కళాకారుల పాటలతో తండా మారుమ్రోగింది. వేలాది మంది తమ నినాదాల్లో ఉద్యమ వీరులను గుర్తుచేసుకున్నారు. శ్రీకాంతచారి, యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, ఇషాన్ రెడ్డి, భోజ్యానాయక్ వంటి వీరుల త్యాగాల త్రోవలో అమరుడైన ప్రవీణ్ నాయక్‌ను మనసు నిండా తలచుకున్నారు.

డప్పుల హోరు మిన్నంటుతుంటే ఆ రాత్రే ఆ అమరుడికి అంతిమ నివాళినిచ్చారు. ప్రవీణ్ ఇంటి నుండి స్మశానం దాకా పరుచుకున్న పువ్వులు అమరపురికి అతన్ని స్వాగతించాయి. ఇంకా లోకంలోకి రాని తండ్రి చేత చితికి నిప్పుపెట్టించారు తండా పెద్దలు.

అమరపురికి చేరిన ప్రవీణ్ అందరికీ దిశానిర్దేశం చేస్తున్నట్లుగా వరంగల్ చౌరస్తాలో విగ్రహమై వెలిశాడు.

అతను ఈ లోకానికి దూరమై ఇప్పటికీ 10 సంవత్సరాలు దాటింది. అతను కోరుకున్న తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. సైదాకు ఇప్పుడిప్పుడే అన్నీ తెలుస్తున్నాయి. కానీ నేటికీ మంగీలాల్ కొడుకు మనాదిలోనే ఉంటూ ఈ లోకంలోకి రాలేకపోతున్నాడు.

# భాస్కర భట్ల కృష్ణారావు యుగసంధి నవలలో నాటి తెలంగాణ

సృజనలో ప్రతిఫలించిన నాటి తెలంగాణను కళ్ళకు కట్టిన వ్యాసం...

కాంచనపల్లి గో.రా.

భాస్కర భట్ల జీవించిన కాలం నిజంగా సంధి కాలమే. తెలంగాణ (హైదరాబాద్) రాష్ట్రం, దానితో పాటు సామాజిక జీవితం, సాహిత్యం భాష, అన్నింటికీ సంధి కాలమే. కాబట్టే బహుశ రచయిత ఈ నవలను యుగసంధి పేరుతో కొనసాగించాడు. కాగా తెలంగాణలో 1950కి ముందు రచనలు చేసిన సృజన కారునిలాగే భాస్కర భట్ల కూడా తన ప్రతిభకు తగిన గుర్తింపు పొందలేక పోయిండు. గుర్తింపును గురించి కీర్తిని గురించి అంతగా లెక్కచేయకుండా తన పద్ధతిలో తాను కొనసాగే తెలంగాణ స్వాభావికతే అయనతో రచనలు చేయించింది. ఏమయినా కృష్ణారావు ఆధునిక తెలంగాణ సాహితీలోకం నిరంతరం స్మరించుకోదగిన రచయిత. హైదరాబాద్ ఇప్పటి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాలలోని రాజేంద్ర నగర్ దగ్గర బుద్వేల్ వీరి స్వగ్రామం. ఈయన తలిదండ్రులు లక్ష్మీబాయి అంజయ్యలు, డిసెంబర్ 19, 1918 అయన జన్మకాలం.

భాస్కర భట్ల రాసిన యుగసంధి నవల 1921 నుండి 1948 వరకు జరిగిన చారిత్రక విషయాలు సామాజిక సందర్భాలన్నింటినీ ప్రోది చేసింది. నాటి హైదరాబాద్ రాష్ట్రంలోని కల్లోల పరిస్థితులు, గ్రామ వాతావరణం, కులవ్యవస్థ, బ్రాహ్మణ కుటుంబాలలో ఆ కాలంలోనే కనిపించిన డొల్లతనం యుగసంధిలో కనబడుతాయి. భాస్కరభట్ల నవలలో చిత్రించిన పాత్రలు కల్పిత పాత్రలుగా కనబడవు. మన జీవితంలో ఎప్పుడో ఎక్కడో తారసపడే ప్రత్యక్ష పాత్రలు అనిపిస్తాయి. వాటిని తీర్చి దిద్దిన ఈ రచయిత సంవిధానం దీనికి దోహదకారిగా నిలిచింది.

ఈ నవల కొందరు వ్యక్తుల కథల సమాహారం. ఒక ఏకసూత్రత దీన్ని ఒకే నవలగా నిలిపింది. ఇది రమణి, పద్మావతి, రఘు, రుక్మిణి, అనే నాలుగు పాత్రల చుట్టు తిరిగే కథ. రుక్మిణి కథకు రమణి పద్మావతిల కథకు పెద్దగా సంబంధం లేదు. ఒకే సామాజిక వర్గానికి చెందిన బంధువులలో ఇవి వేరువేరుగా జరిగిన కథలు. కలుపుతున్నది మాత్రం కుటుంబమే.

రమణ ఆధునిక కాలానికి నిలువెత్తు ప్రతీక. ఈనాటి స్త్రీవాద భావజాలం అంతగా లేని కాలం అది. 1848-1919 మధ్యకాలంలో జీవించిన కందుకూరి (భాస్కరభట్ల పుట్టింది కందుకూరి నిర్యాణానికి ఒక సంవత్సరం ముందు) సంస్కరణా వాద ప్రభావం ఈ నవలపైన కొంతవరకే ఉంది. అట్లాగే భాస్కర భట్ల కంటే 24 ఏళ్ళు ముందు పుట్టిన చలం ప్రభావం కూడా అంతగా లేదు. రుక్మిణి పాత్రని చూస్తే కొంత అనిపిస్తుంది కాని చలం పాత్రలలాగా విద్యావంతురాలైన నాగరిక స్త్రీ పాత్రలవలె కాదు రుక్మిణి. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన రుక్మిణి అవిద్యావంతురాలు. లోకాన్ని సమాజాన్ని గురించి అవగాహన లేని అవివేకి. చలంలోని విపరీత ప్రేమ, కాల్పనికత, భాస్కరభట్లలో కనిపించదు. భావోద్రేకం కంటే సామాజిక వాస్తవికతే ప్రధానంగా కనిపిస్తుంది. భాస్కరభట్ల రచన ఓ పెద్దమనిషి మనముందు కూచొని ముచ్చట పెట్టినట్టు భేషజం లేకుండా సాగిపోతుంటుంది.

కథలో రుక్మిణి అంధ సంప్రదాయం తలమోసే సగటు కుటుంబానికి చెందిన వ్యక్తి. బాల్య వివాహం వల్ల భర్తను చిన్నప్పుడే కోల్పోతుంది. విధవరాలుగా ఇంట్లో ఉంటుంది. విశ్వేశ్వర్ రావు వాళ్ళింట్లో అద్దెకుంటాడు. చివరికి విధవగా యవ్వనంతో సౌదర్యవతిగా ఉన్న ఆమెని లేవదీసుకు పోతాడు. రుక్మిణి పైన విశ్వేశ్వర్ రావుకు అవ్యాజమైన ప్రేమ లేదు. అతనిలో ఉంది శరీరాకర్షణే. మోసం చేయాలనే దురుద్దేశమే. అమాయకురాలైన రుక్మిణి అతని మాటలు నమ్మి అతనితో అర్ధరాత్రి ప్రేమవతి పేటను వీడి వెడుతుంది.

ప్రేమవతీపేటను వదలిపెట్టేటపుడు

రచయిత రుక్మిణి భావోద్రేకాన్ని చిత్రించాడు. నాటి ప్రజలలోని నమ్మకాలు కనబడతాయి. ఇంట్లో అశుభం జరుగబోతున్నపుడు పాము కనబడుతుంది. అది వాళ్ళింట్లో ఎప్పటి నుంచో ఉంటున్న పాము. రుక్మిణి వెళ్ళేటపుడు కూడా పాము పడగ నేల కేసి కొట్టి ఆమెని హెచ్చరిస్తుంది. అంత దూరం వచ్చాక వెనుదీయలేక ముందుకు సాగుతుంది. ఇంకా నవలలో శకునాల ప్రసక్తి వస్తుంది. చెడ్డ కలలు వచ్చినపుడల్లా అశుభాలు జరుగుతాయి. రచయిత ఈ శకునాల పట్ల అనుకూలంగా ఉన్నట్టు తెలుస్తుంది. రుక్మిణి వెళ్లిపోయే ముందు ఆవుని దూడని ప్రేమించిన తీరు, ఆమె లాంతరుతో ఇల్లంతా కలయదిరగడం మన కళ్ళముందే జరిగినట్టే చిత్రిస్తాడు.

చివరికి రుక్మిణి ఇల్లు విడిచి పెట్టి విశ్వేశ్వర్‌రావు మోసానికి గురౌతుంది. సామాజిక అవగాహన లేని అవిద్యావంతురాలు కాబట్టి విశ్వేశ్వర్‌రావు లాంటి అమానవుడు ఆమెని సులభంగా మోసగించగలిగాడు. ఆమె తనను అర్పించడమే కాక తన దగ్గర ఉన్న కంటెలాంటి నగలన్నీ ఇచ్చేస్తుంది. దుర్వ్యసనాలు, అప్పులు ఉన్న విశ్వేశ్వర్ రావు ఆమెని రామనాథం అనే వ్యక్తికి తాకట్టు పెడతాడు. విశ్వేశ్వర్‌రావు తిరిగిరాడని క్రమంగా రుక్మిణికి అర్థం అవుతుంది. ఆమెని రామనాథం లొంగదీసుకొని ఆమె ప్రమేయం లేకుండానే తన ఇంటికి తీసుకెడతాడు. రుక్మిణి రామనాథానికి శారీరకంగా లొంగినా అతనిపట్ల అనాసక్తంగా ఉంటుంది. రాయి లాగా ప్రవర్తించే రుక్మిణితో రామనాథం విసిగిపోయి ఆమెని వదిలేసి వెళ్ళిపోతాడు. రుక్మిణికి బతుకు తెరువు లేకుండా అవుతుంది. కూలి చేసుకునే ఎల్లమ్మను ఆశ్రయిస్తుంది. ఎల్లమ్మ సాయంతో ఆమె కూలీ చేసుకునే ఉద్యోగిగా చేరిపోతుంది. అప్పటి సమాజంలో కూడా లంచం రాజ్యం చేయడం ఒక సాధారణాంశం. అది యుద్ధసమయం కాబట్టి లంచం స్వైర




విహారం చేస్తుంది. చివరికి ఎట్లాగో రుక్మిణి ఉద్యోగం లో చేరుతుంది. సిగరెట్టు కంపెనీ మేనేజరు రషీద్ స్త్రీలోలుడు. అతడు కంపెనీలో పనిచేసే ఏ స్త్రీని కోరినా కాదనకూడదు. కాదంటే ఉద్యోగం పోతుంది. అనేక ప్రయత్నాలద్వారా రుక్మిణి దగ్గర అతను తన భావం వ్యక్తం చేస్తాడు. చివరికి ఎల్లమ్మను రాయబారిగా పంపుతాడు. లొంగకపోతే రుక్మిణిదే కాక ఎల్లమ్మ ఉద్యోగం కూడా పోతుంది. తప్పని పరిస్థితిలో రుక్మిణి లొంగి పోతుంది. విధి లేని పరిస్థితిలో రుక్మిణి ఒప్పుకొంటుంది. రషీద్ కొన్ని రోజులు రుక్మిణితో సంబంధం కొనసాగిస్తాడు. తరువాత రజాకార్ల దౌష్ట్యం పెచ్చరిల్లింది. రజాకార్లు హిందూ స్త్రీతో సంబంధం వదలివేయమని చెబుతారు. రషీద్ అందుకు అంగీకరించడు. రజాకార్లు అతన్ని డబ్బు అడుగుతారు. రషీద్ రజాకార్ ఉద్యమాన్ని వెతిరేకిస్తాడు. నిజమైన ముస్లింలు భారతదేశంలోనే లేరని, ఒకప్పుడు వచ్చిన ముస్లింలు భారతదేశంలో కలిసిపోయారని రజాకర్ల పోరాటం వ్యర్థం అని చెబుతాడు. అందరమూ ఇపుడు భారతీయులమే అని వాదిస్తాడు. రజాకర్ల ఆగ్రహం మిన్నుముడుతుంది. చివరికి రషీద్ హత్యకు గురౌతాడు. రుక్మిణి మళ్ళీ

అనాథగా మారుతుంది. రుక్మిణి అవిద్య, మూఢాచారాలలో మునిగిపోవడం ఆమెని చీకటిలో నెట్టివేస్తుంది. రుక్మిణి వెంకట్రామయ్యని చూద్దామని పీల్ ఖానాకు వెడుతుంది. అప్పటికి ఏడేళ్ళ క్రితమే ఆయన చనిపోయాడని చెబుతారు. ఆమె హతాశురాలై తిరిగి వస్తుంది.

ఇక మరో పార్శ్వంలో కొనసాగిన కథాంశం. రఘు, రమణ, పద్మలది. మొదట రమణ రఘు ప్రేమించు కుంటారు. తండ్రి నారాయణ రావు రమణను రఘుకు ఇవ్వనని చెబుతాడు. దాంతో రఘువాళ్ళ కుటుంబం అవమానంతో ఆ ఊరి నుండి వెళ్ళి పోతారు. తరువాత క్రమంగా రఘుకు రమణకు ఆకర్షణే కాని నిజమైన ప్రేమ కాదని అర్థమౌతుంది. తరువాత రమణ స్నేహితురాలు పద్మావతితో రఘుకు సాన్నిహిత్యం పెరుగుతుంది. రమణ కూడా పద్మావతి రఘు వివాహం జరుగాలని కోరుకుంటుంది. రమణ తనకు తల్లిదండ్రులు కుదిర్చిన సంప్రదాయ వివాహం కాదంటుంది. తను అప్పుడప్పుడే వివాహం చేసుకోబోనని చెబుతుంది. ఆమె డాక్టర్ చదువాలను కొంటుంది. కాని డాక్టర్ చదివే ఆర్థిక స్తోమత ఉండదు. పద్మావతి ఆర్థికంగా సహకరిస్తానని అన్నా తిరస్కరిస్తుంది. ఇంట్లో తల్లి వెతిరేకించినా వినకుండా చివరికి నర్స్ కోర్సులో చేరుతుంది.

పద్మావతి-రఘుల ప్రేమ చివరికి పరిపాక దశకు చేరుకొని పెళ్లి వరకు వెడుతుంది. చివరికి రమణ వ్యూహం ఫలించి పద్మావతి రఘుల పెళ్లి అవుతుంది. పెళ్లికి రఘు తల్లి వెతిరేకిస్తుంది. అయినా పెళ్లి జరిగిపోతుంది.

ఈ నవల 1921 నుండి 1948 వరకు జరిగిన సామజిక పరిస్థితులు చక్కగా ప్రతిఫలించింది. రమణ పాత్రను రచయిత చిత్రించిన తీరులో ఎంత ప్రాసంగికత ఉందో చూడండి.

వివాహమే స్త్రీ జీవిత పరమావధా?

కొందరు పురుషులు ప్రపంచంలో అవివాహితులుగా ఉండి ఏదో మహదాశయం కోసం తన జీవితాన్ని బలిపెడుతున్నపుడు, కొంత మంది స్త్రీలు మాత్రం ఏదో మహోన్నతాశయం కోసం తమ జీవితాన్ని ఎందుకు త్యాగం చేయకూడదు.

ఒక కాలంలో ఆస్తి మనకు రక్షణ నిచ్చింది. భద్రతని సమకూర్చింది. కానీ ఈ రోజు మన యోగ్యత విజ్ఞానాలు మనకు భద్రతనిస్తున్నాయి. మనకు అవసరమైన యోగ్యత ఉంటే మనం ఈ విశాల విశ్వంలో పొట్ట పోసుకోగలం.

పాత విలువల స్థానంలో కొత్త విలువలు స్థాపించుకోవాలి. అది యుగధర్మం. పాతవిలువలు దిగజారి పోతున్నందుకు మనం దిగ్భ్రమ చెందకూడదు. ఆశ్చర్య చకితులం కాకూడదు. పాత విలువలు ఎందుకు దిగజారిపోతున్నాయో మనం దీర్ఘంగా ఆలోచించాలి. పూర్వాపరాల్ని మేధాశక్తితో సమన్వయము చేసికొని యుగధర్మానికి అనుగుణంగా ఉండే కొత్తవిలువలు సృష్టించుకోవాలి. పాత విలువలని అంటిపెట్టుకొని, వాటినే జీవితంలో ఆదర్శంగా నిలుపుకోవడం మూఢ లక్షణం.

ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ మణిపూర్‌ని ముట్టడించిన నాటి పరిస్థితులు, భారత జాతీయనాయకుల సత్యాహింసల ప్రబోధం, అదే సమయంలో లార్డ్ వేవెల్ ఒక్క కమాండరిన్ చీఫ్ పదవులు తప్ప మిగతా పదవులు భారతీయులకే ఇస్తానని చెప్పడం, భారత నావికులను బ్రిటిష నావికులతో సమానంగా చూడక పోవడం వల్ల భారత నాయకులు చేసిన తిరుగుబాటు, భారత్ పాకిస్తాన్ విభజన, చివరకు 1947 ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్య సిద్ది లాంటి అంశాలన్నీ ఈ నవలలో చర్చకు వస్తాయి.

హైదరాబాద్ స్వతంత్ర ప్రకటన, ఖాసిం రజ్వీ ఇత్తెహాదుల్ ముసల్ మిన్ సంస్థకు అధ్యక్షుడై చేసిన దురంతాలు ఈ నవలలో చోటుచేసుకున్నాయి. కథలో పద్మావతి తండ్రి ఆంజనేయులు రజాకార్ల బెదిరింపుకు గురౌతాడు. రుక్మిణి ప్రియుడు రషీద్ హత్యకు గురౌతాడు. రాఘవ సత్యాగ్రహ ఉద్యమంతో ప్రభావితుడౌతాడు. తన చదువు ఆపేసి ఉద్యమంలో చేరాలనుకొంటాడు. కాని పద్మావతి ప్రభావంవల్ల ఆమె చేసిన ఆర్థిక సహాయం వల్ల చదువుకొనసాగిస్తడు. నాటి సంక్లిష్ట పరిస్థితులకు చిత్రిక పడుతూ నవల కొనసాగుతుంది.

నిజాం ప్రభుత్వం ఆగడాలు మితి మీరడం వల్ల స్టేట్ కాంగ్రెస్ ఒక మహత్తర ఉద్యమానికి సంకల్పిస్తుంది. రజాకార్లు భారత ప్రభుత్వానికి వెతిరేకంగా యుద్ధానికి సంకల్పిస్తారు. హైదరాబాద్ దారుల్ ఇస్లాం ఇత్తెహాదుల్ కేంద్ర కార్యస్థానం అయింది. నగరంలోని కార్యస్థానంలో దివారాత్రాలు రజాకార్ల సైనిక విన్యాసాలు జరిగాయి. జిల్లాల వారీగా రజాకార్లు పరేడ్లు జరిపి సైనికదుస్తుల్లో ఉన్న ఇత్తెహాద్ నాయకునికి సైనికవందనం చేయడం మొదలు పెట్టారు. వేల కొలది సంఖ్యలో రజాకార్లు జిల్లాలనుండి నగరానికి రావడం మొదలైంది. ఇత్తేహాదుల్ ముసల్మిన్ సంస్థ అధ్యక్షుడు ఖాసింరజ్వి 'నేనే రాజును' అని ఒక ప్రకటన చేశాడు. నిజాంకు తను పాముకు పాలుపోసి పెంచానని అర్థం అయింది.

క్రమంగా భారత సేనలు లెఫ్టినెంట్ గవర్నర్ జనరల్ రాజేంద్రసింగ్ పర్యవేక్షణ కింద సంస్థానంపై ముట్టడి జరిపాయి. ఈ పోలీస్ చర్యకు మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి నాయకత్వం వహించారు. ఖాసిం రజ్వి అరెస్ట్ అయ్యాడు. హైదరాబాద్ భారత్ యూనియన్లో విలీనమైంది. నవల బిగి సడలకుండా రచయిత ఈ చరిత్రకాంశాలన్ని పొందుపరచాడు. రచయిత మధ్యలో రావడం ఆనాటి పరిణితి చెందుతున్న నవలా శిల్పానికి ప్రతీకగా భావించవచ్చు.

నవలలో శకునాలు, కలలు, బ్రాహ్మణ కుటుంబాలలోని పాత నమ్మకాలు కనబడతాయి. రచయిత మొగ్గు కొంత వాటికి అనుకూలంగానే ఉన్నట్టు కనబడుతుంది. మధ్యతరగతి జీవితాల్లోని ఆటుపోట్లు, నాటి యువతీ యువకు లలోని ప్రేమ, దాని వ్యక్తీకరణ పద్ధతి, మనం తెలుసుకొంటాం. రమణ, పద్మావతి వంటి యువతులను పోలిస్తే ఇప్పటి విద్యావంతులైన అమ్మాయిలకు ఎంత తేడా ఉన్నదో బోధపడుతుంది. ఆనాటి అమ్మాయిలలో ఉన్న అభ్యుదయ భావాలూ రమణలో చూస్తాం. రఘులో ఇతరుల వల్ల సులభంగా ప్రభావితమయ్యే అపరిణత చూస్తాం. ఆ కాలంలోని టాంగాలు రిక్షాలు నాటి సామజిక స్థితిని తెలియజేస్తాయి.

హైదరాబాద్ పోలీస్ చర్య సందర్భంగా జరిగిన అనేక కొత్త విషయాలు ఇటీవలి కాలంలో జరుగుతున్న పరిశోధన వల్ల వెలుగులోకి వస్తున్నాయి. పరిశోధకులు చూపించే ఆధారాలను బట్టి అవి రికార్డ్ అవుతాయి.

ఏమైనా భాస్కర భట్ల అన్యాపదేశంగా నాటి సమాజాన్ని రికార్డు చేయడం విలువైనదిగా అర్థం చేసుకోవాలి. ఆయన రచనా శిల్పం కూడా ఆనాటికి ఆధునికమే. సాహిత్యంవల్ల కలిగే సామాజిక ప్రయోజనాన్ని ఈ నవల అక్షర సత్యం చేసింది.

**సిగరెట్టు కంపెనీ మేనేజరు రషీద్ స్త్రీలోలుడు. అతడు కంపెనీలో పనిచేసే ఏ స్త్రీని కోరినా కాదనకూడదు. అనేక ప్రయత్నాలద్వారా రుక్మిణి దగ్గర అతను తన భావం వ్యక్తం చేస్తాడు. చివరికి ఎల్లమ్మను రాయబారిగా పంపుతాడు. లొంగకపోతే రుక్మిణిదే కాక ఎల్లమ్మ ఉద్యోగం కూడా పోతుంది. తప్పని పరిస్థితిలో రుక్మిణి లొంగి పోతుంది. విధి లేని పరిస్థితిలో రుక్మిణి ఒప్పు కొంటుంది. రషీద్ కొన్ని రోజులు రుక్మిణితో సంబంధం కొనసాగిస్తాడు.**

# పిట్టల మనిషి



వేముగంటి మురళి, 9676598465

పిట్ట తనని వెంటాడుతుందో
తాను బంధువులా వాటి కోసం
ఎదురుచూస్తాడో గాని
నిత్తెం నీటి ప్రవాహం లాంటి కలను
భుజంమీద వేసుకుని బయలుదేరుతాడు

చెట్టు మీద వాలుతూనో
గుట్ట గుండె మీద కన్నీళ్ల గుమ్మరిస్తూనో,
చెరువు ముఖంలో ముఖం పెట్టి
అందాలను దిద్దుకుంటూనో
అతని కెమెరాకు చిక్కుతుంది
ఒక రాయంచ

అంతులేని ఆకాశాన్ని పిట్టచూపుతో
అలికే దృశ్యాన్ని చిత్రిక పట్టడానికి
ఉదయం మట్టిమీద వెలుతురు ముగ్గేసే వేళ
అడవికి చేరతాడు

కొన్ని పక్షులు కవ్విస్తయి,
మరికొన్ని కరుణిస్తయి,
అలిగేటియి కొన్ని,
అలుగుమీద ఎగిరేటియి కొన్ని,
పక్షపక్షులు కొన్ని,
పండుగ పక్షులు కొన్ని

రెక్కల భాషతో పలుకరిస్తూ
వలసొచ్చినవి వెంట తిప్పుకుంటయి
కుదురుగా నిలబడవు, నిలబడనివ్వవు

ఒక్కోసారి పక్షితాకని కొమ్మలుంటవి
కన్నుకు చేరని పిట్టలుంటై
నిరీక్షణ తపనను పరీక్షిస్తది
ఓపిక ఖండాంతర దృశ్యాన్ని
ఒడిలో దింపుతుంది

కొత్తవి మురిపిస్తయి
పాతయి తోడును పరిచయం చేస్తయి

ఓపిక మేఘమై ఛత్రీ పట్టుకొని
వెంట తిరుగుతుంది
దృశ్యాలు మనసు మీద ఆనందాల
తలంటు పోస్తుండగా కొమ్మలమీద నెమళ్ళు వాలి
లెన్సును నీలం రంగుగా మారుస్తయి

పిట్టలు సాయంత్రమయ్యేసరికి
ఆకాశం మెడలో దండలై పోతై
అతని కెమెరాకు కన్నుగొడుతూ
తుర్రుమని ఎగురిపోతాయి

*(తెలంగాణ జాగృతి కాళోజి జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న నిర్వహించిన కవి సమ్మేళనంలో వినిపించిన కవిత)*

వ్యాసం

# అమృతమూర్తి అడవి బాపిరాజు

తెలంగాణ స్ఫూర్తి దాతను వివరించిన వ్యాసం...



ఎస్.వి. రామారావు
98480 12053

కవిత్వం, కథా-నవలా రచన, చిత్రలేఖనం అన్నింటినీ కలబోసుకున్న లలిత కళా హృదయుడు అడవి బాపిరాజు, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కళానురక్తుడు ఆస్వాల్డ్ క్యూల్డే విద్యార్థిగా ఆంగ్లం, చిత్రకళ, జానపద కవిత్వం పట్ల అభిరుచిని పెంపొందించుకొన్నాడు. తర్వాత బందరు జాతీయ కళాశాలలో ప్రమోద కుమార ఛటర్జీ వద్ద చిత్రకళను కూలంకషంగా అభ్యసించాడు. దేశభక్తితో స్వాతంత్రోద్యమంలో కాలూని 1922లో ఏడాది జైలుశిక్ష ననుభవించాడు, బి.ఏ., బి.ఎల్. పట్టభద్రుడై భీమవరంలో కొంతకాలం న్యాయవాద వృత్తిలో (1929-33) గడిపాడు. అనంతరం బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాలు పదవిని (1934-39) చేబట్టాడు. సినిమా రంగంపై ఆకర్షణతో మద్రాసులో 1939లో మూడు చిత్రాలకు (అనసూయ, మీరాబాయి, ధ్రువ చరిత్ర) కళాదర్శకత్వం నిర్వహించాడు. చివరి దశలో హైదరాబాద్ నుండి వెలువడిన 'మీజాన్' వారపత్రికకు సంపాదకుడుగా (1943-47) ఉండి విస్తృతంగా సాహిత్య రచన చేశాడు.

బాల్యంలోనే కవిత్వ రచనాకళ అబ్బిన బాపిరాజు 15 ఏళ్ల ప్రాయంలో (1910) నరసాపురంలోని తిరుపతికవుల అవధానంచేత ప్రభావితుడై అయ్యప్ప అనే



విద్యార్థిని జంటకవిగా చేసుకొని అవధానాలు చేశాడు. బెజవాడ కన్యకా పరమేశ్వరి పాఠశాలలో కొప్పరపు సుబ్బారావుతో కలిసి జంటకవిత్వం చెప్పాడు. తర్వాత కొప్పరపు సోదర కవులలో ఒకడైన సుబ్బారావు తిరుపతి కవుల ప్రత్యర్థియైనాడు. బాపిరాజు కూల్డే ప్రేరణతో ఆంగ్ల కవితలు, జానపద గీతాలను ఆకళింపు చేసుకొని నవ్య కవితకు శ్రీకారం చుట్టాడు. హారతి, తొలకరి, గోధూళి (నవ్య సాహిత్య పరిషత్తు ప్రచురణ - 1938), శశికళ (1939) మొదలైనవి ఆయన గేయకవితా సంపుటులు, వీటిలోని గేయాలు నండూరి, బసవరాజు పాటలను తలపుకు తెస్తాయి, గోధూళిలోని కిష్టమ్మా గోపాల బాల కిష్టమ్మా, రావోయి చిన్నవాడా, డూడూ డూడూ ఎంకన్నా, ఉప్పొంగి పోయింది గోదావరి, శశికళలోని పాడకే నారాణి పాడకే పాట, పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే, మరచి పోవబోకే బాల, నువ్వూ నేనూ కలసి మున్నగు లలితగీతాలు రసజ్ఞుల నాలుకలపై నర్తించి, ఆకాశవాణిలో ప్రసారితమై ఆదరణ పొందాయి. "హిమాలయోత్తుంగ శృంగం నీ బ్రతుకు ఉమాపతి నృత్య తరంగం" అంటూ గాంధీ మహాత్ముని కీర్తించాడు. "నా ఆశయమూర్తి. నా ఆత్మపూజా పీఠస్థ శిల్పకళా లక్ష్మి" అంటూ ఊహాప్రేయసిగా సృష్టించుకొన్న శశికళ తొలుత కథల్లో ప్రత్యక్షమై, తర్వాత కవితల్లో మిరుమిట్లు గొలిపింది.

నవలా రచయితల్లో అడవి బాపిరాజుది విశిష్ట స్థానం. హిమబిందు, గోన గన్నారెడ్డి, అడవి శాంతిశ్రీ చారిత్రక నవలలు, నారాయణరావు, కోనంగి, తుపాను సాంఘిక నవలలు నవలా చక్రవర్తిగా ఆయనకు ఖ్యాతిని గడించాయి. కారాగారవాసంలో ప్రారంభించిన శాతవాహనుల చరిత్ర అయిన 'హిమబిందు' శారద పత్రికలో (1924-25) ధారావాహికంగా అచ్చయింది. చారుగుప్తుని కూతురైన హిమబిందు సువర్ణశ్రీ అనే శిల్పిని

(ప్రేమించి వివాహమాడటం, శ్రీముఖ శాతవాహనుని విజయ యాత్రలు మున్నగు అంశాలతో కూడిన ఇందలి ఇతివృత్తం కల్పనాత్మకమైన పాఠకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తుంది. విషబాల మొదలైన పాత్రలు ఆకట్టుకొంటాయి. కాకతీయ సామ్రాజ్యాన్ని కూల ద్రోయడానికి వైరి వర్గాలు చేస్తున్న ప్రయత్నాలను ప్రభుభక్తి పరాయణుడైన మాండలిక నాయకుడు ప్రతిఘటించటం వస్తువుగా గలది 'గోన గన్నారెడ్డి' నవల. 'అడవి శాంతిశ్రీ' ఇక్ష్వాకుల నాటి వైదిక బౌద్ధ ధర్మాల సంఘర్షణను చిత్రిస్తుంది.

సమకాలీన రాజకీయ, సాంఘికోద్యమాలను ప్రతిబింబించే సాంఘిక నవల 'నారాయణ రావు' విశ్వనాథ వేయిపడగలు నవలతో పాటు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు బహుమతిని (1934) అందుకొంది. బాపిరాజు జాతీయ దృక్పథం, ఆంధ్రాభిమానం ఇందులో ప్రస్ఫుటంగా ద్యోతకమైనాయి, 'ప్రపంచ యుద్ధాల వాతావరణంలో ఎదురైన సామాజిక పరిస్థితుల సంఘర్షణతో కొనసాగిన సామాన్య యువకుడి జీవితాన్ని సమర్థంగా చిత్రిస్తుంది 'కోనంగి' నవల. (బ్రాహ్మణ వితంతువు కుమారుడు వేశ్య కుమార్తెను వివాహమాడటం రచయిత సంస్కరణ దృక్పథానికి నిదర్శనం. పాత్రల చిత్త వృత్తుల సంఘర్షణ గంభీరంగా చిత్రించిన 'తుఫాను' నవల తాత్త్వికతతో




ఉదాత్త స్థాయిలో కొనసాగుతుంది. నరుడు, జాజిమల్లి నవలికలు కూడా గణనీయమైనవి. ఆయన చిత్రించిన పాత్రలన్నీ కళామూర్తులుగా రూపుదిద్దుకొన్నాయి.

చారిత్రాత్మక, సాంఘిక నవలలేకాక బాపిరాజు చిత్ర-శిల్ప కళాభిమానాన్నీ సంప్రదాయానురక్తినీ, సంస్కార హృదయాన్నీ అసంఖ్యాకమైన కథలు కూడా వైభవోపేతంగా చాటుతాయి. అంజలి, రాగమాలిక, తూలికా నృత్యం, తరంగిణి ఆయన కథా సంపుటులు. భారతి, ఆంధ్రపత్రికల్లో ఆయన కథలు అచ్చయినాయి. భోగీరలోయ, నాగలి, తిరుపతి కొండ, హంపీ శిథిలాలు, శైలబాల, సూర్యసుత, నేలతల్లి, బొమ్మలరాశి మొదలైన కథలు వస్తువులో, కథన శిల్పంలో, భాషాశైలిలో ఎన్నదగినవి. 'తరంగిణి'లో ఆడవాళ్ళ అణచివేతను తీవ్రంగా ప్రతిఘటించాడు.
"ఆ కళాహృదయుని హృదయము అతి విశాలమైనది. గొడ్ల కాపర్లకు, ఉప్పర్లకు, కార్మికులకు, అంధులకు, వంగులకు, భిక్షకులకు స్థానమున్నది. ఆ ప్రకృతి ఉపాసకుడు అనాథలను, భూపుత్రులను తనవారిగానే భావించాడు. ఆయన కళారాధకుడే కాడు, కారుణ్యమూర్తి కూడా" అన్న గొర్రెపాటి వెంకటసుబ్బయ్య వాక్యాలు (అక్షరాభిషేకం, పు. 154) బాపిరాజు సాహితీ హృదయాన్ని మూర్తివంతం చేస్తాయి.

అడవి బాపిరాజు ప్రముఖంగా చిత్రకారుడు. ఆయన చిత్రలేఖనంలో కవితా కళ, సాహిత్య సృజనలో చిత్రకళ అవినాభావంగా ప్రతిబింబిస్తాయి. దేశ పర్యటనలో గుహాశిల్పాలూ, కుడ్య చిత్రాలూ దర్శించి సౌందర్య రాధకుడుగా రాటుదేలాడు. ఆంధ్ర దేశంలో చిత్రకళపై ఉపన్యాసాలు చేశాడు. సముద్రగుప్తుడు, ఖడ్గ తిక్కన, రుద్రమదేవి, శశికళ మున్నగు చిత్రాలు ప్రశంసా పాత్రములైనాయి. కవిబ్రహ్మ చిత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయ బహుమతినందుకొన్నది. స్వీయకావ్యాలకే కాక విశ్వనాథ కోకిలమ్మ పెళ్లి, కిన్నెరసాని పాటలు, నండూరి ఎంకి పాటలకు ముఖపత్రాలు దిద్దాడు. బందరు, భీమవరం, హైదరాబాదు, మద్రాసులలో కళాపీఠాలు స్థాపించి కులపతియైనాడు.

నిజాం ప్రభువుకు విధేయుడైన గులాం మహ్మద్ కలకత్తా వాలా హైదరాబాద్‌లో ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు - మూడు భాషల్లో 'మీజాన్' (త్రాసు అని అర్థం) దినపత్రి కను నిర్వహించగా తెలుగు పత్రికకు అడవి బాపిరాజు సంపాదకుడుగా (1943-47) వ్యవహరించాడు. ఆయన గోన గన్నారెడ్డి, కోనంగి, తుఫాను నవలలు అందులోనే ధారావాహికంగా ముద్రితమైనాయి. 1947లో ఒకరోజు ఆయనకు తెలియకుండానే నిజాంకు విరుద్ధమైన పతాక శీర్షిక పత్రికలో వెలువడగా కలత చెందిన బాపిరాజు 1947 ఆగస్టు 7న హైదరాబాద్‌ను వదిలివెళ్లాడు. బాపి బావగా అందరికీ ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదును పొందాడు. "అడివోరి చిన్నవాడ, అమృత ధారలవాడ" అని విశ్వనాథ కొనియాడిన అమృతమూర్తి అడవి బాపిరాజు.

**చారిత్రక, సాంఘిక నవలలేకాక బాపిరాజు చిత్ర-శిల్ప కళాభిమానాన్నీ సంప్రదాయాను రక్తినీ, సంస్కార హృదయాన్నీ అసంఖ్యాకమైన కథలు కూడా వైభవోపేతంగా చాటుతాయి. అంజలి, రాగమాలిక, తూలికా నృత్యం, తరంగిణి ఆయన కథా సంపుటులు. భారతి, ఆంధ్రపత్రికల్లో ఆయన కథలు అచ్చయినాయి.**

కవిత

# సామ్రాజ్యవాదులు



నూటెంకి రవీంద్ర, 9491533295

పైడికంటెనో
గబ్బిలమో
లేకుంటె ఉడుమో సొత్తె
కొన్నొద్దులన్న
'ఇల్లిడ్సి వెట్టాలె' అనంటరు
అటెంక శాంతి జేపిచ్చుకొని
మల్ల మనింట్లకు మనం బోవచ్చు గనీ...

గాల్లు ఎక్కడన్న సొరబడ్తె మాత్తరం
గక్కడున్నోల్లు దేన్నైనా యిడ్సివెట్టుడే దప్ప
మల్ల వట్టుకును డుండదిగ

గాల్లు యెక్కణ్ణుంచో వచ్చి
అచ్చుం గట్లనే -
పైడికంటెల్లెక్క వాల్తరు
తలకిందుల ఆలోశన్ల తోని
గబ్బిలం తిరంగనే యాలాడ్తుంటరు
శెట్టాల శేతుల్లోని మెడలు వట్టి దొబ్బినా
ఉడుంపట్టు వట్టుకొనే ఉంటరు గని
కదులరు మెదులరు

గుణగణాల్తో పనేంది?!
గణశ్రేణిల్నే వెంచుకుంటరు మందబలాన్ని

గీ న్యాల మీద
ఎక్కడ గాల్లు పాదం మోపినా
గక్కడి శెరిత్ర పుటలకు శెదలు బడ్తది
రామసక్కని ధర్మాలకు
పరాయీకరణ అనే కరోనా సోకుతది
యెన్నీలోలె యెలిగే నాగరికత
యెన్కటి యుగాల శీకట్లకు జారుకుంటది

గ్రపుడెక్క ఆకుల్తో నిండిన వానాకాలపు శెర్వోలిగె
గాల్ల కబ్జలకు వోయిన ఎంత గొప్ప యిల్లైనా
పాడువడ్డ కొంపే అయితది.



*(తెలంగాణ జాగృతి కాళోజి జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న నిర్వహించిన కవి సమ్మేళనంలో వినిపించిన కవిత)*

సాహితీ శిఖరం

# స్వేచ్ఛావాద కమ్యూనిజం ప్రతిపాదకుడు "జోస్ డి సౌసా సరమాగో"

నోబెల్ బహుమతి (1998)



జోస్ డి సౌసా సరమాగో 1922 నవంబరు 16న జన్మించారు. 18 జూన్ 2010న పరమపదించారు. పోర్చుగీస్ రచయిత మరియు సాహిత్యంలో 1998 నోబెల్ బహుమతి గ్రహీత. అతని రచనలు, చారిత్రక సంఘటనలపై విధ్వంసక దృక్పథాలను ప్రదర్శిస్తాయి, సరమాగో పుస్తకాల యొక్క రెండు మిలియన్లకు పైగా కాపీలు పోర్చుగల్లో అమ్ముడయ్యాయి. మరియు అతని రచనలు 25 భాషలలోకి అనువదించబడ్డాయి. ఈయన స్వేచ్ఛావాద కమ్యూనిజం యొక్క ప్రతిపాదకుడు. కాథలిక్ చర్చి, యూరోపియన్ యూనియన్ మరియు అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి సంస్థలను సరమాగో విమర్శించారు. ఈయన నాస్తికుడు, మానవ పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఒక సాధనంగా ప్రేమను సమర్థించాడు. 1998లో సరమాగో సాహిత్యానికి నోబెల్ బహుమతిని ప్రదానం చేశారు. ఈయన రచనలు ఊహ, కరుణ మరియు వ్యంగ్యం ద్వారా కొనసాగిన ఉపమానాలతో నిరంతరాయంగా వాస్తవికతను గ్రహించడంలో పాఠకులకు సహాయపడతాయి.




జ్ఞానపీఠ పురస్కారం (1997)



# పోరాడే వర్గాల ప్రతినిధి "అలీ సర్దార్ జాఫ్రీ"

అలీ సర్దార్ జాఫ్రి 1913 నవంబరు 29 న జన్మించాడు. భారతీయ ఉర్దూ రచయిత. ఈయన కవి, విమర్శకుడు మరియు సినీ గేయ రచయిత. 1938లో మంజిల్ (గమ్యం) అనే తన మొదటి కథా సంకలనాన్ని ప్రచురించడంతో జాఫ్రి తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించాడు. 1948 - 1978 మధ్య ఈయన ఎనిమిది కవితా సంకలనాలను ప్రచురించాడు, ఇందులో నయి దునియా కో సలామ్ (కొత్త ప్రపంచానికి వందనం) (1948), ఖూన్ కి లేకర్, ఆమ్ కా కా సితార, ఆసియా జాగ్ ఉత (ఆసియా మేల్కొలుపు) (1951), పత్తర్ కి దీవార్ (స్టోన్ వాల్) (1953), ఏక్ ఖ్వాబ్ (వన్ మోర్ డ్రీమ్), పైరహాన్-ఇ-షరార్ (ది రోబ్ ఆఫ్ స్పార్క్స్) (1965) మరియు లహు పుకార్తా హై (ది బ్లడ్ కాల్స్) (1965) ఉన్నాయి. జ్ఞానపీఠ్ అవార్డు (1997) అందుకున్న మూడవ ఉర్దూ కవి జాఫ్రి. భారతీయ జ్ఞానపీఠం, "సమాజంలో అన్యాయం మరియు అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారి ప్రతినిధి జాఫ్రీ" అని పేర్కొంది. ఈయన పద్మశ్రీ (1967), జవహర్లాల్ నెహ్రూ ఫెలోషిప్ (1971),పాకిస్తాన్ ప్రభుత్వం ఇక్బాల్ స్టడీస్ నుండి బంగారు పథకం (1978), ఉత్తర ప్రదేశ్ ఉర్దూ అకాడమీ అవార్డుతో సహా అనేక ఇతర ముఖ్యమైన అవార్డులు మరియు గౌరవాలను కూడా అందుకున్నారు. 2000 సంవత్సరం ఆగస్టు 1న కన్నుమూశారు.



కథ

# ఉద్యమజీవి

జీవితాన్ని ఉద్యమం చేసిన ఒక సింహాద్రి కథ...



బి.వేణుగోపాల్ రెడ్డి

అందరూ.. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారి ముఖాల్లో ఒక రకమైన బాధ. ఆర్ట్స్ కాలేజి బ్యాంకు ప్రక్కన చాయ్ తాగే లొందలో సింహాద్రి అన్న చుట్టూ నలుగురు మిత్రులు కూచొని ఉన్నారు. చుట్టూ చెట్లు, ఏపుగా పెరిగిన గడ్డి, అక్కడ కొందరు ఇక్కడ కొందరు కూర్చోడానికి వీలుగా బండలు ఆ క్యాంటీన్ చుట్టూ ఉన్నాయి. సాయంత్రం అవడంతో మనుషుల అలజడి తగ్గి, పక్షుల అరుపులతో ఆ ప్రదేశం మరింత ప్రశాంతంగా మారింది. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించే మూడ్‌లో ఎవరు లేరు. లేటు వయసులో ప్రేమ పోటుకు విల విలలాడుతున్న సింహాద్రన్నను పరామర్శించడానికి తన ఆత్మీయ మిత్రులందరూ వచ్చారు. వారిని చూసి చిన్న పిల్లాడిలా కంటనీరు పెట్టడంతో అందరి హృదయాలు బరువెక్కాయి. ఓదార్చే ప్రయత్నం చేసినా కన్నీటి ధార ఆగడం లేదు.

“మహా మహులకే తప్పలేదు ఈ తిప్పలు, అన్న ఎంత”. మనసులో అనుకున్నాడు ఆనంద్.

“గత కొన్ని రోజులుగా సింహాద్రన్నలో చాలా మార్పులు జరిగాయి. యాభై దాటినా, ఎన్నడు జుట్టుకు రంగు వేయనివాడు జుట్టుకు హేర్ డై వేసుకుంటున్నాడు. కొత్త బట్టల సంగతి మర్చి ఎన్నేళ్లయిందో..! రెండు కొత్త బట్టల జతలు పట్టించాడు. ఇంచుమించు హీరో రజనికాంత్‌లా తయారయ్యాడు. ముందటి కంటే హుషారుగా ఉన్నాడను కుంటే గిట్లయిపాయే”. అని రామారావు బాధపడుతున్నాడు.

యూనివర్శిటీలో పెద్ద ఉద్యమ కారుడైనా సింహాద్రి పాత కొత్త తరానికి సుపరిచితుడే. సింహాద్రి ఉత్థాన పతనాలు అందరికంటే ఎక్కువ రామారావుకే తెలుసు.

“ఆమె పరిచయం తరువాత జీవితం చిగురులు తొడుగుతుందని అనుకుంటి. కోల్పోయిన దానిని మరల పొందినట్టు విపరీతమైన సంతోషం కల్గింది. గింతల్నే గిట్ల జరుగుతదని ఊహించుకోలేదు”. కళ్ల నీళ్లు తుడుచుకుంటూ చెపుతున్నాడు సింహాద్రి.

“నిజంగా ఇన్ని రోజులు ఆడ తోడు లేకుండా జీవితం ఎట్లా గడిచిపోయిందో” నని ఊహించుకుంటేనే ఒక వెలితి, బాధ, దు:ఖం, సంభ్రమం ఒకేసారి పొంగు కచ్చాయి రామారావుకు.

అంతల్నే క్యాంటీన్ నరసింహ ఐదు చాయలు, బిస్కెట్లు తెచ్చి ఇచ్చాడు. అందరు వేడి వేడి చాయ్ అందుకున్నారు.

గతం ఎపుడు తిరిగి రాదు. కాని చేదు, తీపి జ్ఞాపకాలు అందరిని ముప్పిరిగొంటున్నాయి. మదిలో ఎన్నో ఆలోచనలు రేకెత్తుతున్నాయి.

“నిజంగా ఎన్నేళ్లు... సింహాద్రన్న క్యాంపస్‌కు వచ్చి ఎన్నేళ్లైందో... ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఎన్నారెస్ హాస్టల్‌లోని, నూటఎనిమిది హాస్టల్ గదుల్లో తన నూట రెండవ రూము చాలా ప్రత్యేకమైనది. రెండు రాష్ట్రాలలోని చాలా మందికి సుపరిచితమే. నాల్గు గోడలు. చిన్న రూమే. చిందర వందరగా పడిఉన్న పుస్తకాలు, కాగితాలు. సమాజ అస్థిరతకు సూచికలుగా కనపడతాయి. అన్న జీవితంలోని చాలా భాగం ఆ గదిలోనే గడిచిపోయింది. ఇరవై నాల్గు గంటల కాలంలో రాత్రి ఉంది కాబట్టే రాత్రిని గడపడానికి ఓ రూము. ఒకవేళ పగలే ఉంటే రూమవసరం లేదు. రాత్రి మెస్‌లో మిగిలిన అన్నమే ఆ రోజటి తన ఆకలిని తీర్చేది. ఉద్యమాలతో కాలాన్ని కూడా పరుగులు పెట్టించే సత్తా ఉన్నవాడు సింహాద్రన్న. ఎన్నో మార్పులకు ఆ గది సజీవ సాక్షిగా నిలబడింది.

ఆవాజ్ దో హమ్ ఏక్ హై, విద్యార్థుల నాయకత్వం వర్థిల్లాలి, విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. కంగుమనే గొంతుతో నినాదాలిస్తే వంద మంది గొంతులు ఒక దిక్కు తన గొంతు ఒక దిక్కు. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో పోరాట జెండా పట్టాడు. ఖిల్లా ఖమ్మంలో మొదలైన తన ప్రస్థానం

క థ

ఉస్మానియా యూనివర్శిటీ వరకు కొనసాగింది. నిజాం కాలేజిలో డిగ్రీ, ఉస్మానియా క్యాంపస్‌లో పి.జి, పిహెచ్‌డీలు. ఏ సమస్యలపై పోరాటం చేసాడో అవే సమస్యలు నిత్యం తనను పలకరించాయి. ఒకవైపు చదువు ఒకవైపు పోరాటం. అందరూ చదువుకొని వెళ్లిపోతారు. కాని సింహాద్రి చదువుకునే వాళ్ల కోసం తన జీవితాన్ని కొవ్వత్తిలా కర్గించి విద్యార్థి ఉద్యమాలకు వెలుగైనాడు. క్యాంపస్‌నే తన ఇల్లుగా, వేదికగా మార్చుకున్నాడు. క్యాంపస్‌లోనే ఉండడం అప్పటి ఉద్యమ అనివార్యం, లక్ష్యం కూడా. నేడు వివిధ రంగాలలో పేరున్న వ్యక్తులు తన సమకాలీకులే (క్లాస్‌మేట్లు, బ్యాచ్‌మేట్లు) అంటే ఎవరు నమ్మకపోవచ్చు. తను కెరీరిస్టు కాదు. అజారుద్దీన్, కిరణ్ కుమార్‌లా క్లాసులు ఎగ్గొట్టి క్రికెట్ ఆడే తరం ఒక వైపు నీళ్లతో కడుపు నింపుకొని క్లాసులకు హాజరయ్యే బహుజన పిల్లలు ఒక వైపు. అసమానతలు తనను ఉద్యమ బాట పట్టించాయి''. చాయ్ తాగుతున్న రామారావులో ఎన్నో ఆలోచనలు ఉడుకుతున్నాయి.

మట్టి పిసుక్కొని కుండలు చేసుకునే కుటుంబంలో పుట్టిన సింహాద్రికి చదువు విలువ తెలుసు. అప్పుడే చదువుకోడానికి గ్రామాల నుండి వచ్చే పేద దళిత, బహుజనుల విద్యార్థుల సమస్యలు తనను కదిలించాయి. వారికి మార్గ నిర్దేశం చేసే 'గైడ్'గా మారాడు. యూనివర్సిటీ రాజకీయాలను వంటపట్టించుకొన్న విద్యార్థి నాయకుడుగా మారాడు. విద్యార్థి సమస్యల పరిష్కారమే తన ఊపిరిగా మార్చుకున్నాడు. స్వతహాగా ఉద్యమ కుటుంబం నుంచి వచ్చిన తాను రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి చావు దెబ్బలు తిన్న తన తాత ఆదర్శాన్ని పుణికి పుచ్చుకున్నాడు.



మార్క్సిస్టు అయిన మధు అన్న పరిస్థితి చూసి - "అన్న... వేల మైళ్ల ఒక అడుగుతో ప్రారంభమైనట్లు, నీ ఉద్యమ అడుగుల ద్వారానే ప్రతి ఉద్యమం మహా ప్రభంజనంగా మారేది. నువ్వు ఇట్లా డీలా పడితే ఎట్లా... అన్నా..." అవును.. నిజంగా ఒకడే ఎన్నో ఉద్యమాలను ప్రారంభించాడు. నేటి ఉద్యమకారులకు తనకు చాలా

**అప్పుడే** చదువుకోడానికి గ్రామాల నుండి వచ్చే పేద దళిత, బహుజనుల విద్యార్థుల సమస్యలు తనను కదిలించాయి. వారికి మార్గ నిర్దేశం చేసే 'గైడ్'గా మారాడు. యూనివర్సిటీ రాజకీయాలను వంట పట్టించుకొన్న విద్యార్థి నాయకుడుగా మారాడు. విద్యార్థి సమస్యల పరిష్కారమే తన ఊపిరిగా మార్చుకున్నాడు. స్వతహాగా ఉద్యమ కుటుంబం నుంచి వచ్చిన తాను రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి చావు దెబ్బలు తిన్న తన తాత ఆదర్శాన్ని పుణికి పుచ్చుకున్నాడు.

పోలిక ఉన్నది. నిస్వార్థంగా ఏమి ఆశించకుండా పనిచేసేది ఎందరు? సుదీర్ఘమైన ఉద్యమ జీవితం తనది. ఏ పార్టీలో లేడు, ఏ సంఘంలో లేడు. లెఫిస్టు, రైటిస్టులతో అసలే పేచి లేదు. కాని సంఘాలను, పార్టీలను ఒకటిగా తెస్తాడు. వాస్తవానికి ఐక్యతతోటే సగం సమస్య సచ్చినట్టయ్యేది. పెద్దన్నగా అందరి మన్నలను పొందాడు. మండల్, హాస్టల్ మూసివేత ఉద్యమాలు యూనివర్సిటీ చరిత్రలో మైలురాళ్ళు. చరిత్ర సబ్జెక్టును తీసేసి చరిత్రహీనుడు కావద్దని చంద్రబాబును హెచ్చరించాడు. మరణ శయ్యపై తన అక్క ఉన్నా పంటి బిగువున బాధను భరించి, ఎందరో మంది విద్యార్థుల భవితవ్యం బుగ్గి కాకూడదని విద్యార్థి ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. అంటువంటిది అన్నను ఇట్లా చూడడం కొంత విచారకరమైన విషయమే.

సింహాద్రికి కంట నీరు ఉబికి వచ్చింది.

"చాలా కాలం తరువాత అన్నకు ఒక తోడు దొరికిందనుకుంటే, దొరికినట్టే దొరికి చేజారిపోయింది''. మురళి ఓదార్పుగా అంటున్నాడు.

వివిధ సందర్భాలలో అన్నకు ఎవరో

క
థ

ఒకరు తోడుంటే బాగుండుననుకునే వాళ్లే. వృద్ధాప్యం శోకం కాకూడదనే! పాత తరం ఉద్యమాలు, ఉద్యమకారుల పట్ల గౌరవంగా ఉండేవారు. ఈ తరం కెరీరిజంలో కొట్టుమిట్టాడుతున్నది. వారి మధ్య ఇంకా హాస్టల్‌లో ఉండడం కొంత బాధాకరమే.

మిత్రులు పెళ్లి ప్రస్తావన తెస్తే "నాకెవరు ఇస్తరన్న" అని అనేవాడు.

ఎవరైనా ప్రయత్నం చేసి "ఫలాన సంబంధమున్నది. మాట్లాడుదాం" అని మిత్రులు బలవంతపెడితే...

"ఉద్యమాలలో తిర్గేవాడికి పెళ్లి పెద్ద అడ్డంకి. అటు ఉద్యమాలకు న్యాయం చేయలేం, ఇటు కట్టుకున్నవాళ్లకు". అంటూ ఎప్పటికప్పుడు ఏదో ఫిలాసఫీ చెప్పి దాటవేసేవాడు.

ఎంత కాదన్న సింహాద్రికి ఆ లోటు స్పష్టంగా కనపడుతోంది.

"అన్న... నీకు చెప్పేటంతవాళ్లం కాదుగాని, ఇవ్వాల కాకపోతే రేపు. ఈమె కాక పోతే ఇంకొకరు. నీ జీవితంలోకి రావచ్చు. బాధ అంటావ... తట్టుకోవాలి. సమాజం మార్పు కోరేవాళ్లం... కోలుకోవడం పెద్ద కష్టం కాదు నీకు". ధైర్య వచనాలు పలికాడు మురళి.

"అన్న... పోయి పోయి... నీకు మనుమలు, మనమరాళ్లున్న నానమ్మనే దొరికిందా?" కొంటెగా ప్రశ్నించాడు ఆనంద్.

"అన్నకు ఈ మధ్య సోషల్ సర్వీస్ బాగా అయింది. పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు స్టార్ట్ చేసాడు. దానిలో భాగమే ఇది" నవ్వుతూ చెప్పాడు రామారావ్. ఒక్కసారిగా అందరి నవ్వులతో ఆ ప్రాంతం వికసించినట్లయింది.

"అరె తప్పేముంది బయ్... భర్త చనిపోయిండు. పిల్లలు తమ దారి చూసుకున్నరు. ఏ ఆధారం లేకుండా జీవిస్తున్న ఒక విడోను చేసుకుంటన్నడు. తప్పేముంది. చిన్న వయసులోనే పెళ్లి చేసుకొని, భర్త, పిల్లలు అనుకుంటూ వారికి సేవ చేసుకుంటూ, తనకంటూ ఇష్టాలు లేకుండా కుటుంబమే జీవితంగా బతుకీడుస్తుంది. చిన్న వయసులో తండ్రి సంరక్షణలో, పెళ్లి తరువాత భర్త అదుపాజ్ఞల్లో, వృద్ధాప్యంలో కొడుకుల కట్టుబాట్ల మధ్య బతుకీడ్చవలసిందేనా? ఆమె మనిషే... ఆమెకు ఇష్టాలుంటాయి. అభిరుచిలుంటాయి. వాటిని గౌరవించకపోతే ఎట్లా? బాధ్యతల సాకుతో ఆమెకున్న స్వేచ్ఛను హరించడం బాధాకరం. సమాజ కట్టుబాట్లు వ్యక్తి అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నయి. వీటిని బద్దలు కొట్టకపోతే ఎట్లా". ఆవేశంగా ముగించాడు మధు.

"అరె... మేమెందుకు తప్పు అంటం కామ్రేడ్... వారిద్దరిష్టం. అయినా... అంత సులభమా. ఇంకా ఇండియన్ సొసైటీ ఆ స్థాయికి రాలేదు". ఆనంద్ సూటిగా జవాబిచ్చాడు.

కాస్త తేరుకున్న సింహాద్రి ఆనంద్‌ను చూస్తూ - "అన్న... ఆమెకు నూరుపాళ్లు ఇష్టమే. ఆమె ఎట్లా బతుకుతుందో చూడని కొడుకులు, ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయి బతుకుతున్నవాళ్లు ఈ రోజు పరువు, కుటుంబ గౌరవం అంటూ గొంతు చించుకుంటున్నారు. చిన్న కొడుకైతే కొట్టేంత పని చేశాడట. ఇష్టమున్నట్లు మాటలన్నారట".

> **"అరె తప్పేముంది బయ్... భర్త చనిపోయిండు. పిల్లలు తమ దారి చూసుకున్నరు. ఏ ఆధారం లేకుండా జీవిస్తున్న ఒక విడోను చేసుకుంటన్నడు. తప్పేముంది. చిన్న వయసులోనే పెళ్లి చేసుకొని, భర్త, పిల్లలు అనుకుంటూ వారికి సేవ చేసుకుంటూ, తనకంటూ ఇష్టాలు లేకుండా కుటుంబమే జీవితంగా బతుకీడుస్తుంది. చిన్న వయసులో తండ్రి సంరక్షణలో, పెళ్లి తరువాత భర్త అదుపాజ్ఞల్లో, వృద్ధాప్యంలో కొడుకుల కట్టుబాట్ల మధ్య బతుకీడ్చవలసిందేనా? ఆమె మనిషే... ఆమెకు ఇష్టాలుంటాయి.**

గుండెతడితో ముగించాడు సింహాద్రి.

సింహాద్రి మాటల ద్వారా ఆమె అంటే ఎంత ఇష్టమున్నదో స్పష్టంగా తెలుస్తున్నది.

సింహాద్రి ఆత్మీయుల మధ్య ఉన్నాడే కాని తన మనసు ఆమె వద్దనే ఊగిసలాడుతున్నది. "చిన్న వయసులోనే భర్త పోవడంతో, పిల్లల బాగోగులు చూసుకోడానికే జీవితం సరిపోయింది. పశువులా ప్రవర్తించే భర్త, తాగుడుకు బానిసై ఈ లోకం విడిచిపెట్టిండు. ఒక విధంగా స్త్రీ, పురుష సంబంధాలు తనకు చేదు జ్ఞాపకాన్నే మిగిల్చాయి. అటువంటిది ఆమె ప్రేమకు అర్హుడవడమే నా అదృష్టం అనుకొంటి. అటువంటిది మా ఇద్దరి ఆశలు అడిఆశలయ్యాయి. నా కారణంగా ఆమె కొడుకులు ఆమెను ఎంత చిత్రవధ చేస్తున్నారో..?" తలచుకొని కన్నీరు మున్నీరవుతున్నాడు సింహాద్రి.

అభిప్రాయాలు కలవడం, ఇద్దరికి ఒక తోడు తక్షణ అవసరం కాబట్టి కలసి బతకాలనే కోరిక వారిలో బలంగా నాటుకున్నది. ఆ లోటును భర్తీ చేసుకుంటేనే గాని సింహాద్రికి జీవితం సంపూర్ణమవదు.

"తల్లిని సరిగ్గా పట్టించుకోని కొడుకులు ఆమె అభిప్రాయాలకు విలువ ఇస్తార? కనీసం ఆమైనా ధైర్యం చేసి ఇంట్లో నుండి కొట్లాడి బయటకు వస్తే బాగుండు. స్వేచ్ఛగా బతికే అవకాశం దొరికేది". మురళి ఆమె పరిస్థితి విని జాలితో అన్నాడు.

"అంత సులువు కాదు మురళి. ఈ వయసులో ఇదేం పనని, పరువు, ప్రతిష్ఠ, తొక్క, తోలు, తొండం... అంటూ ఆమెను కట్టిపారేశారు. ఇంకా ఆమె అంతో ఇంతో సంపాదిస్తున్నది కాబట్టి నెరవేర్చవలసిన బాధ్యతల బరువును తగిలించినట్లున్నారు పాపం".

రామారావు నిదానంగా చెపుతున్నాడు.

"బాధ్యతలైతే ఎపుడూ ఉండేటివే... కలసి ఉన్నా తీర్చవచ్చును గదా...!" మురళి సావధానంగా చెప్పాడు.

"మగవాడు చేసుకోదల్చుకుంటే భార్య ఉన్నా , లేకున్నా ఎవరి అభిప్రాయాలతో

క థ

నిమిత్తంగా లేకుండా చేసుకుంటాడు. అతనికి పరువు, ప్రతిష్ఠ, కుటుంబ గౌరవం అడ్డంకి కాదు. పైగా మంచి కార్యం చేసాడని మెచ్చుకుంటారు. స్త్రీయే అణిచివేతలకు సాధనంగా మారుతున్నది. ఇది మన సమాజ ద్వంద్వ నీతి''. అని మధు సమాజ స్వభావాన్ని వివరిస్తున్నాడు.

"ఆఖరికి స్త్రీయే అన్ని గౌరవాలను మోయాలనుకుంటా…'' రామారావు విచారంగా అంటున్నాడు.

వెంటనే మురళి - "మనుషుల్ని మోయడమే కాకుండా, మనుషులు సృష్టించిన విలువల్ని కూడా''.

"మధు బాయ్… స్త్రీ ఆర్థికంగా ఎదిగితే స్వేచ్ఛ లభిస్తుందని అంటారు కదా! మరి… తన నిర్ణయాన్ని ఖచ్చితంగా ప్రకటించి, నచ్చిన వాడితో జీవించడానికి ఏమిటి అభ్యంతరం. నేను ఎందుకు అంటున్నానంటే ఆమె కుట్టు మిషన్ కుట్టుకుంటూ తనకు తాను పొట్టపోసుకుంటున్నది అందుకని''. తన సందేహాన్ని మధుపై వదిలాడు ఆనంద్.

"కాదు ఆనంద్… కేవలం ఆర్థికంగా ఎదిగితేనే సరిపోదు. మనిషి ఎపుడు కనిపించే బంధనాలే కాకుండా కనపడని సంకెళ్ల మధ్య బంధి అయ్యాడు. మొదటగా వాటిని ఛేధించాలి. మనిషి ఆర్థికంగా ఎదగడం ఎంతసేపు. ఆమె స్వేచ్ఛను హరిస్తున్న శక్తులు మనకు తెలియనిదా? కుటుంబం, కుల కట్టుబాట్లు, మతం ఇలా ఎన్నో… ఇంకా ఈ స్త్రీ విషయంలోనే… ఆమె స్వయంగా కష్టపడి బతుకుతున్నది. ఆమె మిగులు సంపాదనను వారసులు లేదా హక్కుదారులు లాక్కునడం వల్ల ఆమె మళ్లీ చివరకు పేదరికంలోకి నెట్టబడుతుంది. ఆ ఆర్థిక స్వేచ్ఛ కూడా ఎండమావిగా మారుతుంది''.

వెంటనే మురళి అందుకొని "స్త్రీ ఆర్థికంగా స్వేచ్ఛ పొందడమే కాదు సామాజికంగా, రాజకీయంగా కూడా స్వేచ్ఛ పొందాలి. మూడు ఒకదానితో ఒకటి ముడి పడి ఉన్నాయి. ఏది తక్కువ కాదు''.

**"అన్న… నీకు చెప్పేటంతవాళ్లం కాదుగాని, ఇవ్వాల కాకపోతే రేపు. ఈమె కాక పోతే ఇంకొకరు. నీ జీవితంలోకి రావచ్చు. బాధ అంటావ… తట్టుకోవాలి. సమాజం మార్పు కోరేవాళ్లం… కోలుకోవడం పెద్ద కష్టం కాదు నీకు". ధైర్య వచనాలు పలికాడు మురళి.**

అందరూ సమాజ శాస్త్రజ్ఞులుగా గొప్పగా మాట్లాడుకుంటున్నారు. బాధైనా, కష్టమైనా ప్రతిదీ గొప్ప ఎడ్యుకేషన్. దాని నుండి బయటపడడమే కాకుండా కార్యాకారణ సంబంధాలు వెతుకుతారు యూనివర్సిటీ విద్యావంతులు. యూనివర్సిటీ చదువులే కాకుండా ఉద్యమాలు మనిషి ఆలోచనా విస్తృతిని పదునుపెడతాయి.

ఇట్లా మాట్లాడుకుంటే గంటలు, రోజులవుతాయి. అస్తమిస్తున్న సూర్యుని ఎర్రని కిరణాలు చెట్ల కొమ్మలనుండి విచిత్ర ఆకారాలుగా నేలపై పర్చు కుంటున్నాయి.

అందరూ… నిశ్శబ్దంగా, చెట్ల కింద సేదదీరుతున్నారు.

నిశ్శబ్దాన్ని బద్దలుగొడుతూ మురళి - "ఇపుడు అన్న పరిస్థితి ఏంటి''.

ముభావంగా, కాస్త నీరసంగా కూచున్న సింహాద్రికి శ్రేయోభిలాషుల ఆత్మీయ మాటలు కాస్త ఓదార్పునిచ్చాయి.

"వాస్తవానికి మన లీడర్ అందరికి ఆత్మీయుడే… ఒంటరి వాడు కాదు''. ఆత్మీయ వచనాలు పలికాడు ఆనంద్.

"ఫిఫ్టి సెవెన్ రూం సాక్షిగా స్వంత ఆస్తి లేని మనిషి. సమాజమే తన ఆస్తిగా భావించే సింహాద్రన్నంటే అందరికి ఇష్టమే. మార్క్సిజం సొంత ఆస్తిని వ్యతిరేకిస్తుంది. మరి… సొంత ఆస్తి లేని మార్క్సిస్టులు భూతద్దం పెట్టి వెతికినా మనకు దొరకరేమో!'' కొసమెరుపుగా మధు ఉత్తేజకరమైన మాటలు పలికాడు.

ఒకప్పటి వి.సి యూనివర్సిటీలో ఉద్యోగమిస్తానంటే తీసుకోలేదు. యూనివర్సిటీ పేరు చెప్పుకొని కొంతమంది లీడర్లు లెఫ్ట్, రైట్ అని తేడా లేకుండా ప్రైవేటు కాలేజీలు పెట్టుకొని లక్షలు సంపాదిస్తున్నారు. కాని., ఎటువంటి ఆశ లేకుండా నిస్వార్థంగా సేవ చేసే సింహాద్రిలాంటి వారు ఎందరుంటారు (జెఎన్‌యులో సింహాద్రిలాంటి ఒక విద్రోహి ఇటీవలనే మరణించాడు). విద్యార్థులకు, యూనివర్సిటీ ఉద్యోగులకు, డెయిలీ వేజ్ లేబర్‌లకు ఆయనంటే విపరీతమైన అభిమానం. వారి సమస్యల పరిష్కారానికై తన వంతు బాధ్యతగా ఎపుడూ వారి ఉద్యమాలలో భాగమవుతున్నాడు.

అపుడే గూటిలోకి వస్తున్న పక్షుల్ని చూస్తున్న సింహాద్రి- "ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నవాడే గొప్పవాడు. ప్రజల సహకారముంటే సమాజమే వెచ్చని గూడు'' అంటూ గట్టిగా శ్వాస పీలుస్తూ ఛాతిని ఆత్మ విశ్వాసంతో పొంగించాడు "ఆర్ట్స్ కాలేజి ముందు డెయిలీ వేజ్ లేబర్ల జీతాల పెంపు కొరకై ధర్నా నడుస్తోంది. సంఘీభావంగా మీరంతా రావాలి'' అంటూ పక్కనే ఉన్న మధు భుజం తడుతూ లేచాడు.

"పదండి…'' అంటూ వేగిరపర్చాడు. అందరు ఆయన వెంట కదిలారు.

★ ★ ★

ఎంత ఉద్యమకారుడైనా… మనిషి సహజ స్పందనల నుండి తప్పించుకోలేడు. ఆమె పరిచయం వల్ల సింహాద్రిలో దాగిన ప్రతిస్పందనలు బయటకు వచ్చాయి. స్త్రీ సాంగత్యం తనను మరో మనిషిని చేసాయి. ఇష్టాలను సమాధి చేయడమంటే మనిషి యంత్రంగా మారడమే. అవుతుంది. వాస్తవానికి ఇద్దరు యాంత్రికంగా జీవిస్తున్నారు. బాధ్యతలతో ఒకరు, కర్తవ్యాలతో ఒకరు. తమ వ్యక్తిగత ఇష్టాలను సమాధి చేసుకున్నారు. కొత్త ఉదయంతో సమాజ మార్పు కోరుతూ ఉద్యమ జెండాను భుజాలపై మోస్తున్నాడు సింహాద్రి.

పుస్తక పరిచయం

# సామాజిక పరిణామాల ప్రతిబింబాలు లొట్టపీసు పూలు...

సమాజం సాహిత్యీకరణ చెందుతున్న వైనం...



రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

“ససంత్ర మెచ్చి ఇన్నేళ్లయింది. అయినా ఈ గూడానికి ఈ మడుషులకి తెల్వి రాకపాయె. ఇంకా ససంత్రం ఎక్కడిది? తెల్లోడు పోయిండన్న మాటే గని, తెల్వైన మనోడే మనల్ని బానిసల చేసి ఆడిస్తుండు. హు... కష్టమొకడిది సుఖమొకడిది. ఛా..కాలం మారినా మడుషులు మారక పాయ గదరా?” ససంత్రం తెచ్చిన నెహ్రూనే గీళ్ళను మార్చలేకపాయె. గిప్పుడు గాయన బిడ్డొచ్చిందంట. ఆడబిడ్డ. గామె జేస్తదా! (ఇసపురుగు కథలో ఇస్తారి పెద్దయ్య)

“లొట్టపీసు పూలు” కథల రచయిత శీలం భద్రయ్య 41 ఏళ్ల తెలంగాణ రచయిత. ఈ కథాసంపుటిలో 15 కథలున్నాయి. ఈ కథలన్నీ అక్టోబరు 2020 నుండి మే 2021 వరకు ఎనిమిది నెలల లోపల్నే వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. జూలై 2021లో పుస్తకంగా తీసుకువచ్చారు. ఈ కథా సంపుటి ఇప్పుడే ఒక కథారైతు పండించిన తాజాపంట. సరికొత్త పంట. ఈ సంపుటిలోని కథలకు ఆ కథలలోని వస్తువులను బట్టి చారిత్రక ప్రాధాన్యం ఉంది. వర్తమాన ప్రాధాన్యత కూడా ఉంది. ఈ కథలు రజాకార్ల కాలం నుండి, తెలంగాణ రైతాంగ పోరాట కాలం నుండి ఇప్పటి కరోనా సెకండ్ వేవు కాలం దాకా జరుగుతాయి. ఈ కథలు రచయితకు వర్తమానం పట్ల ఎంత ఆసక్తి ఉందో, చరిత్ర పట్ల కూడా అంతే ఆసక్తి ఉందని తెలియజేస్తాయి. చరిత్రను వర్తమానంతో అనుసంధానం చేసి, చరిత్ర కొనసాగింపును మనకు తెలియజేయాలన్న స్పృహ కథా రచయితకుంది. చరిత్రతోనే కాదు పురాణ వాస్తవికతను కూడా, వర్తమానంతో అనుసంధానం చేసే ప్రయత్నం చేశారు భద్రయ్య.

ఈ కథలన్నీ ఒకేసారి చదివితే, పాఠకులకు ఒక వివేకాన్ని కలిగిస్తాయి. ఒక చింతనను రేకెత్తిస్తాయి. ఈ కథలు పాఠకులను అద్వాన్నపుటెడారులలో వదిలేసి వెళ్లిపోవు. ఒక యువరచయిత మనం నివసించే సమాజాన్ని ఎలా అర్థం చేసుకున్నాడో చెప్పి, మనల్ని కూడా ఆలోచించమంటాడు. ఈ కథలు నల్లగొండ జిల్లా గూడెం ప్రజల జీవిత వాస్తవికతను కథనం చేస్తున్నాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నల్గొండ ప్రాంతంలోనే ఉధృతంగా కొనసాగింది. ఆ ఉద్యమం 1951 అక్టోబరులో నిలిచి పోయినా, ఆ ఉద్యమకాలంలో పసివాళ్ళు గానో, యువకులుగానో ఉన్నవాళ్ళు ఆ ఉద్యమాన్ని తరువాత ఆ తరాల వారికి మౌఖికంగా చెబుతూ వస్తున్నారు. అందుకే తెలంగాణ రైతాంగ ఉద్యమ స్పృహ నేటికి తెలంగాణాలో ప్రజలలో సజీవంగా ఉంది.

భద్రయ్య రాసిన పదిహేను కథల్లో ఐదు కథలు రజాకార్ల ఆగడాలను చిత్రించాయి లేదా ప్రస్తావించాయి. అంటే ఆ ఉద్యమ ప్రభావం ఇంకా ప్రజలలో బలంగా ఉందన్న వాస్తవం తెలుస్తుంది. ఉత్తరాంధ్ర సాహిత్యంలో కూడా 1967-70 ల నాటి నక్సల్బరి ఉద్యమ స్ఫూర్తి ఆ తరువాత కాలంలోనూ ప్రతిబింబిస్తుంది.

భద్రయ్య “ఇసపురుగు”, “కేంపు చెర్వు”, “బంచెర్రాయి”, “కోదండం”, “మాయబారీ”- కథలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్ల ఆగడాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చిత్రించారు. ఈ చారిత్రక సందర్భం భద్రయ్య కథలకు గొప్ప ప్రాముఖ్యతను తీసుకువచ్చాయి.

“ఇసపురుగు” కథలో ఇస్తారి పెద్దయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. రజాకార్లను ఎదిరించి పోరాడాడు. ఆయన పెద్దకొడుకు పోరులోనే మరణించాడు. ఆయన భార్య, కూతురు రకరకాల కారణాలతో చనిపోవడంతో ఏకాకి అయ్యాడు. ఊర్లో బతకలేక ఊరిబయట రాంబాయి పటేల్ బాయికాడ జీతగాడిగా కుదురుకున్నాడు. రజాకార్లతో అజ్ఞాత పోరాటం జేసే కాలంలో పెద్దయ్య నేర్చుకున్న ప్రకృతి వైద్యంతో నర్సమ్మ ఆపదను తొలగిస్తాడు. ఈ కథలో పెద్దయ్యకు స్వాతంత్ర్యా

పుస్తక పరిచయం

నంతర భారతదేశ స్థితిగతుల పట్ల విమర్శనా దృష్టి ఉండడంలో అసహజత్వమేమి లేదు. ఒకవైపు రాష్ట్ర పాలకులు, వాళ్ళ ప్రైవేటు సైన్యంతోనూ, మరొకవైపు స్థానిక పటేల్, పట్వారిలతోనూ పోరాడిన పెద్దయ్య ఒక పటేల్ దగ్గర పనిజేసుకొని బతకవలిసి రావడం విషాదం. స్వాతంత్ర్యం వచ్చి శ్రీమతి ఇందిరాగాంధీ పాలన వచ్చినా, గూడెం ప్రజలకు రోడ్డు, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల ఆయన గట్టి విమర్శే పెట్టారు. ఈ కథలో నర్సమ్మ భర్త ఒక కొడుకు పుట్టినాక మస్కట్ వెళతాడు. అక్కడ దొంగతనం కేసులో అరెస్టవుతాడు. ఆయనను విడిపించాలంటే డబ్బు కావాలి. డబ్బు ప్రజల దగ్గర లేదు. నారాయణ పటేల్ దగ్గర ఉంది. అతడు పరమ దుర్మార్గుడు. మొగుడి ముందే పెళ్ళాన్ని చెరబట్టే దుర్మార్గుడు. పెద్దయ్య కూతురును నాశనం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైనవాడు. నర్సమ్మ స్థితి పట్ల సానుభూతి గల గంగమ్మకు కూడా అతని మీద కోపం ఉంది. అతని భార్యనే అనుమానంతో చంపేశాడు. అలాంటి వాని దగ్గరకు నర్సమ్మ అప్పు అడగటానికి వెళుతుంది. సాయంకాలం బావి దగ్గరకు వస్తే అప్పు ఇస్తానని నర్సమ్మను లోబరుచుకునే ప్రయత్నం జేస్తాడు నారాయణ పటేల్. పెద్దయ్య సాయంతో "ఇసముష్టి" మూలికా విషాన్ని నారాయణ పటేల్‌కు ఇచ్చి ఆపద నుండి గట్టెక్కుతుంది నర్సమ్మ. గంగమ్మతో బాటుగా గ్రామ ప్రజలంతా నారాయణ పటేల్ ఇసపురుగు కాటుకు చనిపోయాడనుకుంటారు. నారాయణ పటేల్ చావు గురించి గంగమ్మ కసిగా అనుకోడానికి కారణం చెబితే మరొక కథ అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గ్రామాల్లో పటేల్ల ఆగడాలు ఆగని పరిస్థితిపై తిరుగుబాటు ఈ కథ.

"కేంపు చెర్వు" కథలో రచయిత తెలంగాణ సాయుధ పోరాట కాలానికి, నక్సల్బరీ ఉద్యమ కాలానికి ముడిపెట్టారు. ఈ కథలో నర్సమ్మ కొడుకులిద్దరిలో




ఒకడు రజాకార్ల చేతిలో చనిపోయాడు. రెండోవాడు శివుడు. అతను అడవిలోకి వెళ్ళిపోయాడన్నారు. ఆరోజుల్లో రజాకార్లు ఊర్లో కొస్తే మారణ, అత్యాచారకాండలే. "రజాకార్ల వల్ల ఆ ఊర్లో గాయపడని ఇల్లు లేదు. దెబ్బతినని మనిషి లేడు" అన్న వాక్యం పాఠకుల గుండెలను పిండుతుంది. ఆ పోరాటం పోయింది. స్వాతంత్ర్యం వచ్చింది. స్వపరిపాలన వచ్చింది. దాని వైఫల్యం నుండి నక్సల్బరి ఉద్యమం పుట్టుకొచ్చింది.అయినా ప్రజలలో రైతాంగ పోరాటస్పృహ నశించి పోలేదు. కథలో ఈ పరిణామక్రమాన్ని గమనించవచ్చు. ఈ నేపథ్యంలో చాకలి రామక్క ఆయాసపడుతూ వచ్చి నర్సమ్మతో "ఊరవతల కేంపు ఏసింద్రని చెబుతుంది" క్యాంపు అంటే ఆమె దృష్టిలో రజాకార్ల క్యాంపే. "ఆ ముదనష్టపోళ్ళు మళ్లొచ్చింద్రా" అంది నర్సమ్మ. ఆ క్యాంపు రాజాకార్లదా? కమ్యునిస్టులదా? అని ప్రజలు చర్చించుకుంటారు. చివరికి అది మూసీ జలాశయ నిర్మాణానికి సంబంధించిన క్యాంపు అని తెలుస్తుంది. స్వతంత్రం వచ్చిన తరువాత కూడా దొరల ప్రభావం కొనసాగుతున్నదనడానికి ఈ క్యాంపే నిదర్శనం. అక్కడ ప్రాజెక్టు వస్తుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఊరొదిలి వెళ్లిపోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దొర హుకుం జారీ జేస్తే ప్రజలు కన్నతల్లి వంటి ఊరునొదిలి పెట్టడానికి భారంగా కదులుతారు. వలసబాట పడుతారు. అప్పుడు శివుడు అనే ఉద్యమ నాయకుడు వచ్చి దొర కుట్రను బయటపెట్టి, నష్టపరిహారం కోసం పోరాటం చేయమని వారిని చైతన్య పరుస్తాడు. దాంతో ప్రజలు దొర మీద తిరుగుబాటు చేస్తారు. దొర గడీ వదిలి పట్నం వెళ్ళిపోతాడు. ఈ కథలో దొరతనం, పెత్తనం గ్రామాలను వదిలి పట్నాలకు చేరే పరిణామాన్ని వివరిస్తుంది.

"బంచెర్రాయి" పూర్తిగా రజాకార్ల కాలంనాటి కథ. పెండ్లి జరిగినాక కొత్త పెండ్లి కూతురు లక్ష్మమ్మ ఆమె భర్త నర్సిరెడ్డి బంధువులతో కలిసి అత్తగారింటికి పోతుంటే, వాళ్ళ బండ్ల మీద రజాకార్లు దౌర్జన్యం చేస్తారు. బహుశా ఈ కథ 1947-48 మధ్య కాలంలో జరిగి ఉండవచ్చు. రజాకార్లు తమ రాజ్యం పోతుందని తెల్సి గ్రామాల మీద దౌర్జన్యాలకు దిగే క్రమంలో పెండ్లి బండ్ల మీద పడి విధ్వంసం సృష్టించారు. అదే సమయంలో యూనియన్ సైన్యాలు వచ్చి అక్కడ గాయపడ్డ ప్రజలను కలుసుకున్నారు. రజాకార్లను తరిమికొట్టారు. ఇలాంటి ఇతివృత్తాలను రచయిత తన పూర్వీకులు, గ్రామ వృద్ధుల నుండి తెలుసుకుని రాసి ఉండవచ్చు. ఏడున్నర దశాబ్దాల చరిత్రను రచయిత ఈ కథ ద్వారా మనకు గుర్తు చేశారు.

"కోదండం" కథ కూడా తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటిదే. చింత గూడెంలో కూలీలు పొలం పనులు చేస్తూ ఉంటారు. సాయమ్మ కూలి పెంచమంటుంది. అక్కమ్మ పాటలో ఆమెకు సమాధానం చెబుతుంది. పనులు ముగించుకొని సాయంకాలం అందరూ ఇళ్ళకు బయలుదేరుతుంటే 15 మంది రజాకార్లు వారిపై విరుచుక పడ్డారు. అక్కమ్మ పైట లాగారు. అక్కమ్మ పాడిన పాట వామపక్ష పాట కావడం వల్ల, వాళ్ళు ఆమెను హింసించి చంపేశారు. మళ్ళీ గూడెం మీద పడి కమ్యూనిస్టులను

గురించి విచారించారు. సాయమ్మను నాశనం చేశారు. ఆ సమయంలో బహుశా అజ్ఞాత వామపక్ష వాదులు జరిపిన కాల్పుల్లో రజాకార్లు మరణించారు. ఆ గ్రామంలో అంజయ్య అనే విద్యార్థి నాయకత్వంలో చిన్న పిల్లలు చింత చెట్లు ఎక్కి, వడిసెల రాళ్ళు విసిరారు. అదే సమయంలో యునియన్ సైన్యం వచ్చింది.

దీనికి కొనసాగింపు వంటి కథ "మాయబారి". సాయమ్మ భర్త తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో మరణించాడు. సాయమ్మ కొడుకులలో ముత్తయ్య చిన్నవాడు. తండ్రి మార్గంలో నడుస్తాడు. ముత్తయ్యను రజాకార్లు పట్టుకుపోయి సంఘ నాయకుల ఆచూకి చెప్పమని భయంకరంగా హింసిస్తారు. అదే సమయంలో సంఘ నాయకులు అక్కడకు వచ్చి రజాకార్లను తరిమి కొడతారు. దాంతో ముత్తయ్య సంఘంలో కలిసిపోయాడు. రజాకార్లు మళ్ళీ అర్ధరాత్రి వచ్చి సాయమ్మను, ముత్తయ్య భార్యా పిల్లలను ఊచకోత కోస్తారు. అది తెలిసి ముత్తయ్య ఊర్లో సంఘ సమావేశం పెడుతుండగా సాయుధ రజాకార్లు వచ్చిపడ్డారు. ముత్తయ్య తప్పించుకున్నాడు. అయినా రజాకార్లు వదిలి పెట్టలేదు. అతన్ని వెంటాడారు. దీంతో ముత్తయ్య పెద్దన్న వీరన్న నాయకుడవుతాడు. తరువాత గ్రామప్రజల సాయంతో దేశీయ విధానాలు, ప్రాంతీయ వ్యూహాలతో రజాకార్లను మట్టుబెట్టారు.

ఈ అయిదు కథలలో తెలంగాణ ఏవిధంగా దొరలు, భూస్వాముల పాలనలో సతమతమైనదో చెప్పి, ప్రజాచైతన్యాన్ని చిత్రించారు రచయిత. పాలకవర్గ నిరంకుశత్వం, దౌర్జన్యాలను ప్రజలు, ప్రజాసంఘాలు సంఘటితంగా ఎదుర్కోవడమే మార్గమని ఈ కథలు చెబుతూ వచ్చాయి.

ఈ కథా సంపుటిలో "కొత్త దొర" అన్నది చాలా విశిష్టమైన కథ. దొరతనం మారకుండా దొరలు మారితే ప్రయోజనం శూన్యమని, వ్యవస్థను మార్చకుండా వ్యక్తులు మారితే లాభం లేదని ఈ కథ చెబుతుంది. ఎవరు పాలిస్తున్నారన్నది కాదు. ఎలాంటి పాలన సాగుతున్నది అనేదే ప్రధానమని ఈ కథ చెబుతుంది. ఈ కథ భుజాలు మార్చుకొని చేసే రాజకీయాల దోపిడీ స్వభావాన్ని కన్నులకు కడుతుంది.

స్వతంత్రం రాకముందు నిజాం పాలనలో దొర దగ్గర బంటుగా పనిజేసిన పెంటయ్య, తానే దొరయితే ఎలా ఉంటాడో భద్రయ్య ఈ కథలో చిత్రించారు. స్వాతంత్ర్యం రాకముందు దొర దగ్గర పాలేరుగా ఉండేవాడు పెంటయ్య. దొర చెప్పిన పనులన్నీ చేశాడు. ఆ దొర పరమ దుర్మార్గుడు. స్త్రీ లోలుడు. ఒకరోజు పెంటయ్య దొర దగ్గరికి వచ్చి దొర భూములు ప్రజలు స్వాదీనం చేసుకుంటున్నారని యూనియన్ సైన్యాలొస్తాయని తెలిసి ఊరి జనానికి ముల్లు పెరిగిందని, వాళ్లకు కమ్యూనిస్టులు తోడయ్యారని, చెప్పు కింద తేళ్ళలాగ ఉన్న జనం దొరను దొర భూములను లెక్కజేయడం లేదని వ్యాఖ్యానించాడు.

అప్పుడు దొర సూర్యాపేటకు పోయి అక్కడి నుంచి కిరాయి గూండాలని తీసుకురమ్మని చీటీ రాసి అతనిని పంపాడు. పెంటయ్య భార్య మీద దొర మనసుపడిందనే విషయం పెంటయ్య తెలుసుకుంటాడు. ఆమెను అతని బారిన పడకుండా జాగ్రత్తగా కాపాడుకున్నాడు. అందువల్ల సూర్యాపేట పోవడానికి పెంటయ్య తటపటాయించాడు. అయినా వెళ్లక తప్పలేదు. తెల్లారేసరికి సూర్యాపేట నుండి రెండు వందల మంది కిరాయి గూండాలు వచ్చి దొర భూముల్లో దిగారు. విధ్వంసం సృష్టించారు. ఆ భూముల్లోకి ఊరిజనం వస్తే హింసించారు. వెంకయ్యని చంపారు. యాదయ్య గొర్లను ఎత్తుకు పోయారు. ఆరోజు " ఏ ఇంట్లో విన్నా మూలుగులే". ఇది తెలిసి కమ్యూనిస్టులు వచ్చారు. ఆటపాటలతో జనాల్ని చైతన్య పరిచారు. ఆ సమయంలోనే పెంటయ్య వచ్చి. తన భార్యను దొర చెరిచేసి, గొంతు పిసికి బావిలో వేశాడని ఏడుస్తూ చెబుతాడు. దాంతో జనం ఆవేశం కట్టలు తెంచుకుంది. పెంటయ్య కూడా ప్రజల తిరుగుబాటులో కలిశాడు. ప్రజాగ్రహాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. 17 గ్రామాల ప్రజలు దొరపై తిరుగుబాటు చేయడంతో కిరాయి గూండాలు తోక ముడిచారు. జనం దొర గడీని కోపంతో కూల్చివేశారు. అప్పటికే దొరను, భార్యను తుదముట్టించిన పెంటయ్య తన భార్య చావును జనాల వద్ద సానుభూతికి సాకుగా చూపి తరువాత కాలంలో వారి అండతో అధికారంలోకి వస్తాడు.

ఆ తర్వాత ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది. దొర పోయిండు, దొరతనం పోయిందని భావించిన పేదప్రజలు పెంటయ్యను నాయకుడిగా చేసుకున్నారు. పెంటయ్య రెండోసారి పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్యగా వచ్చింది దొర కూతురే. పెంటయ్య దొర గడీని అనుకూలంగా నవీకరించుకుంటాడు. "కొత్త గడీల కూసున్న పెంటయ్య నాయకుడికి గడీల దొరతనం, కరుకుదనం చేరింది." కొన్నాళ్ళు కోటలో, కొన్నాళ్ళు పట్నంలో ఉంటున్నాడు. ప్రజల సమస్యలు సమస్యలుగానే మిగిలి పోయాయి. ప్రజలకు భూమి దక్కలేదు. వృత్తులు పోయాయి. వ్యాపార వృత్తులు పెరిగాయి. వృత్తులు కోల్పోయిన వారు భూమిని కోరుకున్నారు. ప్రజల అసంతృప్తిని గమనించిన పెంటయ్య కోట గడీకొచ్చాడు. తెలివిగా కులవృత్తులను కట్టుబాట్లను పునరుద్ధరించే ప్రయత్నం చేశాడు. లేకపోతే జనం భూమి కావాలంటారని, తన మీద దళితులు తిరగబడతారని గ్రహించాడు. చివరికి జనం పెంటయ్య మీద తిరగబడతారు. ఈ కథ ఒక చారిత్రక పరిణామ కథ. చాలా నర్మగర్భంగా ఇది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలాన్ని ఆతర్వాత కాలాన్ని చిత్రించినట్లు కన్పించినా, జాగ్రత్తగా ఆలోచిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందటి

పాలనను, తెలంగాణ రాష్ట్ర అవతరణ తరువాత పాలనను చిత్రించినట్లు అర్థమవుతుంది. ఈ కథలో స్వతంత్రం అంటే రాష్ట్ర అవతరణ అని అర్థం చేసుకుంటే, దొర పాలన ఆంధ్ర నాయకుల పాలన అని, పెంటయ్య పాలన రాష్ట్ర ఏర్పాటు తర్వాత పాలన అని అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, తెలంగాణలో స్వపరిపాలన వచ్చినా, సామాజిక న్యాయ తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పడలేదని, అందువల్ల ఇంకా ఉద్యమాలు రావాల్సిన అవసరం ఉందని ఈ "కొత్త దొర" కథ చెబుతున్నది అనిపిస్తుంది. ఇప్పటికే తెలంగాణలో ఏర్పడి ఉన్న తెలివికి ఈ కథ అక్షర రూపమని చెప్పవచ్చు.

ఈ సంపుటిలో గురుశిష్య సంబంధాలను చిత్రించే రెండు కథలున్నాయి. ఒకటి "కర్తవ్యం". రెండు "టముకు". మొదటిది ఉద్యోగుల కథ. రెండవది కళాకారుల కథ. "కర్తవ్యం"లో పాఠశాలలో మర్రి ఊడలు పట్టుకొని ఉయ్యాలూగే రాముడు జారి రాయి మీద పడి తల పగలడంతో ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్ కట్టుకట్టి పెద్ద ఆస్పత్రికి తీసుకుపొమ్మంటాడు. పెద్దాసుపత్రిలో వైద్యానికి లక్ష రూపాయలవుతుందని డాక్టరు చెబుతాడు. ఆపరేషన్ తర్వాత ఏమైందో తెలియదు. రాము చదువుకొని ఉద్యోగం సంపాదించి తన గురువు రాఘవయ్య సారు ఆశీర్వాదం తీసుకుందామని అతని వద్దకు వచ్చాడు. వచ్చేసరికి రాఘవయ్య సారు పాడె మీదున్నారు. అంత్యక్రియలయ్యాక రామునికి రాఘవయ్య డైరీ ఇస్తాడు రాఘవయ్య నౌకరు వెంకయ్య. ఆ డైరీలో రాఘవయ్య రాముని గురించి గొప్పగా రాసి ఉంటాడు. అందులో "నా జీవితంలో గెలిచిన జ్ఞాపకం రాముడు" అని రాసి ఉంటుంది. ముగ్గురు అనాథ పిల్లలను చేరదీసి ఆదరించినట్లు, వాళ్ళ పోషణకు పెన్షన్ ఖర్చుపెట్టి తన ఆరోగ్యాన్ని లెక్క చేయనట్టుగా రాసి ఉంటుంది. అప్పుడు గతంలో రామునికి రాఘవయ్య సారు చేసిన మేలు గుర్తుకు వస్తుంది. తను ఆసుపత్రిలో ఉన్నాడు. నానమ్మ శవమైపోయింది. రాఘవయ్య రోడ్డు ప్రమాదంలో భార్య పిల్లల్ని పోగొట్టుకుని, గాయాలతో ఆసుపత్రికి వస్తాడు. విషయం తెలుసుకుని తన దగ్గరున్న డబ్బు ఇచ్చి వైద్యం చేయిస్తాడు. ఇది జ్ఞాపకం వచ్చి రాఘవయ్య సారు ఆదరించిన ఆ ముగ్గురు పిల్లలను తాను ఆదరిస్తారు. వాస్తవానికి ప్రచారానికి మధ్య ఉండే దూరాన్ని గురు-శిష్య సంబంధం ద్వారా భద్రయ్య రాసిన కథ "టముకు". గ్రామ విషయాలను ప్రజలకు తెలియపరిచేటప్పుడు ఉపయోగించే వాయిద్య సాధనం టముకు. ప్రచారానికి ప్రతీక. ఈ కథలో బుచ్చయ్య పంతులు, సర్వడు చిడ్తల కళలో గురుశిష్యులు. సర్వడు మంగలి పని చేసుకొని జీవనం గడిపే, చిడ్తల కళాకారుడు. మంచి అందగాడు. ఆయనను ఒక రోజు తన చెల్లెలు ఇందిరను బలాత్కరించాడని అపోహపడి చెట్టుకు కట్టేసి కొడతాడు వీరారెడ్డి. బుచ్చయ్య పంతులు వెళ్లి ప్రాధేయపడి విడిపించుకుని వస్తాడు. దాంతో ఊళ్ళో మంచి పేరున్నసర్వడికి చెడ్డ పేరు వస్తుంది. ఆ అవమానం భరించలేక సర్వడు తన భార్యను తీసుకొని వేరే ఊరుకు వెళ్ళిపోతాడు. ఇందిర ఇంట్లో చెప్పకుండా ఎవరితోనో లేచిపోతుంది. ఇందిర అన్న వీరారెడ్డి సర్వడిపై అనుమానంతో కేశపురం సర్వని ఇంటికి వెళ్లి చూస్తాడు. సర్వడి భార్య మాత్రమే ఉంటుంది. అవమానం భరించలేక వీరారెడ్డి ఉరేసుకుంటాడు. దాంతో కేశపురంలో కూడా సర్వయ్య మీద దుష్ప్రచారం జరుగుతుంది. నిజానికి ఇందిర ఇంకో కళాకారుడైన మల్లయ్యతో వెళ్ళిపోతుంది. కానీ ఈలోపు ఆ గ్రామంలో కూడా సర్వడిపై దుష్ప్రచారం పాకిపోతుంది. లాభం లేదని సర్వడు ఆ ఊరును వదిలి మరోచోటుకు జీవనాన్ని మారుస్తాడు. మంచి చిడ్తల కళాకారున్ని కోల్పోవడంతో గ్రామంలో బుచ్చయ్య పంతులు ప్రదర్శించాలనుకున్న ప్రదర్శన ఆగిపోతుంది. చాలా కాలం తరువాత బుచ్చయ్య పంతులు తన మనుమరాలును చూడడానికి రాంపురం పోతున్నప్పుడు దారిలో యాదృచ్ఛికంగా అక్కడ చిడుతల రామాయణం ప్రదర్శన చూస్తాడు. అది తనవల్ల కాని పద్మవ్యూహాన్ని సర్వడు ప్రదర్శిస్తుంటాడు. దుష్ప్రచారం మానవ సంబంధాలను ఎంతగా అస్థిరపరుస్తుందో ఈ కథ చెబుతుంది. స్నేహం గొప్పదనం, ఆనాటి కళలు, వైభవం, అమాయకత్వం అవన్నీ ఈకథలో ఉంటాయి.

**రెండింటికీ భిన్నంగా రాసిన మరో కవితా సంపుటి 'చూస్తుండగానే...'. ఆధునిక జీవితం లోని సంఘర్షణ, మానవ సంబంధాలు, రేపటి మనిషి, రాజు తీర్పు లాంటి అధిక్షేప కవిత్వాలు ఇందులో వున్నాయి. అనగా అనగా... అన్న కవిత ఎందరినో ఆకర్షించింది. సత్యమూర్తి ప్రత్యేకంగా ఆ కవిత మీద ఉత్తరం రాశాడు.**

ఈ సంపుటిలో రెండు పరువు హత్య కథలు ఉన్నాయి. ఒకటి ఖూని. రెండవది శూర్పనఖ. గత పదేళ్లుగా తెలుగునాట పరువుహత్యలు, దుర్మార్గాలు పెరిగిపోయాయి. వీటికి ప్రధాన కారణం యువతీ యువకులలో స్వాతంత్ర్య ప్రకటన. కులాంతర ప్రేమ వివాహాలు. వీటిని సహించలేని ఆధిపత్య కులాల వాళ్ళు, నిరంకుశ వాదులు హత్యలకు పూనుకుంటున్నారు. శూర్పణఖ కథ రామాయణ శూర్పణఖ కథ నేపథ్యంగా రాశారు భద్రయ్య. రంగారావు అనసూయమ్మల కుమారుడు రామారావు. వాళ్ళ దగ్గర పనిచేసే గంగమ్మ, శంకరయ్యలకు కుమార్తె మీనాక్షి. బాల్యం నుండి రామారావు, మీనాక్షి కలిసి చదువుకున్నారు. వాళ్ల కులాలు, ఆర్థిక స్థితిగతులు వేరైనా, వాళ్ల హృదయాలు మాత్రం ఒక్కటయ్యాయి. కానీ

రంగారావు తల్లిదండ్రులు అతడికి రమతో బలవంతంగా పెళ్లి చేశారు. విధిలేని పరిస్థితుల్లో ఆమె అమ్మానాన్నలు మీనాక్షికి ఒక దురలవాట్లున్న వ్యక్తితో పెళ్లి చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అనసూయమ్మది నిరంకుశ పాత్ర ఉంది. రంగారావు రమతో సంసారం చేయలేదు. మీనాక్షి భర్త మరణించాడు. ఆమె ఒంటరిదయింది. రంగారావు మీనాక్షిలు రహస్యంగా కలుస్తున్నారు. ఇది బయట పొక్కింది. ఇది తట్టుకోలేని అనసూయమ్మ మీనాక్షిని కారణంగా భావించి, ఆమె ఉంటున్న ఇంట్లోనే అగ్నికి ఆహుతి చేస్తుంది. శూర్పనఖగా మిగిలిపోతుంది.

"ఖూనీ"లో ధరణికి ఇష్టం లేని పెళ్లి చెయ్యబోతే రైల్వేస్టేషన్ లో ఆమెను పెళ్లి చేసుకోబోతున్నారనుకుని అనుమానంతో ధరణి తండ్రి చంపేస్తాడు. ఈ కథ నిర్మాణం కొంత సంక్లిష్టంగా ఉన్నా సారాంశం ఇది. ఈ కథ పరువు హత్యలపైన ఈ తరం యొక్క నిరసనే.

మూఢనమ్మకాల వల్ల బతుకులు ఎలా నాశనమవుతాయో చెప్పిన కథ "లత్త". లింగమ్మకు నుదిటిమీద ఎగనాకుడు ఉందని, మల్లయ్య తల్లి ఆ సంబంధాన్ని ఒప్పుకోదు. అందరి ఒత్తిడితో ఒప్పుకుంటుంది. వెయ్యి రూపాయల కట్నం, రెండువేల రూపాయలకు పెరిగిపోతుంది. అనేక రకాల ఆశ చూపించాక చివరికి ఒప్పుకుంటుంది. తీరా పెళ్లి దగ్గరకు వచ్చేసరికి లింగమ్మ తండ్రి మరణిస్తాడు. దాంతో మల్లయ్య తల్లి నమ్మకం బలపడడంతో వెనక్కి తగ్గుతారు. పెండ్లి రద్దయిపోతుంది. చివరికి లింగమ్మకు ఇద్దరు భార్యలు మరణించిన వ్యక్తితో పెళ్లి జరుగుతుంది. లింగమ్మను చేసుకోవాల్సిన మల్లయ్య చివరికి బిక్షగాడు అవుతాడు. మానసిక స్వస్థత చేకూరే వరకు లింగమ్మ దంపతులు అతనికి ఆశ్రయం కల్పించి ఆదరిస్తారు.

"తోడు" కథ ఇప్పటి వైద్యరంగంలోని అమానుషత్వాన్ని వాస్తవికంగా చిత్రించింది. పల్లెలో బతకలేక పట్నం వెళ్ళిన విజయమ్మ రామలింగంలు ఉపాధి కోల్పోవడం వలన, కూతుర్ల ధన దాహం వలన నిరాశ్రయులైన ఆ దంపతులు వృద్ధాప్యంలో వైద్యం చేయించుకోలేక జంటగా కన్ను మూసిన వాస్తవాన్ని ఈ కథ చెబుతుంది. అలాగే పల్లె నుండి పట్నం వచ్చి కరోనా కారణంగా ఉపాధి కోల్పోయి మళ్ళీ పల్లెకు చేరే క్రమంలో ప్రమాదానికి గురైన రాములమ్మ, రాములు విషాద గాథ "అగ్గువ బతుకులు". "వెలుగు చుక్క" సైనిక నేపథ్యంలోఉన్న కథ. ఆనందరావు, కిరణ్ ల సాహస గాథ. ఆనందరావు కుమారుడిని , ఆయుధాలను ఎత్తుకెళ్ళిన తీవ్రవాదులనుండి సాహసం చేసి కిరణ్ కొన్ని గంటలలోనే తిరిగి తీసుకొస్తాడు. "లొట్టపీసు పూలు" చెరువులో పూస్తాయి. శివుడు ఆ లొట్టపీసు పూల చెట్లను నరికి వాటితో తడికల అల్లి జీవనం సాగిస్తాడు. అనుకోకుండా అతనిపై ఎల్లయ్య పంతులు అనే పెద్దమనిషిని చంపాడనే హత్యానేరం పడుతుంది. అంతకు ముందు తాతతో చెరువు దగ్గర యమున "లొట్టపీసు పూలు" ఇష్టపడి వెంట తెచ్చు కుంటుంది. ఆ పూలు బతుకమ్మను పేర్చడంలో ఉపయోగపడవని, వాటిని ముట్టరాదని సలువమ్మ తన బిడ్డ యమునకు చెబుతుంది. చివరికి ఆ హత్యోదంతాన్ని, నేరస్తుడిని పట్టివ్వడంలో ఆ "లొట్టపీసు పూలే" ఉపయోగ పడతాయి. గ్రామాల్లో లొట్టపీసు చెట్లు చెరువుల్లో పెరిగినపుడు, అవి పెరగకుండా వాటిని అడుగుకు తొక్కి వేస్తారు. కొంత కాలం తరువాత లొట్టపీసు చెట్లు తిరిగి లేస్తాయి. ఈ క్రమంలో వాటినే నమ్ముకున్న కొన్ని వృత్తుల వాళ్ళు కొంతకాలం ఉపాధి కోల్పోతారు. ఈ కథల్లో అణిచివేత, చిన్నచూపుకు గురైన జీవితాల తిరుగుబాటు ప్రధానంగా ఉండడంతో ఈ పుస్తకానికి శీర్షికగా "లొట్టపీసు పూలు" అని నిర్ణయించారు రచయిత.

ఈ కథలన్నీ కలిసి సారాంశంలో స్వాతంత్ర్యానంతర ఆర్థిక సాంఘిక రాజకీయ వాస్తవాలపై రచయిత చేసిన వ్యాఖ్యలు. స్వాతంత్ర్యం వచ్చినా, సాధించవలసినంత అభివృద్ధిని, మార్పును సాధించలేకపోవడం వల్ల, దోపిడీని నిర్మూలించలేకపోవడం వల్ల, బలవంతుల దౌర్జన్యాలు అలాగే కొనసాగుతున్నాయని ఈ కథలు చెబుతాయి. ప్రజలలో సాంఘిక చైతన్యం కల్గించడంలో పాలకులకు శ్రద్ధ లేకపోవడం వలన కుల వివక్ష కొనసాగుతూ, పరువు హత్యలు జరుగుతున్నాయి. మూఢనమ్మకాల నిర్మూలనలో పాలకులు విఫలం కావడం వల్ల వివాహ సంబంధాలు దెబ్బతింటు న్నాయని ఒక కథ చెబుతుంది. పేదరిక నిర్మూలన జరగకపోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయి. చేరదీసిన వాళ్ళను చంపేయడం, పల్లెలను వదిలి పట్నాలకు పోయి కష్టాల పాలవ్వడం వంటి అనర్థాలు జరుగుతున్నాయని కొన్ని కథలు చెబుతాయి. "సమాజంలో ఎన్ని లోపాలున్నా, మానవత్వం పూర్తిగా చావదు" అని చాటి చెప్పే ధోరణి చాలా కథలలో కనిపిస్తుంది.

భద్రయ్యకు వస్తువు మీద మంచి శ్రద్ధ ఉంది. వస్తువుని కథగా మలచడంలో పరిణితిని సాధించవలసి ఉంది. సామాజిక సంబంధాలను, పరిణామాలను భద్రయ్య జాగ్రత్తగా చిత్రిస్తాడు. కొన్ని సార్లు కాకతాళీయతను నమ్ముకుంటాడు. కొన్నిచోట్ల అనూహ్య మలుపులు తిప్పాల నుకుంటారు. సీరియస్ రచయితగా ఉన్న భద్రయ్య కమర్షియల్ కోణాన్ని ఆయన పరిహరించుకోవాల్సి ఉంది. చక్కని తెలంగాణ భాష ఆయన సొంతం. ఈ కథలలోని పాత్రలు చాలా వరకు బడుగుల జీవితాలు. తల్లి లేని పిల్లలు, తండ్రి లేని పిల్లలు, ఇద్దరూ లేని పిల్లలు, నానమ్మ తాతయ్య పోషణలో పెరిగిన వాళ్ళు, భర్తల నిరాదరణకు గురైన స్త్రీలు, భర్త చనిపోతే మరొకరితో వెళ్లిపోయిన స్త్రీలు. ఈ కథల్లో వీళ్లంతా సామాన్యులు. భద్రయ్య తన పరిమితమైన జీవితానుభవంలో గొప్ప వైవిధ్యభరిత కథలే రాశాడు.

# మేఘాల వెనకాల



**జయంతి వాసరచెట్ల**

ఆకాశ గుమ్మానికి,
బూడిద రంగు కర్టెన్ ఒకటి
నేలకు వేలాడుతుంది..!!
మధ్యమధ్యలో ఏదో యుద్ధతంత్రం చేస్తున్నట్లు
ఒక మెరుపు కత్తిని విసురుతుంది..!!
యుద్ధభేరి మ్రోగుతున్నట్లు
భృకుటి ముడివేసి రౌద్ర రూపాన్ని ప్రదర్శిస్తుంది..

అప్పుడు...
నింగిజల్లెడలోంచి జారుతున్న వెండి చినుకులు
వెన్నెల వాకిట్లో పరుచుకుంటాయి!
ఆ తథాగతుడికి మేలిముసుగు తొడిగి
కాసేపు నిదురపొమ్మని..
కాసిన్ని మంచు ముద్దలు విసిరి
కోపాన్ని చల్లార్చజూస్తాయి!!

కత్తిరించబడిన కర్టెన్ ముక్కలు
పత్తి ఉండల్లా చుట్టుకుని
మట్టిదిబ్బకు తాకి దుమ్ముకొట్టుకుపోతాయి..!!

అప్పుడే...
సూర్యుడిని తెల్లబల్లపై నుండి
తుడిచివేయడానికన్నట్లు
మందపాటి మబ్బు దుప్పటి
నింగి సరిహద్దులు పరుచుకుంటుంది!!

పరుచుకున్న మబ్బు తునకలు
పర్వతాల్లా వేలాడుతుంటాయి!

ఆ ఆటలేవీ సాగనీయక
తన కిరణాల ఉధృతి పెంచి
దుమ్ము కొట్టుకున్న నింగినంతా ప్రభాకరుడు
విహంగ వీక్షణం చేసి వెలిగిస్తాడు.

ఏమబ్బులవెనుక ఏమున్నా
తేటతెల్లం అవుతుందప్పుడు!!

*(తెలంగాణ జాగృతి కాళోజి జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న నిర్వహించిన కవి సమ్మేళనంలో వినిపించిన కవిత)*

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికననుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# కాపరి

గొర్రెల కాపర్ల జీవితాలను చిత్రించిన కథ...




అట్టెం దత్తయ్య
9494715445


అవి వరంగల్లు జిల్లా గట్టు దుద్దెనపల్లి అడవులు. మస్తుగా వానలు పడుతున్న కాలం. మస్కుమస్కు చీకటి అవుతున్న సమయం. ఉంటుంది ఊరికి రెండు కిలోమీటర్ల దూరం. అప్పుడే మూడు లారీలు హారన్ ఇచ్చుకుంటూ అటువైపు వస్తున్నాయి. ఆ లారీల చప్పుడు వినగానే బియ్యం పొయ్యిమీద పెట్టిండ్రు. అన్నం కాగానే మనిషికింత ఏసుకుని తిన్నరు. తినే లోపే లారీ డ్రైవర్లు హారన్ మీద హారన్ కొడుతుండ్రు. తినుడు అయిపోంగనే ముల్లె మూట సర్ది కట్టిపెట్టిండ్రు. ఇద్దరు వెళ్ళి లారీలను మందల దగ్గరకు తీసుకుని అచ్చిండ్రు. మూటలు తీసుకెళ్ళి లారీలో డ్రైవర్ దగ్గర సీటుకింద పెట్టిండ్రు. తర్వాత ఒక్కొక్కమేకను లేపుకుంటూ లారీలో వేస్తుండ్రు. మేకలన్ని అరుపులు మొదలుపెట్టినై. ఆ రోజు ఉదయం వరకు కలిసున్న మేకలు ఇప్పుడు రెండు మందలుగా విడిపోయినై. తల్లులు పిల్లలు అని లెక్కలేకుండా విడగొట్టిండ్రు. ఒక మంద ఇక్కడే అడవులలో ఉంటాయి. మరో మందను పూర్తిగా లారీలలో నింపుతుండ్రు.

ఆ లారీలలో అడుగు భాగంలో ఇంత చిట్టు పోసుకొనివచ్చిండ్రు. మేకల కాలి అడుగు భాగపు గిట్టలు చాలా సన్నగా ఉంటాయి. అవి ఆ లారిలో గట్టిగా నిలబడలేక పోతున్నాయి. అటూ ఇటూ జారుతున్నాయి. నింపుడు అయిపోగానే లారీల డోర్లు వేసి, ఎక్కుమన్నారు. లారీకి ఇద్దరు చొప్పున ఎక్కి నిలవడ్డరు.

అక్కడే ఉండిపోతున్న మేకలలో మంచి జాతి వాటిని చూసుకుంటూ కొందరు కాపర్లు కంటనీరు పెట్టుకుండ్రు. అందులో కొన్ని కాపర్లకు ఆత్మీయంగా ఎప్పుడు పిలిచిన పలికే మేకలు. అటువంటివి దూరమౌతున్నందుకు బాధపడుతుండ్రు కొందరు. అంతలోనే లారీలు ప్రారంభించారు. అప్పుడే వాన మెల్లిగా మొదలువెట్టింది. సచ్చినమురా దేవుడా అనుకున్నారు. అయినా తప్పదు కదా లారీలు నడుస్తూనే ఉన్నాయి.

ఒక లారిలో గొల్ల నర్సయ్య వాళ్ల మేనల్లుడు బాలమల్లు ఉన్నారు. లారీ కదిలనప్పటి నుండి మేకలన్ని అతలా కుతలం అవుతూనే ఉన్నాయి. చిన్న బ్రేక్ వేసిన మేకలన్ని ఒకదాని మీద ఒకటి పడ్తాయి. వాటన్నిటిని వీళ్లిద్దరు లేపుకుంటూ ఉండాలి. ఏ మాత్రం చూడకపోయినా ఊపిరి ఆడక సచ్చిపోతాయి. వాటి మధ్యలోకి వెళ్ళి వాటిని లేపి దూరం చేస్తున్నారు. వీళ్ళ కాళ్ళను తొక్కి తొక్కి పుండు చేస్తున్నాయి. బాలమల్లు ఆ మంటను భరించలేక లారిలో ఓ మూలన కూర్చున్నాడు. లారి మొదలయిన నుండి వాన పడుతూనే ఉంది. బాలమల్లు చిన్నగ వనుకు పట్టిండు. కూర్చున్న బాలమల్లు మీద ఒక మేక మూత్రం పోసింది. "ఛూ..ఛూ...నీ యవ్వా!... అబ్బా... ఎంత గరం వుందే" అనుకుంటూ అట్లానే కూసుండు. ఆ మేక ఉచ్చ వేడికి వనుకు మాత్రం తగ్గింది అనుకున్నాడు. బాలమల్లుకు ఆ టైంలో ఏవేవో గుర్తుకు వస్తున్నాయి... "ఏం బతుకురా నాయనా... చదువుకుంట అంటే మా అయ్య వినక పాయే. ఈ కష్టాలకంటే చావు నయం. మూడు నెలలు అవుతుంది ఇంటికాడికెళ్ళి వచ్చి. అవ్వను చూద్దామన్నా తీరకపాయే. నేను మన్నెం పోనే యయ్య అంటే వినకపాయే. రాళ్ళు వడ్తే మేకలకు మంచి రేటస్తది. ఇదొకసారి పోతే బాకితేరుతది అని బతిమిలాడితే అస్తి. ఆ రాళ్ళు సల్లగుండా మంచిగనే పడ్డయి గాని కటికోడు మోసం చేసిండు. రాళ్ళమేకకు ఆరువేలు ఇస్తా అని మాట్లాడుకొని తీసుకచ్చిండు. తీర మూడు నెలలు నిండినంక ఇయ్యల్ల మ్యాకమ్యాకను చూసి అందులో సగం కూడా తియ్యకపాయే. అందరి కంటే కొంత కష్టపడి మేపినం. సంచుల కొద్ది తుమ్మకాయ వోసినం. అచ్చం బిల్లగొడిశా, పంచాత్కం ఆకే మేపినం. ఈ ఆకు ఎంత మేపితే అంత రాయి మీద పారెపోస్తదన్నరు. మేపిందంత ఎటుపోయిందో. మంచిగా మేపలేరనవట్టే

కథ

ఆ కటికోడు. సగం మేకలను పరిగ కిందనే అడిగి మళ్ళి నాలుగు వేలకే బ్యారం చేసుకునే. అన్ని కలిపితే గాడికే అచ్చె సంసారం. ఈడికి కొట్టుకొచ్చిన నుండి గుట్టలెక్కక మలాస్క మ్యాకలు సచ్చిపాయె. ఇంటికాన్నే ఉండి అటు ఇటు మేపుకుని వుత్త జీవాల్ని అమ్ముకున్నా ఒక్కొక్కదాన్కి మూడున్నర వేలు యాడికివోయేవి కావు. చెప్తె ఇనకపాయే మా యయ్య. ఈ దుద్దెన పల్లె సల్లగుండా, ఆ వొడ్డె కొమిరిగాడు సచ్చిపోను. మమ్మల్ని చిన్న బాధపెట్టెనా... ఎన్ని మేకలు ఆని బొందకు అయినయో? అన్ని బెదిరిచ్చెటోడే లేకపాయే. అచ్చినప్పుడల్లా నాలుగైదు పట్కపాయే. ఏమన్న అంటే వాళ్ళ వొడ్డెరొళ్ళను అందర్ని తీస్కచ్చి కొడ్తడంట. అన్నిమూస్కాని మేపుకుంటిమి. రాత్రి అచ్చి ఎత్తుకపోతడు. పొద్దున్నే లేవగానే మత్తు తీస్కచ్చి మమ్మళ్నే తాగుమంటడు. వాని దుర్మార్గమీద మన్నువడ. వాడె పెద్దిర్కం తోటి 'నా చేతో ముడ్తే ఉక్కు తాళాలు, చిక్కు గొళ్ళాలు ఊసిపోతై' అంటుండే. ఆన్ని సుట్టుపక్కల ఏ పోలీసోల్లు ఏమనరట. మా దెగ్గిరినుండి ఎత్తుకపోయిన మ్యాకలల్ల ఒకటి రెండు వాళ్ళకుగూడ ముడ్తయంటా.

మొండన్న పెళ్ళాం కడుపు సల్లగుండా నన్ను కొడుకోలే పలకరిచ్చేది. ఈ మూడు నెలలు నన్ను మంచిగా మాట్లాడిచ్చింది. వచ్చెటప్పుడు చెప్తామంటే లేకపాయో. వాళ్ల ఇల్లు నాకు తెల్వదాయే. పోయిన నుండి వాళ్ళింటికి నన్ను ఒక్కసారి తొల్కపోయింది. మంచిగ కడుపునిండ బువ్వవెట్టింది. నాకిద్దరు బిడ్డలే మా దగ్గరే ఉంటవా అని అంది. ఆళ్ళ ఇంట్ల పిల్లల పుస్తకాలు చూసినప్పుడు నాకు మస్తు బాధేసింది. జెరసేపు ఉండి మందకాడికి అచ్చిన. అచ్చిన్నుండి మా మామ "ఆళ్ళ ఇంట్ల తినచ్చినవా? నీ పోరండ్ల మన్నువడ. వాళ్ళు మాలొల్లట. యాడదొరికితే ఆడ తినుడే నిన్ను బొందవెట్ట. పో అటు ఆ మ్యాకల మొకాన వొయ్యి సావుపో. దరిద్రపోడు." అని మస్తు తిట్టిండు. అప్పుడప్పుడు ఊకే గుర్తుచేసి ఎక్కిరిస్తుండే కూడా. కాని మాకంటే వాళ్ళే నీటుగుంద్రు. ఆమే మాట్లాడితే మా యవ్వ(అమ్మ) మాట్లాడినట్లనిపిచ్చేది. వాళ్ళ చేండ్లనే మందవెట్టినం గన్క రోజు పల్కరిస్తుండే.

సవనపురం సాయన్న మళ్ళెప్పుడు కలుస్తాడో. "నువు చదువుకో తమ్మి చాల వుశారున్నవ్" అంటుండే ఎప్పుడు. ఈయనకు ఓ ఇచిత్రమైన మంత్రం అస్తుండే. మ్యాకలన్ని మందవెట్టంగనే జెర్రసేపు ఆగినంగా చేతిలో ఓ కట్టె వట్టుకొని మందసుట్టు గీత గీసుకుంటా తిరిగస్తుంటే ఆ గీతలోపల్కి ఏ మొనగాని దొంగకూడా రాడడ. నిజంగానే ఆ సాయన్న ఉన్నన్ని రోజులే మేము సరిగ్గ నిద్రవోతుంటిమి. ఆయన పెండ్లాం పిల్లలు గల్లోడు ఎప్పుడు ఊరికి వోయిన ఆ రాత్రి ఒకటి రెండు ఒడ్డొళ్ళ పాలు కావల్సిందే" అని బాలమల్లు ఆలోచనల్లో మునిగి

మంచిగ కడుపునిండ బువ్వవెట్టింది. నాకిద్దరు బిడ్డలే మా దగ్గరే ఉంటవా అని అంది. ఆళ్ళ ఇంట్ల పిల్లల పుస్తకాలు చూసినప్పుడు నాకు మస్తు బాధేసింది. జెరసేపు ఉండి మందకాడికి అచ్చిన. అచ్చిన్నుండి మా మామ "ఆళ్ళ ఇంట్ల తినచ్చినవా? నీ పోరండ్ల మన్నువడ. వాళ్ళు మాలొల్లట. యాడదొరికితే ఆడ తినుడే నిన్ను బొందవెట్ట. పో అటు ఆ మ్యాకల మొకాన వొయ్యి సావుపో. దరిద్రపోడు." అని మస్తు తిట్టిండు.



కథ

పోయిండు. డ్రైవర్ లారిని అనుకోకుండా ఆపిండు. వెంటనే బాలమల్లు లేచి లారి అంచునుండి చూసే సరికి రోడ్డుపక్కన అందమైన ఆడామె నిలబడింది. ఆమెతో ఈ డ్రైవర్ మాట్లాడుతుండు. బాలమల్లు మామ నర్సింలు లారి ఎట్లయిన ఆగింది కదా... బాలమల్లును ముంగటికి పంపిద్దాం "ఇప్పటిదాక పడ్డ ఆనకు తడిసి పోరడు అనుకు వడ్తుండు." అనుకుని డ్రైవర్‌ని అడిగిండు. పంపియ్యి అని డ్రైవర్‌తో అన్నాడు. బాలమల్లును దించి ముంగట కూర్చోమన్నాడు. ఇప్పుడు మేయిన్ రోడ్డు మీదనే పోతుంది కదా... బ్రేక్‌లు అంతగా లేవు. మేకలు జెర అటూ ఇటూ జారిపడ్తలేవు గదా అనుకుని ముందుకు పంపిండు. డ్రైవర్ ఆ రోడ్డు పక్క ఆడామెతో ఎం మాట్లాడిండో తెలువది ఆమె కూడా ముందు ఎక్కి కూర్చుంది. అంతకు ముందే వాన తగ్గింది. డ్రైవర్ పక్కన ఆ ఆడామె. ఆమె పక్కన బాలమల్లు. ఈ బాలమల్లుకు ఏమేమె డౌట్లు. "ఈమెకు ఏమై ఉండచ్చు. గీ రాతిరి రోడ్డు మీద ఎందుకు నిలవడ్డది? మొగడు కొట్టిండేమో? లేదా ఎక్కడికైనా అర్జంట్ గా పోవల్సి ఉందా. అట్లయితే వెంట ఊరోళ్ళను ఎవర్నైనా తెచ్చు కోవచ్చుగా. గింత మంచిగా ఉంది. పాపం ఏ ఆపతచ్చిందో..." అనుకుంటూ లోలోపల. వాళ్ళ వ్యవహారం చిన్నపిల్లవాడైన బాలమల్లుకు ఎం తెలుసు పాపం. పశుల కాపరిగా మారి ఏ పాపం తెలియని పిల్లవాడు. కొంత దూరం పోగానే లారిని ఆపిండు. డ్రైవర్ దగ్గరున్న పెద్ద వాటర్ క్యాన్‌ను తీసుకొని కిందికి దిగిండు. డ్రైవర్ దిగగానే ఆమె దిగింది. చాలా సేపు అటే పోయిండ్రు. బాలమల్లుకు మళ్ళి ఏవేవో ప్రశ్నలు. తిరిగి డ్రైవర్ ఒక్కడే వచ్చి లారెక్కిండు. స్టార్ట్ చేసిండి. "అయ్యో ఆమె రాకపాయే ఈడు స్టార్ట్ చేసి తీసుకుపోవట్టే. ఆమెను గీ అడువులల్ల దించిండు. ఎటు చూసిన ఊరు, పట్టణం ఏం కనిపిస్తలే. ఎందుకు దించిండు. ఎంచేసిండు? ఎక్కడ వదిలిపెట్టిండు? ఆమెకు ఆపతి ఉండి వస్తే వీడు మధ్యలో దించి పెయ్యిమీద వున్న సొమ్ములు గుంజుకోని సంపలేడు కదా..." అని బాలమల్లుకు ఎన్నెన్నో ప్రశ్నలు. బాలమల్లు ఇంటి దగ్గర మంచి సంప్రదాయ వాతావరణం. వార వారం భజన, స్వాధ్యాయి వంటివి వారికి మంచి తనాన్ని నేర్పాయి. ఎటువంటి అక్రమాలు తెలియని వాడు.

కొంత కొంత తెల్లవారుతుంది. గొల్ల నర్సయ్య వూరికి దగ్గర వచ్చిండ్రు. ఊరికి కొంత దూరంలో మేకలన్నింటిని దించిండ్రు. దించుతుంటే లారి డోర్ సందుల తట్టకుని రెండుమూడు మేకలకు కాళ్ళు విరిగిపోయినై. దించినంకా నర్సింలు డ్రైవర్‌ను ఇయ్యర మయ్యర తిడుతుండు. "జీవాలను తీసుకచ్చేటప్పుడు రాత్రిగా పిచ్చి పని ఏంది? వేరే పనిమీద పోయినప్పుడు ఎట్లనన్నా సావుండ్రి. వాళ్ళకేమో యభిచారం చెయ్యకుంటే కడుపునిండది. మీకేం బుట్టిందిరా ఇంటికాడ పెండ్లాలు లేరా? అడ్డమైన రోగాలచ్చి సంకనాకి పోతరు" అని బెదిరిచ్చి పైసలిచ్చి పంపించిండ్రు. నర్సింల మాటలు విన్నంక బాలమల్లుకు కొంత అర్థమైంది. మందకాడ నర్సయ్య వాళ్ళ అన్నను ఉంచి ఇంటికి పోతుండ్రు. రాత్రంతా వానలో తడిసి, రొచ్చులో మునిగి, ఎండి, ఆరిపోయిన బట్టలు వాళ్ళవేషం చూడలేనంత దరిద్రంగా ఉన్నారు. ఈ గొల్లకుర్మోల్లు ఒక నియమం పాటిస్తారు.

> **బాలమల్లు మామ నర్సింలు లారి ఎట్లయిన ఆగింది కదా... బాలమల్లును ముంగటికి పంపిద్దాం "ఇప్పటిదాక పడ్డ ఆనకు తడిసి పోరడు అనుకు వడ్తుండు." అనుకుని డ్రైవర్‌ను అడిగిండు. పంపియ్యి అని డ్రైవర్‌తో అన్నాడు. బాలమల్లును దించి ముంగట కూర్చోమన్నాడు. ఇప్పుడు మేయిన్ రోడ్డు మీదనే పోతుంది కదా... బ్రేక్ లు అంతగా లేవు. మేకలు జెర అటూ ఇటూ జారి పడ్తలేవు గదా అనుకుని ముందుకు పంపిండు.**

అది మన్నెం ఎన్ని రోజులు పోయినా మళ్ళి ఇంటికి వచ్చే వరకు గడ్డం, నెత్తి వెంట్రుకలు తీయించుకోరు. బాలమల్లుకు మూడు నెలల నెత్తి వెంట్రుకలు చాల పెరిగినై. రాత్రి మేక పోసిన ఉచ్చతో గట్టిగా పిడ్సలు గట్టినై. అటువంటి అవతారంతో మూటలను నెత్తిమీద ఎత్తుకుని ఊర్లోకి పోతే వారిని చూసే తీరును వర్ణించడం సాధ్యం కాదు. బాలమల్లు మనసుల రాత్రి ఈ విషయమే తిరుగుతుంది. "గంతమంచి గుంది ఆమె గంటకొకడితోటి గడిపి సంపాదించుకునుడేనా? వీళ్లను బలవంతంగా అట్లా ఎవరన్న మారుస్తారా? వారి పరిస్థితులే అట్ల తయారు చేస్తయా? అందమైన వాళ్ళ పెయ్యిని అప్పగియ్యడం ఒకటైతే ఆ రాత్రులల్లా గొంతుపిసికి చంపేస్తరనే భయం లేకుండ ఉండడు అంటే ఎంత సాహసం. పాపం వాళ్ళను మార్చేవారే లేరా..." అనుకున్నాడు.

తెల్లారి బాలమల్లు తండ్రి మేకలు ఉంటున్న ఊరికి వచ్చిండు. నరసయ్య దగ్గర కూసొని ఖర్చులు ఆదాయం అమ్ముడుపోయిన మేకల పైసలు అన్ని లెక్క చూసుకుండ్రు. కొన్నయి, రాళ్ల వడ్డవి, చచ్చిపోయినయి, పరిగె కింద వొదులుకున్నయి, అన్నీ లెక్క చేసి ఖర్చులు తీసేస్తే, మిగిలిందే ఏం లేదు ఇదంతా బతుకులు మారే యవ్వారం కాదు అనుకుని బాలమల్లు తండ్రి మిగిలిన మేకల్ని నరసయ్య మందలో నుంచి బాలమల్లును తోలుకొని వాళ్ళ ఊరికి పోయిండు. మర్నాడు పొద్దున్నే ఆ పిల్లవానిని తీస్కపోయి బడిల చేర్పించిండు. తోటి పిల్లల కంటే పెద్దగా ఉండడంతో కొన్ని రోజులు ఎక్కిరించిండ్రు. ఇన్నాళ్ల అడవితో మమేకమైన జీవితం. ప్రకృతిని ఆస్వాదించే మనసు. ఏ పాఠం చెప్పిన అట్లనే పట్టేసుకుంటుండు. బాలమల్లు చురుకుదనానికి పిల్లలంతా మంచి దోస్తులు అయ్యిండ్రు. సార్ల సహకారం దొరికింది. అన్నిట్లో మంచి మార్కులు తెచ్చుకుని పెద్ద చదువులు చదివి, సంతులు ఉద్యోగం సాధించిండు.

దృశ్య సాహిత్యం

తన కొడుకు తన పుట్టినరోజు బహుమతిగా అగిన 'జర్సీ' కొనిపెట్టాలనే ప్రయత్నంతో మొదలైన అర్జున్ ప్రయాణం తన కొడుకు కళ్ళలో తనని తాను హీరోగా మార్చుకున్న విజయంతో ముగిసింది. గౌతమ్ తిన్ననూరిగారి అద్భుత స్క్రీన్‌ప్లే, సాహతోపేక్షమైన పాత్రల భావోద్వేగ కథ 'జర్సీ'. ఈ చిత్రం ఎన్నో అంచనాలకు అందనంత ఎత్తుకు ఎదిగింది.

ఓ నిరుద్యోగ భర్త. లక్ష్య రహిత యువకుడు. కాని తన కొడుకి మాత్రం అతడే ప్రపంచం. ఒకప్పుడు రంజీ క్రికెట్ తనకి తాను ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ దురదృష్టవశాత్తు క్రికెట్ వదిలేయాల్సి పరిస్థితి వస్తుంది. ఆ తర్వాత జీవితాన్ని జీవించడమే మర్చిపోయిన అర్జున్ ప్రాణం కంటే ఎక్కువగా చూసుకొనే కొడుకు ముందు తనని తాను నిరూపించుకుంటాడా? తన భార్యకు ఓ మంచి భర్తగా నిలిచాడా? తన లక్ష్యాన్ని తాను గుర్తించి తన జీవితాన్ని తాను మలుపు తిప్పుకుంటాడా? లాంటి భావోద్వేగాలతో సినిమాను మరో స్థాయిలో నిలిపిన దర్శకుడు గౌతమ్‌ను ఎంత అభినందించినా తక్కువే.

**చిత్రం : జర్సీ**
**దర్శకుడు : గౌతమ్ తిన్ననూరి**
**భాష : తెలుగు**

“జర్సీ” ఒక ఉద్వేగపూరిత చిత్రం నాచురల్ స్టార్ నాని చేసిన నటన అర్జున్ పాత్రకు జీవం పోసింది. ఈ చిత్రంలో మనకు నాని ఏ మాత్రం కనిపించడు అర్జున్‌తో పాటు మనం కూడా ఆ పాత్రతో ప్రయాణం చేస్తాం. ఒక తండ్రిగా, యువకుడిగా, భర్తగా అర్జున్ పాత్ర మనల్ని మనం తనలో చూసుకునేలా చేస్తుంది. ఆ పాత్రలు అనుభవించే మధ్యతరగతి కష్టాలు, చిన్న చిన్న సంఘటనలు మనల్ని చిత్రంలోకి మరింత లోతులో తీసుకువెలుతుంది. భార్యగా, తల్లిగా శ్రద్ధా శ్రీనాథ్ భావోద్వేగ నటన ప్రత్యేకంగా నిలిచి ఎంతో కాలం గుర్తుండి పోయేలా నిలిచి ఉంటుంది. బాల నటుడిగా రోనిత్ కమ్రా తన నటనతో ఎంతో అలరించాడు.

అర్జున్‌కి తన కొడుకుతో ఉన్న ప్రేమానుబంధం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణను తెస్తుంది. అర్జున్ తన కొడుకును దండించి నప్పుడు నాని దాన్ని తీసుకున్న విధానం వారి మధ్యలో ఉన్న ప్రేమను మరో స్థాయిలో చూపుతుంది. భార్య, భర్తలు ఎన్నో గొడవలు పడ్డా వారి మనసుల్లో ఉండే ప్రేమ ఏ మాత్రం తగ్గకుండా ప్రేక్షకులకు మరో ప్రపంచంలోకి తీసుకెళ్తూ సినిమాను దశాబ్ద కాలం పాటు గుర్తుండిపోయేలా నిలిచింది.

మొత్తంగా ఈ చిత్రం అందరినీ అలరించి ప్రేమలో ఉండే కష్టనష్టాలు, మధ్యతరగతి కుటుంబంలో ఉండే భావోద్వేగాలతో కంటతడి పెడుతూ, నవ్విస్తూ అందరి మనసును తేలిక పరుస్తుంది.. తెలుగు భాషలో తీసిన అత్యద్భుత చిత్రాల్లో ఒకటి “జర్సీ”. జాతీయ అవార్డును సైతం సొంత చేసుకుంది చిత్రం.



# "పాండిత్యం ముసుగులో కవిత్వం కనుమరుగు కాకూడదు"
# - డా॥ కూరెళ్ల విఠలాచార్య

సాహిత్య తపస్వితో ఈ పక్షం ముఖాముఖి...



సాగర్ల సత్తయ్య
7989117415

నాకు కవిత్వమే బ్రతుకు నాకు శ్రమించెడి వాడె ఇష్టుడున్
నాకు నరుణ్ణి దైవమని నమ్మెడివాడె మహానుభావుడున్
నాకు మనస్వియే ప్రభువు నాకు దయాళుడె విష్ణురూపుడున్
నాకనురాగమే మతము నన్నిల బ్రోవుము విఠలేశ్వరా!



జీవితమంతా కవిత్వాన్నే ఆరాధించి పల్లెల్లో సాహిత్య పరిమళాలు వెదజల్లుతూ ఎందరికో మార్గదర్శకులుగా నిలిచిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య గారి విఠలేశ్వర శతకంలోని పద్యమిది. సాధారణంగా చాలామంది సాహితీవేత్తల జీవితాలను పరిశీలించినప్పుడు వారి జీవితం, సాహిత్యం వేరువేరుగా కనిపిస్తాయి. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ఇందుకు భిన్నమైన వారు. తమ జీవితానుభవాలనే సాహిత్యంగా మలచినవారు. తాను తన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు ముందు తరాలకు రాకూడదు అన్న తలంపుతో ఒక మారుమూల పల్లెలో గొప్ప పరిశోధన గ్రంథాలయం స్థాపించి విద్యార్థులు ఎందరికో దారి దీపంగా నిలుస్తున్నారు. పల్లె ప్రాంతాలలో పలు సాహిత్య సంస్థలు స్థాపించడం ద్వారా వెలుగులోకి రాని ఎందరో వర్ధమాన కవులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. తాను పని చేసిన ప్రతి చోట ఓ పత్రికను స్థాపించడం ద్వారా ఎందరో విద్యార్థులను సాహిత్య రంగం వైపు మళ్ళించ గలిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామం లో నివసించే డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ఎనిమిది పదుల వయస్సు దాటినా ఇంకా నవ యువకుడిలా గ్రంథాలయ బాధ్యతలను చురుకుగా నిర్వహిస్తూ ఉంటారు. పుస్తకాన్ని ప్రాణంగా భావించే డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యతో ముఖాముఖి...

**'నాకు చిన్నప్పుడు పుస్తకాలు దొరకక పోవడమే ఈ మహా గ్రంథాలయ స్థాపనకు ప్రేరణ' అని మీరన్నట్లు విన్నాను. మీ బాల్యం, చదువు సంగతులు తెలపండి?**

ఇప్పటి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీరునెముల గ్రామంలో మా అమ్మమ్మ గారి ఇంట 1938 ఆగస్టు 9న జన్మించాను. తల్లి కూరెళ్ళ లక్ష్మమ్మ తండ్రి వెంకట రాజయ్య. నేను ఐదు నెలల పిల్లవాడిగా ఉన్నప్పుడే తండ్రిని కోల్పోయాను. నా తల్లి లక్ష్మమ్మ ఎన్నో కష్టాలకోర్చి నన్ను పెంచింది. మా స్వగ్రామం వెల్లంకి. తండ్రి చనిపోయిన తర్వాత మేనమామల అండతో నీరునెముల చేరాం. నా విద్యాభ్యాసం కూడా అక్కడే ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలలు కూడా అంతగా లేని ఆ కాలంలో మహసూల్ దార్ అనే ముస్లిం ప్రైవేట్ టీచర్ వద్ద మా ఊరి పీర్ల కొట్టంలో నా అక్షరాభ్యాసం జరిగింది. అనంతరం వెల్లంకి వచ్చిన తర్వాత షేక్ అమ్మద్ అనే ప్రైవేట్ ముస్లిం టీచర్ వద్ద చదువు కున్నాను. నెలకు ఒక రూపాయి ఫీజు కట్టవలసి వచ్చేది. అది కూడా కట్టలేని స్థితిలో ఫీజుకు బదులుగా రోజు బడిని ఊడ్చి శుభ్రం చేసే వాడిని. ఆ రోజుల్లోనే మావూరి దేశ్ ముఖ్ అనుముల లక్ష్మీనరసింహారావు కృషివల్ల మా ఊర్లో 'ధర్మ బడి' ప్రారంభమైంది. తుల్జా రామ్ సింగ్ అనే ఉపాధ్యాయుడు వచ్చాడు. బల్తా ఖైదా (శిశు తరగతి) అవ్వల్ (మొదటి తరగతి) దువ్వం (రెండో తరగతి) సువ్వం (మూడో తరగతి) అక్కడే చదువుకున్నాను. ఆనాటి పాఠ్యపుస్తకాల అట్టల మీద నిజాం రాజు

ఫోటో ఉండేది. సువ్వం చదివిన తర్వాత మా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా మళ్లీ నీరునెముల వెళ్ళవలసి వచ్చింది. మా ఊరి కరణం లక్ష్మణ రావు కుమారుడు శ్రీహరి రావు భువనగిరిలో చదువుకుంటూ ఉండేవాడు. శ్రీహరి వేసవి సెలవులలో నీరునెములకు వచ్చినప్పుడు అక్కడి పిల్లలకు బేసిక్ ఎడ్యుకేషన్ ఇంగ్లీష్ నేర్పేవాడు. నేను కూడా అలా అతని దగ్గర ఇంగ్లీష్ నేర్చుకున్నాను. తానే నన్ను భువనగిరి లోని పోఖానియా (ఉన్నత పాఠశాల) చేర్పించడానికి ప్రయత్నించారు కానీ సీటు దొరకలేదు. రామన్నపేటలో చహరుమ్ (నాలుగవ తరగతి) పంజుమ్ (ఐదవ తరగతి) చెస్సుమ్ (ఆరవ తరగతి) అఫ్ తుమ్ (ఏడవ తరగతి) వరకు చదివాను. తరువాత 8వ తరగతి కోసం భువనగిరి పోఖానియా లో చేరాను. అప్పుడే భువనగిరిలో విశ్వకర్మ హాస్టల్ ప్రారంభమైంది. నెలకు ఫీజు ఆరు రూపాయలు. ఆ మాత్రం ఆర్థిక స్థితి కూడా లేకపోవడం వల్ల కొంతమంది బంధువుల యొక్క సహకారంతో కొంత మొత్తం, ముస్లిం వకీళ్ళకు తెలుగు చెప్పడం వల్ల కొంత మొత్తం సమకూర్చు కొని ఫీజు చెల్లించే వాడిని. ఆస్టల్ నిర్వహణ కూడా కష్టంగా మారడంతో కొంతమంది విశ్వకర్మల ఇళ్ల వద్ద వారాలు చేసుకుని చదువుకున్నాను. భువనగిరిలో చదువుకునే కాలంలో పుస్తకాలకు చాలా ఇబ్బంది పడ్డాను. నా తోటి విద్యార్థులు చదువుకుని నిద్రించిన తర్వాత రాత్రివేళలో వాళ్ళ పుస్తకాలు తీసుకొని చదువుకునే వాడిని. పుస్తకాలు లేకపోతే ఎంత కష్టమో స్వీయానుభవం తెలియజేసింది. అందుకే అందరికీ పుస్తకాలూ అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతో ఈ గ్రంథాలయ ఏర్పాటుకు పూనుకున్నాను.

**మీరు ఉపాధ్యాయుడిగా ఉపన్యాసకుడిగా సుదీర్ఘకాలం పని చేసినప్పటికీ అంతకు ముందే చాలా వివిధ ఉద్యోగాలకు రాజీనామా చేశారని విన్నాను. దీని గురించి వివరించండి?**

నా అభివృద్ధిని కోరి నా ఉపాధ్యాయులు హెచ్ ఎస్ సి తర్వాత పై చదువులకు వెళ్ళమన్నారు కానీ ఆర్థిక లేమితో ఆత్మాభిమానంతో పరాధీనత లో బతకలేనని చెప్పి పై చదువులకు స్వస్తి పలికాను. నా కాళ్ళ మీద నిలబడడానికి చిన్న ఉద్యోగమైనా సరే చేయాలని నిశ్చయించుకున్నాను. హెచ్ ఎస్ సి పాస్ కాక మునుపే హాల్ టికెట్ చూపించి 1957లో రామన్నపేట తహసిల్ ఆఫీస్‌లో నఖల్ నవీస్ (కాపీయిస్టు) ఉద్యోగంలో చేరాను. నెలకు 20 రూపాయల జీతం. ఆ రోజుల్లో కొత్తగా రామన్నపేటలో అంజుమాన్ ఆఫీస్ ఏర్పాటయింది. అధికారులందరూ ఉర్దూ వాళ్లే. ఒక ఇంగ్లీష్ రైటర్ కావాలని వెతుకుతున్నారని తెలిసింది. వెంటనే కాపీయిస్టుకు రాజీనామా చేసి అంజుమన్ సూపర్వైజర్‌గా చేరిపోయాను. అంజుమన్ శాఖలోని వాతావరణం గిట్టక ఆత్మాభిమానంతో రాజీనామా చేశాను. తరువాత భువనగిరిలో అబ్బాస్ అలీ అలీముద్దీన్ అనే వకీళ్లు భువనగిరి కోర్టులో నఖల్ నవీస్ ఉద్యోగం ఇప్పించారు. అందులో పనిచేస్తుండగానే వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ఏర్పడ్డది. నల్లగొండ కూడా దాని పరిధి లోనే ఉండేది. ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ద్వారా దరఖాస్తు చేయగా భువనగిరి సేల్స్ టాక్స్ ఆఫీస్‌లో ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూలో ఎంపికై మిర్యాలగూడలో నియామకం పొందాను. నెల రోజులు పని చేశాను. అక్కడి అధికారి ఆధిపత్య ధోరణి నాకు నచ్చలేదు. వెంటనే ఆ అధికారినే తెల్లకాగితం అడిగి అక్కడే రాజీనామా ఇచ్చి బయటకు వచ్చాను. మళ్లీ భువనగిరి చేరాను. విద్యుత్ శాఖలో ఎల్ డి సి స్థాయి ఉద్యోగంలో చేరాను. అక్కడ పనిచేస్తుండగానే మేడ్చల్ బేసిక్ ట్రైనింగ్ స్కూల్ లో అవకాశం వచ్చింది. విద్యుత్ శాఖ ఉద్యోగానికి రాజీనామా చేసి బి టీ ఎస్‌లో జాయిన్ అయ్యాను. ఉపాధ్యాయుడిగా అనంతరం పదోన్నతి పొంది కళాశాల అధ్యాపకుడిగా ఉద్యోగం చేస్తూ అనారోగ్య కారణంగా లెక్చరర్ల ఉద్యోగానికి కూడా రాజీనామా చేశాను.

**ఉద్యోగ జీవితం లోనే ఉన్నత విద్యను పూర్తి చేశారా?**

నా మిత్రుడు గుర్రం బుచ్చిరెడ్డి సలహా మేరకు ఉపాధ్యాయ శిక్షణలో చేరి రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశాను. అందుకుగాను ఆ






నాటి గవర్నర్ సర్ భీంసేన్ సచార గారి ద్వారా షీల్డ్ అందుకున్నాను. ప్రభుత్వ ఉద్యోగం లోకి ప్రవేశించిన తర్వాత ప్రైవేటుగా బీఏ డిగ్రీ పొంది బి.ఎడ్ డిగ్రీ కొరకు హనుమకొండ లో శిక్షణ తీసుకున్నాను. ప్రైవేటుగా 1972లో ఎమ్. ఏ పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యాను. హిందీలో విశారద పరీక్ష రాసి దానిలో కూడా సఫలీకృతుడనయ్యాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆచార్య ఇరివెంటి కృష్ణమూర్తిగారి పర్యవేక్షణలో ఎంఫిల్ పూర్తి చేశాను. అనంతరం ఇదే యూనివర్సిటీ నుండి డాక్టర్ ముదిగొండ శివ ప్రసాద్ గారి మార్గ దర్శకత్వంలో 1988లో డాక్టరేట్ పట్టా పొందాను.

**సాహిత్యంలో ప్రవేశించడానికి మీకు స్ఫూర్తి ఎవరు?**

కవిత్వ రచన స్వయంగా నేర్చుకున్నదే. ప్రత్యేకంగా నేర్పిన వారు ఎవరూ లేరు. నేను 12 ఏళ్ల ప్రాయంలో ఉన్నప్పుడు మా తాత బేతోజు లక్ష్మీనారాయణ గారు మరణించారు. ఆ సందర్భంలో వారిపై స్మృతి కావ్యం రాశాను. స్నేహితులతో ఒక సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసి వివిధ పండుగల సందర్భాల్లో పద్యాలు రాసే వాడిని. విద్యా డ్రామా అనే ఒక నాటిక రాసి ఆ నాటికలో సుగంధ రెడ్డి అనే పాత్రను పోషించాను. 1954 సంవత్సరంలో అధిక వృష్టి వల్ల జనగామ దగ్గర రఘునాథపల్లి లో రైలు పడిపోయింది. ఆ సందర్భంగా అధిక వృష్టి అనే కవిత రాశాను. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు గో విలాపం అనే కావ్య ఖండిక రాశాను. ఇలా స్వతహాగా కవిత్వం రాసినప్పటికీ కొందరి ప్రభావం నాపై ఉంది. భువనగిరి విశ్వ కర్మ హాస్టల్ లో అవధాని డోకూరి బాలబ్రహ్మాచారి గారు మా గురువు. వారి ప్రభావం నా పద్యంపై ఉంటుంది. కోవెల సంపత్కుమారాచార్య, అప్పలాచార్య నాకు సంస్కృతం నేర్పిన గురువులు. వీరి ప్రభావం నాపై తప్పక ఉంటుంది.

**మీ సాహిత్య ప్రస్థానాన్ని సంక్షిప్తంగా వివరించండి.**

చిన్నతనం నుంచే పద్యాలూ నాటికలు రాశాను కానీ వాటిని భద్రపరచలేక పోయాను. వడాయి గూడెం పాఠశాలలో పని చేసినప్పుడు వయోజనులకు విద్య నేర్పాలన్న లక్ష్యంతో సింగి సింగడు నాటిక రాశాను. తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణం నా పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం. తెలుగులో గొలుసుకట్టు నవలలు నా ఎం.ఫిల్. సిద్ధాంత గ్రంథం.

స్వాతంత్ర్యోద్యమం - ఆంధ్రప్రదేశ్‌లో దాని స్వరూపం అనేక చారిత్రక గ్రంథం,

విఠలేశ్వర శతకము పేరుతో సామాజిక స్పృహ నిండిన సచిత్ర పద్యకృతి

మధురకవి కూరెళ్ళ పీఠికలు (సేకరణ: దాసోజ్ఞ్ఞానేశ్వర్), స్మృత్యంజలి (పద్య గద్య కవితా సంకలనం), కవితా చందనం (పద్య కవితా సంకలనం), తెలంగాణా కాగడాలు- సీస మాలిక (తెలంగాణ ప్రముఖులు), పంచమి వ్యాస సంపుటి

వెల్లంకి వెలుగు (ఎల్లంకి గ్రామ చరిత్ర), కవిరాజు ఏలె ఎల్లయ్య - సంక్షిప్త జీవిత చరిత్ర, చద్దిమూటలు, దొందూ దొందే మనకథ (బుర్రకథ), శిల్పాచార్యులు (పద్య కవితా సంకలనం), హైదరాబాదు సంస్థానం : నల్లగొండ జిల్లాలో రజాకార్ల దురంతాలు, కాన్ఫిడెన్షియల్ రిపోర్టు (గద్య కవితా సంకలనం), శతాధిక శీర్షికలు-శతాధిక సీసాలు (పద్య కవితా సంకలనం), తెలంగాణ ఉద్యమ కవితలు (పద్య గద్య కవితా సంకలనం), నానీనేత్రాలు మొదలైన గ్రంథాలు రాశాను. విఠలేశ్వర శతకము పండిత పామర జనరంజకంగా పలువురి మన్ననలు అందుకోవడం సంతోషాన్నిచ్చింది.

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యమ కవి గా మీకు ప్రత్యేకమైన స్థానం ఉంది. మీరు చేసిన ఉద్యమాల గురించి చెప్పండి.**

ఉద్యమం అంటే ప్రయత్నం అని నైఘంటికార్థం. మొదలుపెట్టిన కార్యము చిన్నదా పెద్దదా అన్న తేడా లేకుండా అది పూర్తయ్యేంత వరకూ పట్టుదలతో పని చేయాలన్నది నా భావన. ఇలా



ఉద్యమస్ఫూర్తితో నా జీవితంలో అనేక కార్యాలు నిర్వహించాను. ముఖ్యంగా నా చిన్నతనంలోనే నీరునెముల గ్రామంలో హనుమదాలయంలో నిమ్న కులాల తో కలిసి సహపంక్తి భోజనం ఏర్పాటు చేశాను. ఆ సహ పంక్తి భోజనంలో అగ్రవర్ణాల విద్యార్థులు కూడా భోజనం చేశారు. ఈ సంగతి తెలిసి అగ్రవర్ణ పెద్దలు తమ పిల్లల నాలుకలను బంగారు తీగతో కాల్చి వారి కుటుంబం లోనికి అనుమతించారు. నన్ను ఊరు నుంచి వెళ్లగొట్టాలని మా మేనమామలపై ఒత్తిడి తెచ్చారు అయినా నేను వెనుకడుగు వేయలేదు ఇది నా జీవితంలో తొలి ఉద్యమంగా భావిస్తాను. 1960లో వడాయి గూడెంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నప్పుడు అక్షరాస్యత ఉద్యమానికి శ్రీకారం చుట్టాను. 'చచ్చే ముందు సంతకమైనా నేర్చుకోవాలి' అనే నినాదంతో పెద్దలకు సంతకాలు నేర్పడం మొదలుపెట్టాను. దీనిలో విజయం సాధించగలిగాను. అనేకులు చదువు నేర్చుకోవడం ద్వారా చైతన్యంపొందారు. అదే సంవత్సరం భోనగిరి విశ్వకర్మ వసతిగృహం ప్రారంభోత్సవంలో ఆనాటి సభాధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులు జి ఎస్ రెడ్డి గారు ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సమక్షంలో కళాకారులను అవమానిస్తూ మాట్లాడినప్పుడు శిల్పాచార్యుల ఔన్నత్యంపై పద్యం చెప్పాను. ముఖ్యమంత్రి గారు గుర్తించి శిల్పకళకు జరుగుతున్న అన్యాయంపై బాధపడ్డారు. ఉపాధ్యాయ ఉద్యమంలో నా వంతు బాధ్యత నెరవేర్చాను. రాష్ట్రోపాధ్యాయ సంఘంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ అనేక బాధ్యతలలో సేవలందించాను. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలయానికి బమ్మెర పోతన పేరు పెట్టాలని గొప్ప ఉద్యమమే చేశాము. రాజమండ్రిలో విశ్వవిద్యాలయానికి నన్నయ పేరు కడపలో విశ్వవిద్యాలయానికి యోగి వేమన పేరు పెట్టినప్పుడు నల్లగొండ విశ్వ విద్యాలయానికి పోతన పేరు పెట్టడం సమంజసమని ఆనాటి ప్రజాప్రతినిధులను అవకాశం ఉన్న ప్రతిచోటా నిలదీశాను. పోతన నామ సాధన కమిటీ ఏర్పరిచి దానికి అధ్యక్షుడిగా ఉండి ముందు నడిపించాను. నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో అఖండ భాగవత పఠనం చేశాం. మహాత్మా గాంధీ పేరు పెట్టినప్పుడు మహాత్మునిపై అభిమానంతో ఉద్యమాన్ని చాలించినా ఇప్పటికైనా ఆ ప్రాంతానికి పోతన నగరం అని పేరు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని కవులెందరో ఉన్నారు. వారిని సాహితీ ప్రపంచానికి పరిచయం చేయడం కోసం ఊరూరా పోతన ఉద్యమం ప్రారంభించాను. అనేక మంది కవులను గుర్తించి సముచిత బిరుదులతో సత్కరించడం వారిని సాహిత్యాన్ని లోకానికి పరిచయం చేయడం జరిగింది. పల్లె ప్రజలకు కూడా సాహిత్యం, విజ్ఞానం అందుబాటులోకి రావాలన్న ఉద్దేశంతో గ్రంథాలయాల స్థాపనకు శ్రీకారం చుట్టాను. మొదట నా ఇంటిని గ్రంథాలయంగా మార్చాను. అనంతరం ఆ గ్రంథాలయ స్ఫూర్తితో రామన్నపేట మండలం కక్కిరేణి లో, కోదాడ మండలం అమీనాబాద్‌లో, వలిగొండ మండలం చిత్తాపురం, మొగిలి పాక చౌటుప్పల్ మండలం తంగడపల్లి నార్కట్ పల్లి మండలం షాపల్లి, ఆత్మకూరు ఎం మండలం రాఘవాపురం గ్రామాలలో గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయి. ఇంకా అనేక మంది యువకులు గ్రామాలలో గ్రంథాలయాలు ప్రారంభించడానికి ముందుకు వస్తున్నారు. కొత్తగా గ్రంథాలయం ప్రారంభించే వారికి నా వంతుగా 100 పుస్తకాలు బహూకరిస్తున్నాను. ఇవన్నీ ఉద్యమ స్ఫూర్తితో నడిపిన కార్యక్రమాలే.

**ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అనేక సాహిత్య సంస్థలు స్థాపించారు కదా! వాటి వివరాలు చెప్పండి.**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కవులు కళాకారులను వెలికితీసే ప్రయత్నంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అనేక చోట్ల సాహిత్య సంస్థలు ప్రారంభించాను. 1986లో రామన్నపేటలో సాహితీ స్నేహితులు, 1994లో చౌటుప్పల్‌లో అక్షర కళాభారతి, 2000 సంవత్సరంలో నల్లగొండలో మిత్ర భారతి, 2003 సంవత్సరంలో భువనగిరిలో భువన భారతి, 2005 సంవత్సరంలో మోత్కూర్‌లో ప్రజా భారతి, 2006 సంవత్సరంలో రామన్నపేటలో సాహితీ మిత్రమండలి 2008 సంవత్సరంలో దేవరకొండలో మల్లెల భారతి, 2015లో నార్కట్పల్లిలో జన భారతి, 2017 లో రామన్నపేటలో బాలభారతి, 2019లో వలిగొండలో ఆత్మీయ భారతి, 2021లో రాష్ట్రస్థాయి సంస్థగా మహిళా భారతి ప్రారంభించాను. 2016లో యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం



వ్యవస్థాపనం చేయడమైంది. రామన్నపేట చౌటుప్పల్ పరిసర ప్రాంతాలలో విద్యా వ్యాప్తి కోసం అనేక విద్యాలయాలు కూడా స్థాపించాను. వీటన్నిటి లక్ష్యం పల్లెల్లో సాహిత్య పరిమళాలు వెద జల్లడమే.

**పనిచేసిన ప్రతి చోట పత్రిక స్థాపించారని ప్రతీతి. ఆ వివరాలు చెప్పండి.**

విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి పత్రికలు బలమైన సాధనాలు. నేను ఉపాధ్యాయుడిగా ఉపన్యాసకుడిగా పనిచేసిన పాఠశాలల్లో కళాశాలల్లో కొన్ని పత్రికలు వెలువరించి విద్యార్థినీ విద్యార్థులను కవులుగా రచయితలుగా తీర్చిదిద్దాను. 1961లో వలిగొండ మండలం గోకారం ప్రాథమిక పాఠశాలలో బాపు భారతి, 1963లో వెల్లంకి ఉన్నత పాఠశాలలో మన తెలుగు తల్లి, 1967లో వలిగొండ ఉన్నత పాఠశాలలో వలి వెలుగు, 1977లో సిరిపురం ఉన్నత పాఠశాలలో చిరంజీవి, 1982లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నల్లగొండలో ప్రియంవద, 1987లో ప్రభుత్వ జూనియర్ కళాశాల రామన్నపేటలో ముచికుంద పత్రికలతో పాటు 1974లో రామన్నపేట కేంద్రంగా రాష్ట్రోపాధ్యాయ సంఘం పక్షాన మన పురోగమనం పత్రిక, 2005లో చౌటుప్పల్ గ్రంథాలయం పక్షాన లేఖిని పత్రికలను స్థాపించాను. ఈ పత్రికలకు రాసిన ఆనాటి విద్యార్థులు ఎందరో నేడు కవులుగా రచయితలుగా స్థిరపడడం ఆనందాన్ని కలిగిస్తుంది.

**ఒక మారుమూల గ్రామంలో మహా గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్న ఆలోచన మీకు ఎందుకు వచ్చింది?**

గ్రంథాలయ స్థాపనకు ప్రేరణ నా కష్టాలే. విద్యార్థి దశలో పుస్తకాలు కొనుక్కొనే శక్తి లేక చదువుకోవడానికి చాలా బాధపడ్డాను. ఆ బాధలు ఇప్పుడు విద్యార్థులకు రాకూడదు. 1954 లోనే నా మిత్రుల సహకారంతో వెల్లంకిలో శంభులింగేశ్వర గ్రంథాలయం స్థాపించాను అది ఎక్కువ కాలం నడవలేక పోయింది.



1962లో మా ఇంటిలోనే కూరెళ్ళ లక్ష్మీ వెంకట రాజయ్య గ్రంథాలయం ప్రారంభించాము. అప్పటినుండి మా ఊర్లో పెద్ద గ్రంథాలయం స్థాపించాలన్న కోరిక బలపడింది. ఆ సంకల్పం ఫలితంగా మొదట ఐదువేల పుస్తకాలతో నా సొంత ఇంటి నే గ్రంథాలయంగా మార్చినాను. కొంతమంది పెద్దలు 'ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం' అని నామకరణం చేశారు. 13 ఫిబ్రవరి 2014 నాడు ఆనాటి నల్లగొండ జిల్లా కలెక్టర్ తొగర్ల చిరంజీవులు గారి చేతుల మీదుగా ప్రారంభించి సమాజానికి ఈ గ్రంథాలయాన్ని అంకితం చేశాను. గ్రంథాలయ నిర్వహణకు ఆచార్య కూరెళ్ల ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. ఈ గ్రంథాలయంలో నేటికి సుమారు రెండు లక్షల వరకూ పుస్తకాలు సమకూరాయి. వేరే రాష్ట్రాల నుండి కూడా అనేక మంది పరిశోధక విద్యార్థులు గ్రంథాలయానికి వస్తూ ఉండటం సంతోషం కలిగిస్తున్నది. ఇదే స్ఫూర్తితో సుమారు 50 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణం కూడా పూర్తి చేయగలిగాను.

**పఠనాసక్తి తగ్గిపోతున్న ఈ తరుణంలో ఒక మారుమూల ప్రాంతంలో ఇంత పెద్ద గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఇది ఎంతవరకు సఫలీకృతం అవుతుందని భావిస్తున్నారు?**

పుస్తక పఠనం అనేది ఒక రుచి. ఆ రుచి దొరికిన వాడు పుస్తకాలు వదిలిపెట్టడు. ఆ రుచిని కల్పించడానికి మనం కొంత కష్టపడాలి. నేటి తరం పిల్లలకు గ్రంథాలయాన్ని పరిచయం చేయాలి. పిల్లలను ఆకర్షించే పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచాలి. క్రమంగా పిల్లలు వాటిని చదివే ప్రయత్నం చేస్తారు. చదవడం అలవాటు అయితే తప్పక చదువుతారు. పుస్తక పఠనం మనిషిని మారుస్తుంది. దేవుని రాజ్యం నీలోనే ఉంది అనే టాల్స్టాయ్ రాసిన చిన్న పుస్తకమే గాంధీ జీవన విధానాన్ని మార్చేసింది. Reading Makes a perfect man. ప్రతి ఊర్లో ఒక గ్రంథాలయం ఉండటం సామాజిక రుగ్మతల నివారణకు ఉపయోగపడుతుంది. విజ్ఞాన కేంద్రంగా విలసిల్లుతోంది. అందుకే చిన్నదో పెద్దదో ఒక గ్రంథాలయం ప్రతి ఊరిలో ఉండాలన్నదే నా తపన. చదువుకున్న వాళ్ళు అంతా పట్టణాల్లో స్థిర పడ్డారు. పల్లెలో పుట్టి నగరాలకు వెళ్లి స్వస్థానం మరిచిపోతున్న వాళ్లు అనేకులు. పుట్టిన ఊరిని మర్చిపోయే దుస్థితి నేడు కనిపిస్తున్నది. దేశానికి పట్టుకొమ్మలు పల్లె పట్టులు. ఈ పల్లెల్లో గ్రంథాలయం పెడితే పుస్తకం కోసమైనా పల్లెకు వస్తారని ఆశ. ఇది ఇప్పుడు నెరవేరుతుంది. ఎందరో పరిశోధకులు వెల్లంకి బాట పడుతున్నారు. పల్లెల్లోని ప్రశాంతత పట్టణాలలో లేదని వారు

అభిప్రాయపడుతున్నారు. కనుక నా ఉద్దేశం నెరవేరిందని భావిస్తున్నాను. పల్లెల పట్ల నాకు ఎనలేని గౌరవం. నాపల్లెకు ఇలా నమస్కరించాను

పల్లియలోనె పుట్టితిని పల్లియయే నను పెంచె తల్లియై
ఇల్లును వాకిలిన్ తనకు నెంతయు బ్రత్కు మెరుంగు పెట్టె నా
పల్లియ అమ్మ ఆవనుచు పల్కులు పల్కగ నేరిపించె నా
పల్లియె నాకు దైవతము ప్రాణము ఓ ప్రభు విఠ్ఠలేశ్వరా!

ఇల్లిల్లు తిరిగి పుస్తకాలు అందజేసి చదివించే ప్రయత్నం చేస్తున్నాను. ఉత్తమ పాఠకులకు వెయ్యి రూపాయల నగదు బహుమతి కొన్ని పుస్తకాలు అందజేసి సత్కరిస్తున్నాను.

**మీరు పెన్షనర్. జీతం కూడా తక్కువ. భారీ ప్రాజెక్టుకు పూనుకున్నారు. ఎలా సాధ్యమవుతుంది?**

వాస్తవంగా నా వయసు దృష్ట్యా, నా పరిస్థితి దృష్ట్యా నేను ఇంత పెద్ద ప్రణాళికతో కూడిన ఈ నూతన గ్రంథాలయ భవన నిర్మాణం పెట్టుకోవడం స్థాయికి మించిన పనే. అట్టడుగు వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్న ఈ పుస్తకాల సంరక్షణార్థం అనివార్యంగా చేయాల్సి వచ్చింది. దీని ఆర్థిక వనరులకు కొన్ని నియమాలు పెట్టుకున్నాను. ప్రధానంగా ప్రభుత్వం నుండి ఏ రకమైన నిధులు తీసుకోకూడదనుకున్నాను. నా శిష్యులు అభిమానులు శ్రేయోభిలాషుల ఆర్థిక సహకారం లభిస్తుందన్న ఆత్మవిశ్వాసమే నేను చేయబూనే కార్యక్రమానికి పెట్టుబడి. స్వార్థం లేని ఏ పని చేసినా సఫలం అవుతున్నదనేదే నా బలమైన నమ్మకం. దానికి తోడు నా ఇష్టదైవం శిరిడి సాయిబాబా అనుగ్రహం, పెద్దల ఆశీస్సులు, నా కుటుంబ సభ్యుల సహకారంతో తప్పక అనుకున్నది సాధిస్తాను.

**సరళ సుందర పద్యానికి చిరునామా కూరెళ్ళ అంటారు కదా! పద్య రచన పై మీ అభిప్రాయం ఏమిటి?**

ప్రాచీన కాలంలో పద్యం ఎంత ప్రౌఢంగా పాండిత్యంతో ఉంటే అంత గౌరవం. ఎందుకంటే ఆనాడు శ్రోతలంతా పండితులే. ఇప్పుడు పరిస్థితులు మారాయి. వచన కవిత్వం మినీ కవిత్వం వచ్చిన తర్వాత సరళమైన భాష పాఠకులకు చేరుతుంది. పద్యం కూడా అంతే సరళంగా ఉండాలి. కవిత్వంలో కవిత్వమే కనిపించాలి. పాండిత్యం ముసుగులో కవిత్వం కనుమరుగు కాకూడదు. పద్యం సుందరంగా సులభమైన సరళమైన శైలిలో భాషలో ఉండాలని నా ప్రగాఢ ఆకాంక్ష. నా విఠలేశ్వర శతకం నిఘంటు సహాయం లేకుండా చదువుకోవచ్చు

ఉదాహరణకు

దానము చేయ కోర్కి గల దాతకు పేదరికమ్ము నిత్తువే
పానము చేయకోర్కి గల పాపికి పెద్దరికమ్ము నిత్తువే
గానము చేయకోర్కి గల గాత కు గార్ధభ కంఠమిత్తువే
నేననలేను స్వామి జనమేమను నిన్నిల విఠ్ఠలేశ్వరా!

**సాధారణ పాఠకులే కాదు. వర్తమాన కవులు కూడా చదవడం లేదన్న అపప్రథ ఉంది. మీరేమంటారు?**

వర్తమాన కవులలో ప్రధానంగా లోపించింది అధ్యయనం. రాయడం మీద ఉన్న తపన చదవడం మీద ఉండటం లేదు. ఏదేని సంకలనంలో తన కవిత అచ్చు అయితే తన కవిత తప్ప మరొక కవిత కూడా చదవడం లేదు. ఈ స్థితి మారాలి. ఎన్ని పుస్తకాలు ఎక్కువ చదివితే అంత మంచి కవిత్వం వస్తుంది. ఒక పుస్తకం చదివితే దాని ప్రభావం తనపై పడుతుందనే కవులు కూడా లేకపోలేదు. ఇది అవాస్తవం. అందరి కవిత్వం చదివినప్పుడే తనదైన సొంత శైలిని ఏర్పరచుకోవడానికి వీలవుతుంది. ఉత్తమ కవి కావాలంటే మొదటగా ఉత్తమ పాఠకుడు కావాలి. పుస్తక ప్రాశస్త్యం గురించి నా శతకంలో ఇలా చెప్పుకున్నాను.

పుస్తకమున్న గేహమున పుణ్యులు తోడుగ నుండినట్టులే
పుస్తకమున్న హస్తమున పుత్తడి కంకణముండినట్టులే
పుస్తకమున్న నేస్తమున పూర్ణగుణంబులు నుండినట్టులే
పుస్తకమున్న మనస్సుకు పూర్ణత నిచ్చును విఠ్ఠలేశ్వరా!


## తంగేడు మొదటి వార్షిక సంచిక... మీ కోసం

**సాహిత్యాభిమానులకు వేదికగా నిలుస్తున్న "తంగేడు"ను ప్రారంభించి అక్టోబర్ 16కు మొదటి వసంతం దిగ్విజయంగా పూర్తి చేసుకుంటోంది. ఎన్ని అవాంతరాలెదురైనా వెనుకడుగు వేయకుండా కొనసాగిస్తున్న మన "తంగేడు", వార్షిక సంచికగా ముస్తాబవుతున్నది. ప్రముఖ సాహితీవేత్తల వ్యాసాలు, ప్రత్యేక కథలు, ప్రఖ్యాత కవుల కవితలతో ప్రింటు కాపీతో మీ ముందుకు రాబోతోంది. ఆశీర్వదించండి.**

**- ఎడిటర్**

కవిత



# నీవొక పర్జన్యం



డా॥ కొండపల్లి నీహారిణి, 98663 60082

నీవు నిస్సంశయంగా మహాకవివే
నీవు నిశ్చయంగా పథనిర్దేశకునివే
నీవు నిశ్చలంగా సమర కార్యశీలివే
నీవు నిరాలంబంగా నిలిచిన ధీరునివే

నీ నిలువెత్తు నడక ఎప్పుడూ
"అనిమొన"కు ముందుండే సైన్యాధిపతే
నీ వ్యక్తిత్వం భారత పద్మవిభూషణ కీర్తి శిఖరం
నీ పాండిత్యం తెలుగు కీర్తికి సమున్నత ఉదాహరణం

బతుకు గురించి
భాష గురించి
నీకు తెలిసినంత ఎవరికీ తెలియలేదు
పలుకుబడులగురించి
యాస బడిన గోస గురించి
నీవు తెలిపినంత ఎవరు తెలుపలేదు

చేతులు కాలిన తర్వాత ఆకులు
పట్టుకునే మనస్తత్వాన్ని ముందే
పసిగట్టి మేము ఎట్లుండాలో చెప్పిన నీకు
కాలే కడుపుల కడు దయనీయతకు
కరిగి కన్నీరు కార్చిన నీకు
ఎన్ని శిలావిగ్రహాలను నిలిపినా
ఎన్ని సంస్థలకు నీ పేరు పెట్టినా
నీవు చేసిన సేవకు సరితూగునా
నీది ఏడుమల్లెల ఎత్తు పల్లీయుల మనసు
ఎంత జాగ్రత్తగా తూచినా
మా కృతజ్ఞత తీరదు
నిన్ను మరచిననాడు మేలు మరచిన ద్రోహమే
నీ బాట నడవనినాడు
మేము చేసుకున్న ఋణం తీరదు

మా గోడు "నా గొడవ"గా నీవంటూ
చేతన జల్లులు కురిపించి
తెలివి చిగురులు మొలిపించిన
నీ గొంతు ఓ సాహసం
నీ భావం ఓ సౌజన్యం
నీ రూపం గంభీరం
నీవొక పర్జన్యం

*(తెలంగాణ జాగృతి కాళోజి జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న నిర్వహించిన కవి సమ్మేళనంలో వినిపించిన కవిత)*

కవిత

# పూల జాతర బతుకమ్మ



ఐ.వి. సుబ్బాయమ్మ, 94903 47205

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బతుకు నీయవమ్మా ఉయ్యాలో అంటూ
మన సంస్కృతికి ప్రతీక అయినది
బతుకమ్మ పండుగ
బతుకమ్మ అంటేనే పూల జాతర
మగువల నవ్వులతో
తీరొక్క పువ్వులతో పూజించే ఆచారం
ఉత్సాహమే... ఉత్సాహం...



పోయిరావమ్మా ఉయ్యాలో
మళ్లీ రావమ్మ ఉయ్యాలో
గడ్డి పూలకు కూడా
పూజార్హతను ఇచ్చిన పండుగిది
సద్దులనాడు వీడ్కోలు తీసుకునే
జీవన సత్యానికి
ఇదో ప్రాతిపాదిక
బంగారు తంగేడు బతుకమ్మతో
తలమానికమైతే
ఆకాశంలో సగానికి
అందమైన ప్రాతినిధ్యం ఇది
తెలంగాణ జీవకాంతిలో
ఇది ఆరో ప్రాణం...

సాహితీ సమాచారం

## 'మెతుకు లేని అనాథ బతుకులు' పుస్తకావిష్కరణ



మానవతా హృదయం ఉంటేనే మంచి సాహిత్యం సృష్టించగలమని తెలంగాణ భాష సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17న సాథనిక కేర్ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో మద్దుకూరి సాయిబాబా రాసిన 'మెతుకు లేని అనాథ బతుకులు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ అనాథల గుండె చప్పుడు ప్రేరేపించే ఈ పుస్తకం అందరి మన్ననలు పొందుతుందన్నారు. హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, కాసర్ల నరేష్‌రావు, ప్రభుత్వ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డాక్టర్ కవితారెడ్డి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఉషానవీన్, గంట్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

## కవిత్వమే కాళోజి వ్యక్తిత్వం...

సెప్టెంబర్ 9, 2021న, పద్మభూషణ్ కాళోజి జన్మదిన సందర్భంగా సాహితీ గౌతమి అంతర్జాల ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. ఈ సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కాళోజి ఆత్మీయుడు నాగిళ్ళ రామశాస్త్రి "కాళోజి వ్యక్తిత్వం, కవిత్వం, అనే అంశం మీద ప్రసంగిస్తూ, కాళోజి వ్యక్తిత్వం కవిత్వంలో ప్రతిఫలించిన తీరు సోదాహరణంగా వివరించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కాంచనపల్లి గో.రా. కాళోజి కవిత్వము, నిర్మాణ శిల్పము అనే అంశం మీద ప్రసంగిస్తూ కాళోజిని నిరలంకార సౌందర్య సాధకునిగా అభివర్ణించారు. సభకు సాహితీ గౌతమి అధ్యక్షులు గంద్ర లక్ష్మణ్ రావు అధ్యక్షత వహించారు. పలువురు సాహితీ ప్రముఖులు పాల్గొన్న ఈ సభకు సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి గాజుల రవీందర్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

## ప్రొ॥ జయశంకర్ స్మారక కవితా సంకలనం ఆవిష్కరణ



సెప్టెంబర్ 12న హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో ప్రొ॥ జయశంకర్ స్మారక కవితా సంకలనం ఆవిష్కరణ సభలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, పి. బడేసాబ్, ఆవిష్కర్త డా॥ నందిని సిధారెడ్డి, రాచాల యుగంధర్ గౌడ్, డా॥ నాళేశ్వరం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి భద్రయ్యకు నివాళి



17 జనవరి 1945న జన్మించిన మడిపల్లి భద్రయ్య 18 సెప్టెంబర్ 2021న తన తనువు చాలించారు. వీరు పూర్వ ఆదిలాబాదు జిల్లా తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలు తీగసాగడానికి పాదుగా నిల్చిన అంకిత భావం కలిగిన కళా రంగాల కార్యకర్త. జాతీయ స్థాయిలో రాష్ట్రపతి పురస్కారం పొందిన ఉపాధ్యాయుడు. జన్నారం మిత్రకళా సమితి, నర్సాపూర్ నవతా కళా సమితి, ఇచ్చోడ ప్రత్యూష కళా నికుంజం ఇలా అనేక సంస్థల వ్యవస్థాపకుడు కూడ. భద్రయ్య తెలంగాణ భాషా నిఘంటు నిర్మాత. పూర్వ ఆదిలాబాదు విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి. తెలంగాణ తొలి, మలి ఉద్యమాలలో పాల్గొన్న యోధుడు.

భద్రయ్య 2011లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, 2014లో శాతవాహన యూనివర్సిటీ సాహితీ పురస్కారం, అన్నమయ్య కళాక్షేత్రం, తానా వారి విశిష్ట పురస్కారం, రంజనీ సాహిత్య సంస్థ పద్య కవిత్వ పురస్కారం ఇలా అనేక పురస్కారాలు, సత్కారాలకు పాత్రుడైనారు.

వీరి మరణంతో తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాలు ఒక పెద్దదిక్కును కోల్పోయాయి. "తంగేడు" మడిపల్లి భద్రయ్య లేని లోటుకు చింతిస్తూ నివాళి ఘటిస్తున్నది.

## రజనీశ్రీ స్మారక సాహిత్య పురస్కారానికి కవితా సంకలనాలు ఆహ్వానం

ప్రముఖ నాటక కళాకారులు మరియు నాట్యాచార్యులు రజనీశ్రీ గారి స్మారక సాహిత్య పురస్కార ప్రదానం జాతీయ సాహిత్య పరిషత్ ద్వారా ప్రతి యేటా అందించాలని వారి కుమారుడు, సాహితీవేత్త, కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి శ్రీ జి.వి.శ్యాంప్రసాద్ లాల్ గారు నిర్ణయించారు.ఈ సంవత్సరం తొలి పురస్కారం కవిత్వానికి అందించడం జరుగుతుంది. ఒక సంవత్సరం కవిత్వం, ఒక సంవత్సరం కథ, ఒక సంవత్సరం నవల ప్రక్రియలకు ఈ పురస్కారం అందించడం జరుగుతుంది.పురస్కారం కింద ప్రశంసా పత్రం,శాలువాతో పాటు 10,116/- నగదు బహుమతి అందించబడును.

కవిత్వంలో పద్య, గేయ, వచన కవితల సంకలనాలు మాత్రమే పంపగలరు. దీర్ఘ కవితలు,లఘు రూప ప్రక్రియలకు చెందినవి స్వీకరించబడవు.

కవులు వారి వారి కవితా సంకలనాలు 2019,2020, 2021 సంవత్సరాలలో ముద్రించబడినవి మాత్రమే పోటీలకు పంపించాలి.. ఇవి ప్రతిదీ నాలుగు ప్రతులు ఈ క్రింది చిరునామాకు అక్టోబర్ 16వ తేదీ 2021 లోగా చేరునట్లు పంపించగలరు. ఆ తర్వాత వచ్చిన ఎంట్రీలు స్వీకరించబడవు.

**గాజుల రవీందర్**
8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ -505001, ఫోన్ : 9848255525

# ఉగాది కథల పోటీ ఫలితాలు 2021

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాహిత్య పక్ష పత్రిక **"తంగేడు"** ప్లవనామ సంవత్సర ఉగాది కథల పోటీ ఫలితాలను ప్రకటిస్తున్నది. ఈ కథల పోటీకి ప్రముఖ విమర్శకులు, కథకులు ఆడెపు లక్ష్మీపతి, పాలపిట్ట సంపాదకులు గుడిపాటి, ప్రముఖ కథా రచయిత వెల్దండి శ్రీధర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఈ పోటీకి విశేష స్పందన లభించింది సుమారు 250 కథలు మా పరిశీలనకు వచ్చాయి. 2 దశల వడపోత తర్వాత 23 కథలు అర్హమైనవిగా తేలాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకి అర్హమైన కథలు, సాధారణ ప్రచురణకి యోగ్యమైన కథల జాబితాను ఈ దిగువ ఇస్తున్నాము.

**ప్రథమ బహుమతి : రూ. 20,000/-**
**"మైదాకు వసంతం"**
కోట్ల వనజాత, సెల్ : 9985617643

**ద్వితీయ బహుమతి : రూ. 10,000/-**
**"దూరం"**
పెద్దింటి అశోక్ కుమార్, సెల్ : 9441672428

**తృతీయ బహుమతి : రూ. 5,000/-**
**"పులికొండకు వోతం రా"**
పి.వి.ఆర్. శివకుమార్, సెల్ : 9594996990

**సాధారణ ప్రచురణ (ఒక్కొక్క కథకి రూ. 1000/-) కి ఎంపిక అయిన కథలు**

1. జీవితం అందమైనది (పి.వి.వి. సత్యనారాయణ)
2. వలస కూలీ (డాక్టర్ ఎమ్. సుగుణరావు)
3. మత్తయ్య చదువు (కె. విజయ లక్ష్మి)
4. నజరానా (కలాపిని)
5. వీడిన నీడ (పి .యమున)
6. పునర్జన్మ (ఇంద్రగంటి నర్సింహమూర్తి)
7. తురుంఖాన్ (ఉట్టిగంటి గోపికృష్ణ )
8. ఒప్పుకోలు (బి.వి.ఎన్ స్వామి)
9. కోటిదీపాల వెలుగు (సాగర్ల సత్తయ్య)
10. ధీరోధాత్రి (కట్ట రాంబాబు)
11. సయోధ్య (వాసవి దత్త)
12. నాయిన చెప్పిన అబద్ధం (స్ఫూర్తి)
13. పోలీస్ రియల్ వారియర్ (గంగాడి సుధాకర్)
14. బంగారు కలలు (దేశ రాజు)
15. మూడో కోడలు (రమణ యశస్వి)
16. ఒడిబియ్యం (కిరణ్ విభావరి)
17. నడిపోడు (నామిని సృజన దేవి)
18. అయినా మనిషి మారలేదు (సంగనభట్ల నర్సయ్య)
19. మొగుడూ పెళ్ళాలు ( పి.నాగసాయి రమ్య )
20. అలుకుపూత (రావుల కిరణ్మయి)

**న్యాయ నిర్ణేతలకు "తంగేడు" పత్రిక పక్షాన మా హృదయపూర్వక ధన్యవాదాలు విజేతలందరికి మా అభినందనలు. పోటీలో పాల్గొన్న రచయిత/రచయిత్రులకు కృతజ్ఞతలు.**

**- కల్వకుంట్ల కవిత, ఎడిటర్**

# స్వీకారం




## శార్వరిలో కోయిల

తమ్మూరి రాంమోహన్ రావు
హైదరాబాద్.
ఫోన్ : 970 152 2234

వెల : రూ. 200/-




## ప్రపంచ యుద్ధం - క్రిమి సంహారం

సుభాషిణి తోట
సెల్ : 950 281 8774

వెల : రూ.50/-




## జ్ఞాన వాశిష్ఠము

అంబటిపూడి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి
హైదరాబాద్
సెల్ : 99498 49583

శ్రీ షిర్డిసాయిబాబా ట్రస్టు,
వెల : రూ. 150/-




## రత్నకవి నాటక సమాహారం

అంబటిపూడి వెంకటరత్నం
నల్లగొండ

శ్రీ షిర్డిసాయిబాబా ట్రస్టు,
సెల్ : 94914 16696
వెల : రూ. 150/-




## మాతృదేవోభవ

దారం గంగాధర్
నిజామాబాద్

దారం మందారం ప్రచురణలు
వెల : రూ. 100/-




## శ్రీమతికి ప్రేమతో

తొగర్ల సురేశ్
సెల్ : 99485 79588




## మొంబత్తి (కవితా సంపుటి)

కె. హరనాథ్
సెల్ : 9703542598

ప్రజాశక్తి బుక్‌హౌస్, నవచేతన బుక్ హౌస్, నవోదయ బుక్ హౌస్
వెల : రూ. 100/-




## ఘనపురం దేవేందర్ ముచ్చట

దశరత్ కొత్మీర్కర్
నిజామాబాద్
సెల్ : 90000 33384

వెల : రూ.100/-




## సందర్భ (వ్యాస సంపుటి)

సుధామ
సెల్ : 98492 97958

ఉషా రాణి
హైదరాబాద్,
వెల : రూ. 300/-


పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే
తెలంగాణ ఆడబిడ్డల పూలపండగ...
మన బతుకమ్మ వేడుక ....
ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు